PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 104 | విజయవాడ, మంగళవారం 15 నవంబర్ 2022 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 15 November 2022 | Rs

సిటీ

మోడీ తాతా.. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దు

- ఉక్కునగరంలో చిన్నారుల విజ్ఞప్తి

లోపలి పేజీలో..

శరత్ కమల్‌కు ఖేల్‌రత్న

- 25మందికి అర్జున
- 30న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డుల ప్రదానం



న్యూఢిల్లీ: దిగ్గజ టేబుల్ టెన్నిస్ ఆటగాడు ఆచంట శరత్ కమల్ దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న అవార్డు 2022కు ఎంపికయ్యారు. కేంద్ర యువజన, క్రీడా మంత్రిత్వశాఖ సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈనెల 30న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శరత్ కమల్ ఈ అవార్డును అందుకోనున్నారు.

ఖర్చులు పెరుగుతున్నాయి!

- ఆదాయం చాలడం లేదు
- సిఎంకు నివేదించిన అధికారులు
- పథకాలు ఆగకూడదన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

'రాష్ట్రంలో ఖర్చులు పెరుగుతున్నాయి. వివిధ వనరుల ద్వారా వచ్చే ఆదాయం గతంతో పోలిస్తే పెరిగినప్పటికీ, ఖర్చులకు చాలడం లేదు. ఈ పరిస్థితి ఖజానాపై భారంగా మారుతోంది. అనేక సమస్యలకు కారణమౌతోంది.' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఉన్నతాధికారులు నివేదించినట్లు తెలిసింది. వాణిజ్యపన్నులు, ఎక్సైజ్, గనులు, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో ముఖ్యమంత్రి సోమవారం సమావేశమైనారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆదాయం, ఖర్చులు తదితర అంశాలపై చర్చ జరిగింది. వివిధ మార్గాల ద్వారా ఇప్పటిదాకా వచ్చిన ఆదాయం, రావాల్సిన మొత్తం తదితర అంశాలను అధికారులు వివరించారు. ఆదాయం మెరుగ్గా ఉన్నప్పటికీ ఖర్చులకు తగినంతగా రావడం లేదని చెప్పినట్లు తెలిసింది. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలు ఆగకూడదని అన్నట్లు తెలిసింది. 'పథకాలను కొనసాగించాల్సిందే... దీనికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేసుకోండి' అని సిఎం అన్నారు. పథకాలతో పాటు వివిధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలను కూడా ఆపేది లేదని సిఎం చెప్పినట్లు తెలిసింది. 'ప్రభుత్వ కష్టాలు ఎలా ఉన్నప్పటికీ పథకాలను... సంస్కరణలను ముందుకు తీసుకుపోవాలి' అని ఆయన అన్నట్లు సమాచారం.

అక్రమ మద్యంపై దృష్టి సారించండి

అక్రమ మద్యంపై అధికారులు దృష్టి సారించాలని ఈ సమావేశంలో సిఎం సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యల వల్ల రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గాయని ఆయన చెప్పారు. ధరలు పెంచడం, బెల్ట్ దుకాణాలను నివారించడం, పర్మిట్ రూమ్‌ల రద్దు వంటి అంశాల వల్ల రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గాయని అన్నారు. అయితే, పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా రావడం, స్థానికంగా తయారీ వంటి అంశాల వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదని చెప్పారు. ఎస్ఇబి అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. పరివర్తన కార్యక్రమం కింద సారా తయారీ, అక్రమ మద్యంపై ఆధారపడే వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగు, రవాణా వంటివాటిపై నిఘా పెట్టాలని, అలాంటి వృత్తిని సాగిస్తున్న వారిని గుర్తించి వారికి ప్రత్యేకంగా ఉపాధి మార్గాలు చూపించాలని సూచించారు.

పన్నులపై అవగాహన పెంచండి

వాణిజ్య పన్నుల శాఖపై జరిగిన చర్చలో పన్ను చెల్లింపుదారుల్లో అవగాహన పెంచాలని సిఎం సూచించారు. అవగాహన పెరిగితే ఎగవేతదారుల సంఖ్య తగ్గుతుందని అధికారులు ఆ దిశలో చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రానికి వ్యాపారం కోసం వచ్చే వారికి ఇక్కడ స్నేహపూర్వక వాతావరణం ఉందన్న విషయాన్ని వివరించాలన్నారు. పెట్టుబడులు వస్తే రాష్ట్ర ఖజానాకు ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. అందుకే ఎప్పటికప్పుడు ట్రేడ్ అడ్వయిజరీ సమావేశాలను నిర్వహించాలని సూచించారు. ఖజానాకు రావాల్సిన ఆదాయానికి గండి కొట్టే విధంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ

భూముల రిజిస్ట్రేషన్, భూ సర్వే వంటి అంశాలపై గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి శిక్షణ కల్పించాలని జగన్ సూచించారు. సచివాలయాల్లో ఏయే పత్రాలను రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునన్న దానిపైనా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను అప్‌గ్రేడ్ చేసేందుకు కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సిఎస్ సమీర్ శర్మ, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాజధాని రైతులకు నోటీసులు

- వ్యక్తిగత విచారణకు రావాలని సిఆర్‌డిఎ అధికారుల హుకుం
- ఆగ్రహించిన రైతులు - ర్యాలీ, సిఆర్‌డిఎ ముందు ధర్నా

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాజధాని మాస్టర్‌ప్లాన్ మార్పులపై స్వయంగా విచారణకు రావాలంటూ అమరావతి ప్రాంత రైతులకు సిఆర్‌డిఎ అధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో, కలకలం రేగింది. ఈ నోటీసులపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్, జోనల్ వ్యవస్థలో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జిఒలను రాజధాని రైతులు వ్యతిరేకిస్తున్నారు. హైకోర్టు జోక్యంతో అధికారులు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మొత్తం 5,771 మంది రైతులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. రాజధాని గ్రామాల్లో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించిన గ్రామసభలో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానాలు చేశారు. జిల్లా కలెక్టర్ ద్వారా సిఆర్‌డిఎకు పంపారు. అయితే, వీరంతా తిరిగి వ్యక్తిగత విచారణకు హాజరు కావాలంటూ సిఆర్‌డిఎ అధికారులు రైతులకు నోటీసులు జారీ చేశారు. ఈ చర్యను వ్యతిరేకిస్తూ రైతులు రాజధాని నుంచి విజయవాడ సిఆర్‌డిఎ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. తమకు నోటీసులు ఇవ్వడంపై తప్పుబట్టారు. సిఆర్‌డిఎ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తాము అమరావతికి భూములు ఇచ్చి ఇప్పటికే తీవ్రంగా నష్టపోయామని, విచారణ పేరుతో మానసికంగా వేధింపులు గురిచేయడం దారుణమని అమరావతి పరిరక్షణ సమితి జెఎసి కన్వీనర్ పువ్వాడ సుధాకర్ అన్నారు. తామేదో తప్పు చేసినట్టు విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్-5 జోన్‌లో 900 ఎకరాల భూమిని వైసిపి కార్యకర్తలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేసిందని విమర్శించారు.

కాప్‌లో కుట్ర

- అన్ని దేశాలను ఒకేగాటిన కట్టే యత్నం
- తిప్పికొట్టిన భారత్, చైనా

కైరో : వాతావరణ మార్పులకు చారిత్రాత్మకంగా కారణమైన ధనిక దేశాల సరసన అభివృద్ధి చెందుతున్న దేశాలను చేర్చే ప్రయత్నాన్ని భారత్, చైనాలు కలిసి తిప్పికొట్టాయి. ఈ ప్రక్రియలో మరికొన్ని దేశాలు కూడా భారత్, చైనాలకు సహకరించాయి. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వాతావారణ మార్పులపై ఈజిప్టులో జరుగుతున్న కాప్ 27 సదస్సులో చోటుచేసుకున్న ఈ సంఘటన కలలకం రేపింది. విశ్వసనీయ వర్గాలు వెల్లడించిన సమాచారం మేరకు సోమవారం ఇది చర్చనీయాంశంగా మారింది. ధనిక దేశాలు ఏదో రకంగా తమ బాధ్యత నుండి తప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నాయన్న విమర్శలు చెలరేగాయి. అభివృద్ధి చెందుతున్న పలు దేశాల ప్రతినిధులు ఈ వైఖరిని తీవ్రంగా ఖండించారు. వాతావరణ మార్పుల ఉపశమన కార్యక్రమం (మిటిగేషన్ వర్క్ ప్రోగ్రామ్) పై జరిగిన చర్చలో కర్బన ఉద్గారాలను అత్యధికంగా వెలువరించే 20 దేశాలను ఒకే గాటన కట్టడానికి ధనిక దేశాలు ప్రయత్నించాయి. వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరగడానికి ఈ దేశాలే కారణమని, అందువల్ల వాటిని నియంత్రించడంతో పాటు, పరిహారం చెల్లించే బాధ్యతను తీసుకోవాలని ప్రతిపాదించాయి. అమెరికాతో పాటు జర్మనీ, కెనడా తదితర ధనిక దేశాలు ఈ ప్రతిపాదన చేసినట్లు సమాచారం. ఆ 20 దేశాల జాబితాలో భారత్, చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఉన్నాయి. అనూహ్యంగా చోటుచేసుకున్న ఈ పరిణామంతో అప్రమత్తమైన భారత్, చైనా ప్రతినిధులు వెంటనే రంగంలోకి దిగినట్లు సమాచారం. రెండు దేశాల ప్రతినిధులు సమావేశమై చర్చించడంతో పాటు, ఇతర దేశాల ప్రతినిధులతో కూడా మాట్లాడారు. దీంతో పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌తో పాటు అభివృద్ధి చెందుతున్న పలు ఇతర దేశాలు కూడా భారత్, చైనాలకు మద్దతుగా నిలిచాయి. దీంతో అభివృద్ధి చెందుతున్న దేశాల గురించి విడిగా చర్చించడానికి ధనిక దేశాలు అంగీకరించాయి.



ఏమిటి నష్టం...?

పారిశ్రామిక విప్లవం ద్వారా, ఆ తరువాత ధనిక దేశాలు భారీగా లబ్ధిపొందిన సంగతి తెలిసిందే. ఆ క్రమంలోనే అవి పెద్ద ఎత్తున కాలుష్యాన్ని విడుదల చేసి, భూ తాపం పెరగడానికి, వాతావరణ మార్పులకు కారణమయ్యాయి. భారత్, చైనా వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు పారిశ్రామీకరణను ప్రారంభించి కొన్ని దశాబ్దాలు మాత్రమే గడిచాయి. ఏ విధంగా చూసినా ఈ దేశాలు వెదజల్లిన కాలుష్యం ధనిక దేశాలతో పోలిస్తే తక్కువే! అందువల్ల వాతావరణ మార్పులకు చారిత్రిక బాధ్యతను ధనిక దేశాలు తీసుకోవాలని, నష్ట నివారణ చర్యల్లో ఆ దేశాలు ప్రధాన బాధ్యత పోషించాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు కోరుతున్నాయి. అవకాశం దొరికిన ప్రతిసారీ ఈ చారిత్రక బాధ్యత నుండి తప్పుకోవడానికే ధనిక దేశాలు ప్రయత్నిస్తున్నాయి. తాజాగా కాప్ 27 లోనూ అదే జరిగింది. 20 దేశాలపై ఒకేసారి చర్చించాలన్న ధనిక దేశాల ప్రతిపాదనను అంగీకరించడమంటే తమకు చారిత్రక బాధ్యతలేదన్న వాదనను అంగీకరించడమే! భారత్, చైనా ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించడం, మిగిలిన దేశాలు కలిసి రావడంతో ఆ ప్రమాదం తప్పింది.

లాబీయిస్టుల జోరు...

కాప్ 27 సదస్సులో లాబీయిస్టుల జోరు పెద్దఎత్తున కనిపిస్తోంది. వీరిలో కూడా శిలాజ ఇంధనాల కంపెనీల నుండి వచ్చిన ప్రతినిధులు అత్యధికంగా ఉన్నారు. గత సమావేశంలో ఈ కంపెనీల నుండి 503 మంది లాబీయిస్టులు హాజరుకాగా, తాజా కాప్‌లో వారి సంఖ్య 600 దాటింది. వివిధ అయిల్, గ్యాస్ పరిశ్రమల నుండి 636 మంది లాబీయిస్టులు కాప్27 కు అధికారికంగా రిజిస్టర్ అయ్యారు. వారితో పాటు, అనధికారికంగా మరికొందరు కూడా వచ్చినట్లు భావిస్తున్నారు. వివిధ దేశాల ప్రతినిధులను కలిసి శిలాజ ఇంధనాలకు అనుకూలంగా వారు లాబీయింగ్ చేస్తున్నారు. కాప్ 28కి ఆతిధ్యమిస్తున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 1,070 మంది ప్రతినిధులను పంపింది. వారి తరువాత స్థానంలో శిలాజ ఇంధన కంపెనీల లాబీయిస్టులే ఉన్నారు.

సహకార రంగాన్ని నాశనం చేస్తున్నారు

కేంద్రంపై కేరళ ముఖ్యమంత్రి విమర్శ




పాలక్కాడ్ (కేరళ) : దేశంలో సహకార రంగాన్ని నాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. శతాబ్ద కాలం నాటి సహకార రంగం ప్రజల జీవితాల్లో కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. ఇక్కడ అఖిల భారత సహకార వారోత్సవాలను సోమవారం ప్రారంభిస్తూ ఆయన ప్రసంగించారు. సహకార రంగంలో కేంద్రం తీసుకొచ్చిన మార్పులను పౌర సమాజం విస్తృతంగా చర్చించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఆందోళన వ్యక్తంచేసిందన్నారు. సహకార రంగంపై రాష్ట్రాలకు అధికారం వుంటుందని సుప్రీం కోర్టు రూలింగ్ ఇచ్చిందని చెప్పారు. ఇది కేంద్ర ప్రభుత్వ విధానానికి పెద్ద ఎదురు దెబ్బ అని అన్నారు. పెద్ద నోట్ల రద్దు ద్వారా సహకార రంగాన్ని నాశనం చేయడానికి జరిగిన ప్రయత్నాలను మనం అధిగమించామని విజయన్ పేర్కొన్నారు. దేశంలో రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సహకార రంగంపై దాడి చేసేందుకు అటువంటి సంస్థలను కేంద్రం ఉపయోగించుకుంటోందన్నారు. కొత్త కొత్త ఆదేశాలు జారీ చేయడం ద్వారా సహకార రంగంలో జోక్యం చేసుకోవడానికి వారు (కేంద్రం) ప్రయత్నిస్తున్నారని అన్నారు. మనది సమాఖ్య ప్రభుత్వమని, మన సమాఖ్య చట్టాలను ఉల్లంఘించడానికి కేంద్రం అనేకసార్లు జోక్యం చేసుకున్న సందర్భాలున్నాయని చెప్పారు.

ఈ ప్రయత్నాలన్నీ సహకార రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయన్నారు. మూడు దశాబ్దాల నుంచి దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతూనే వచ్చాయని, కానీ కేరళ మాత్రం ద్రవ్యోల్బణం స్థాయి అత్యల్పంగా వుండేలా వ్యవహరించిందని తెలిపారు. ఇందుకు వామపక్ష ప్రభుత్వంతో పాటు సహకార రంగం బహుముఖంగా తీసుకున్న చర్యలు కూడా కారణమని అన్నారు. మన సహకార రంగాన్ని, ఆర్థిక సంస్థలను నాశనం చేసేందుకు ఉద్దేశించిన ఈ పెద్ద నోట్ల రద్దు ప్రభావం నుంచి కూడా బయటపడ్డామన్నారు.

విషమంగానే కృష్ణ ఆరోగ్యం

గచ్చిబౌలి కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ నటులు, సూపర్ స్టార్ ఘట్టమనేని కృష్ణ (79) ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ సహా ఎనిమిది మంది వైద్యనిపుణులు ఆయనను పర్యవేక్షిస్తున్నారు. ఆయనకు చికిత్స అందిస్తోన్న కాంటినెంటల్ ఆస్పత్రి వైద్యులు ఈ మేరకు సోమవారం తెలిపారు. ప్రస్తుతం ఆయన వెంటిలేటర్‌పై ఉన్నారని, పలు ముఖ్యమైన అవయవాలు దెబ్బతిన్నాయని చెప్పారు. కృష్ణ కుటుంబ సభ్యుల సమక్షంలో వైద్యం చేస్తున్నామని తెలిపారు.

కృష్ణ ఆరోగ్య పరిస్థితిపై సోమవారం రాత్రి వైద్యులు బులిటెన్ విడుదల చేశారు. రాబోయే 48 గంటలు అత్యంత కీలకమని చెప్పారు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతో ఆదివారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కృష్ణను కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆయన కార్డియాక్ అరెస్టు పరిస్థితిలో ఉన్నారని నిర్ధారించి ఎమర్జెన్సీకి తరలించి సిపిఆర్ చేశారు. 20 నిమిషాల సిపిఆర్ తర్వాత కార్డియాక్ అరెస్టు నుంచి ఆయన బయటకొచ్చారు. అనంతరం కృష్ణకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మొదడులో రక్తం గడ్డకట్టడంతోపాటు కిడ్నీ, లివర్, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నాయని గుర్తించారు. ఐసియుకి తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. డయాలసిస్ కూడా చేస్తున్నారు. అయితే, ఆస్పత్రికి వచ్చినప్పుడు ఏ పరిస్థితిలో ఉన్నారో సోమవారం రాత్రి పది గంటల వరకూ అదే పరిస్థితిలో ఆయన ఉన్నారు. కృష్ణ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు వైద్యుల బృందం సమీక్షించి చికిత్స అందిస్తోందని కాంటినెంటల్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

అమెజాన్‌లో 10 వేల ఉద్యోగాల కోత!



న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన అమెజాన్ డాట్ కామ్ ఐఎన్‌సి పదివేల మంది ఉద్యోగులను తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కార్పొరేట్, టెక్నాలజీ విభాగాల్లో ఈ వారంలోనే ఈ తొలగింపు ఉండనుందని న్యూయార్క్ టైమ్స్ సోమవారం వెల్లడించింది. ఇంత భారీ సంఖ్యలో ఉద్యోగాలను తొలగించడం అమెజాన్ చరిత్రలోనే ఇదే మొదటిసారి. అధికారిక సమాచారం ప్రకారం 2021 డిసెంబరు 31 నాటికి అమెజాన్‌లో 16,08,000 మంది ఫుల్‌టైమ్, పార్ట్‌టైమ్ ఉద్యోగులు ఉన్నారు. బిజీ హాలీడే సీజన్‌లోనూ అమ్మకాలు క్షీణించాయని అమెజాన్ సంస్థ హెచ్చరించిన కొన్ని వారాల్లోనే ఈ ఉద్యోగుల తొలగింపు వార్త రావడం దిగ్భ్రాంతికరం. ఈ వార్తతో ఇటీవల కాలంలో ఉద్యోగులను తొలగించిన మరొక అమెరికా సంస్థగా అమెజాన్ నిలవనుంది. ఇప్పటికే ఫేస్‌బుక్, ట్విట్టర్, మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్, స్నాప్ సంస్థలు భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించాయి.

తెనాలిలో ఆరంభమైన అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవం

- చదువుతోపాటు సామాజిక దృక్పథం అవసరం : ఎమ్మెల్యే శివకుమార్

లోపలి పేజీలో..




పెరిగిన వరకట్న వేధింపులు

- డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి

జిన్‌పింగ్, బైడెన్‌ల భేటీ

- కరచాలనం చేసుకున్న నేతలు
- ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ



బాలి: చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌లు ముఖాముఖీ సమావేశమయ్యారు. బాలిలో జరుగుతున్న జి-20 దేశాల సదస్సులో పాల్గొనడానికి వచ్చిన ఇరువురు నేతలు సోమవారం నేరుగా కలుసుకున్నారు. హోటల్ ములియాలో బాల్‌రూమ్ ఈ అరుదైన భేటీకి వేదికయింది. అక్కడ ఏర్పాటు చేసిన చైనా, అమెరికా పతాకాల ఎదుట ఇరువరు నేతలు కరచాలనం చేసుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా బైడెన్ ఎన్నికయిన తరువాత ఇరువురు నేరుగా కలవడం ఇదే మొదటిసారి. ఇప్పటివరకు వీడియో, ఫోన్ కాల్స్ ద్వారా వీరిద్దరి మధ్య సంభాషణలు సాగిన విషయం తెలిసిందే. కరచాలనం అనంతరం ఇరు దేశాధినేతలు ప్రత్యేకంగా సమావేశమైనారు. ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. దేశాల మధ్య నెలకొన్న విభేదాలను పరిష్కరించుకునే దిశగా కృషి జరగాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఆకాంక్షించారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు నెలకొన్న తర్వాత ఎన్నో ఒడిదుడుకులు, అవరోధాలు ఎదురయ్యాయని జిన్‌పింగ్ అన్నారు. వీటినుండి గుణపాఠాల నేర్చుకుని భవిష్యత్‌వైపు దృష్టి సారించాలని చెప్పారు. ఇటువంటి సమావేశాలు తరచు నిర్వహించడం ద్వారా ప్రపంచం ఎదుర్కుంటున్న వివిధ సమస్యలపై కలిసి పనిచేయడానికి వీలవుతుందని బైడెన్ అన్నారు. ఈ భేటీలో ఇరు దేశాల అధ్యక్షులతో పాటు, విదేశాంగ మంత్రులు, రాయబారులు పాల్గొన్నారు.

అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే అంశాలపై చర్చ

- బాలి సదస్సుకు ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : బాలిలో జరగబోయే జి-20 సదస్సులో అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే అంశాలపై చర్చించనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. బాలికి బయలుదేరడానికి ముందు ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ అభివృద్ధిని పునరుద్ధరించడం, ఆహారం, ఇంధన భద్రత, పర్యావరణం, ఆరోగ్యం, డిజిటల్ పరివర్తన వంటి అంతర్జాతీయంగా ఆందోళన కలిగించే కీలకాంశాలపై జి 20 నేతలతో చర్చించనున్నట్లు మోడీ చెప్పారు. ఈ సమావేశాల్లో ఉక్రెయిన్ సంక్షోభంపై ప్రధానంగా చర్చ జరిగే అవకాశముందని భావిస్తున్నారు. సమావేశాల ముగింపులో అంటే డిసెంబరు 1వ తేదీన జి 20 అధ్యక్ష బాధ్యతలను భారత్ అధికారికంగా స్వీకరించనుంది. వచ్చే ఏడాది నిర్వహించబోయే జి-20 సదస్సు నిర్వహణా బాధ్యతలను భారత్ చేపట్టనుంది. అందరికీ సమానమైన అభివృద్ధి, భవిత్యవం వుండేలా "వసుధైక కుటుంబం లేదా ఒక భూగోళం, ఒక కుటుంబం, ఒక భవితవ్యం" అన్న థీమ్‌తో భారత్ జి 20 సమావేశాలు నిర్వహిస్తామని ప్రధాని ప్రకటించారు.



మృతదేహాన్ని పూడ్చనీయకుండా అడ్డుకుంటున్న వైసిపి నేత చాంద్‌బాషా (టోపీ పెట్టుకున్న వ్యక్తి)

శ్మశానవాటిక స్థలం ఆక్రమణ

- గిరిజనుడి మృతదేహాన్ని పూడ్చనీయకుండా అడ్డుకున్న వైసిపి నేత
- అధికారుల జోక్యంతో సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

శ్మశాన వాటిక స్థలం తమదంటూ గిరిజనుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించనీయకుండా వైసిపి నాయకులు అడ్డుకున్నారు. దీంతో, ఉద్రిక్తత చోటుచేసుకుంది. రెవెన్యూ అధికారులు, పోలీసులు జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించడంతో పరిస్థితి సద్దుమణిగింది. ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం పాత సింగరాయకొండ పంచాయతీలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుని బంధువుల కథనం ప్రకారం... బాలిరెడ్డినగర్‌లోని గిరిజన కాలనీకి చెందిన పోట్లూరి వెంకట దుర్గాప్రసాద్ (26) అనారోగ్యంతో ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతదేహాన్ని ఖననం చేయడం కోసం కుటుంబసభ్యులు, బంధువులు కలిసి శ్మశాన వాటికకు సోమవారం తీసుకెళ్లారు. అక్కడికి వైసిపి నేత

మిగతా 2లో

వివాహితపై సామూహిక అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి- కొత్తకోట (అనకాపల్లి)

వివాహితపై నలుగురు యువకులు సామూహిక అత్యాచారం చేసిన ఘటన అనకాపల్లి జిల్లా రావికమతం మండలం దొండపూడిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలి భర్త సోమవారం కొత్తకోట పోలీసులకు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్ఐ వి.భూషణరావు కథనం ప్రకారం... దొండపూడి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన భార్యను స్వగ్రామంలోనే ఉంచి కూలి పనుల కోసం తూర్పుగోదావరి జిల్లాకు వలస వెళ్లారు. ఆయన భార్య ఈ నెల ఆరో తేదీ మధ్యాహ్నం దొండపూడి-కిత్తంపేట గ్రామాల సరిహద్దులోని జీడి మామిడి తోటలోకి పుల్లల సేకరణకు ఒంటరిగా వెళ్లింది. అప్పటికే తోటలో దొండపూడి గ్రామానికే చెందిన ఇద్దరు యువకులతోపాటు మరో ఇద్దరు మైనర్లు అక్కడ మద్యం సేవిస్తున్నారు. వారంతా ఆమెను తోటలోని అసంపూర్తిగా ఉన్న షెడ్డులోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో ఆమె భయపడిపోయింది. భర్త ఆదివారం రాత్రి ఇంటికొచ్చారు. జరిగిన విషయాన్ని భర్తకు ఆమె చెప్పింది. దీంతో, ఆయన కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అనకాపల్లి దిశా పోలీసులకు సమాచారం అందజేశారు. దిశా డిఎస్‌పి ఎం.మహేశ్వరరావు, సిఐ టి.లక్ష్మి సోమవారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వంకర శివ, నాగులాపల్లి వెంకటేశ్‌లతోపాటు మరో ఇద్దరు మైనర్లను పోలీసులు అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించారు. కోర్టు వారికి రిమాండ్ విధించింది.

జర్నలిస్టులకు హెల్త్‌కార్డుల పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్‌కార్డుల చెల్లుబాటును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ఎంటి కృష్ణబాబు సోమవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. రాష్ట్రంలో 2016-2017 నుంచి 2021-2022 వరకు అమలులో వున్న నిబంధనలతోనే వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను (హెల్త్‌కార్డు) 2022-23 సంవత్సరానికి పొడిగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అమలవుతున్న తరహాలోనే వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్‌కార్డులను అమలు చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్, సాధారణ పరిపాలనా విభాగాలను కోరింది.

వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీం కోర్టులో ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ డిసెంబర్ 12కి వాయిదా పడింది. ప్రతివాదులైన ఏపి సిఐడికి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాల ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. సిఐడి ఇంకా ఛార్జిషీటు దాఖలు చేయనందువల్ల అనంతబాబుకు బెయిల్ మంజూరు చేయాలని అనంతబాబు తరపు న్యాయవాది కోరారు. కేసు తీవ్రత దృష్ట్యా బెయిల్ మంజూరు చేయరాదంటూ బాధితుల తరపు న్యాయవాది సుప్రీంకు తెలిపారు. అధికారి పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అయినందున పోలీసులతో కుమ్మక్కై విచారణను సాగదీస్తున్నారని వాదించారు. దళిత యువకుడి హత్య కేసులో నిందితుడైన అనంతబాబుకు హైకోర్టు బెయిల్ నిరాకరించింది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో అనంతబాబు సవాలు చేశారు. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో అనంతబాబు రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

మోడీ తాతా.. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దు

- ఉక్కునగరంలో చిన్నారుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

'మోడీ తాతా.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మొద్దు. ప్రభుత్వ రంగంలోనే కొనసాగించండి. నేడు చిన్నారులుగా ఉన్న మేమే.. రేపటి పౌరులం. మాలాంటివారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే ఉక్కు కర్మాగారం ఉండాలి' అని ఉక్కు నగరంలోని చిన్నారులు నినదించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఆధునిక దేవాలయాలుగా కొనియాడిన భారత మొదటి ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని విశాఖ జిల్లా గాజువాకలో సోమవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చాచా నెహ్రూ విగ్రహానికి తొలుత చిన్నారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'సేవ్ వైజాగ్ స్టీల్' అంటూ నినదించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై మస్తానప్ప మాట్లాడుతూ స్వాతంత్రం అనంతరం దేశాభివృద్ధిలో ప్రభుత్వ రంగ సంస్థలే కీలకపాత్ర పోషించాయన్నారు. దేశం ప్రపంచ పటంలో అభివృద్ధి పథాన నడిచేందుకు పరిశ్రమలను నెహ్రూ నెలకొల్పారని తెలిపారు. నేడు అటువంటి పరిశ్రమలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడం సరికాదన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమం సుదీర్ఘకాలంగా సాగుతున్నా ప్రధాని మోడీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో వై వరలక్ష్మి, అరుణకుమారి, పిట్టా రమణమ్మ, ఉరుకుటి సుభాషిణి, మామిళ్లపల్లి పద్మలత, బంటుపల్లి ఉషారాణి, బి వాణి, పరమానంద బిసాయి, మొగలయ్య, కోటి ప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో భాగస్వాములైన మహిళలకు సత్కారం జరిగింది.



ఉక్కునగరంలో నెహ్రూ విగ్రహం వద్ద కార్యక్రమం చేపట్టిన చిన్నారులు

ఆక్వా రైతులకు అన్యాయం

- 'ఆక్వా రైతు పోరుబాట - రైతుల కోసం తెలుగుదేశం' సదస్సులో రామకృష్ణుడు
- విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడిలో ఉద్రిక్తత


విద్యుత్ సబ్ స్టేషన్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - ఉండి (పశ్చిమగోదావరి)

ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండల కేంద్రంలోని స్థానిక కోట్ల ఫంక్షన్ హాలు నుంచి 220 కెవి సబ్‌స్టేషన్ వరకు సోమవారం టిడిపి నాయకులు చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తతకు దారి తీసింది. ర్యాలీగా వెళ్తున్న ఆక్వా రైతులు, టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో వాగ్వావాదం, తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఆకివీడు కానిస్టేబుల్ ఐతం సుబ్బారావుకు కాలువిరిగింది. అనంతరం విద్యుత్ సబ్‌స్టేషన్ గేటు వెలుపల ఆక్వా రైతులు, టిడిపి నాయకులు నిరసన తెలిపారు. పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా మారిపోయారని నాయకులు విమర్శించారు. అంతకుముందు కోట్ల ఫంక్షన్ హాలులో నిర్వహించిన 'ఆక్వా రైతు పోరుబాట - రైతుల కోసం తెలుగుదేశం' అనే సదస్సులో శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు పాల్గొన్ని, మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్తు రెండు రూపాయలకు ఇస్తుందని,తమ పార్టీ అధికారంలోకి వస్తే యూనిట్ రూ.1.50కే ఇస్తామని పాదయాత్ర సందర్భంగా జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ విభాగాలుగా మార్చి ఆక్వాజోన్‌లో ఉన్న రైతులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ అందిస్తానని సిఎం చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పత్తిపాటి పుల్లారావు, చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, పీతల సుజాత, మాగంటి బాబు, కొల్లు రవీంద్ర, బిజెపి మాజీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, రైతు విభాగం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, అధిక సంఖ్యలో ఆక్వా రైతులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై నగేష్

ఎక్స్‌పర్ట్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నిరుద్యోగుల నుండి రూ.లక్షల వసూలు చేసిన ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ పై చర్యలు తీసుకోవాలని కర్నూలు కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై నగేష్ మాట్లాడారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డు ఉద్యోగాల నియామకాల పేరిట ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ నిరుద్యోగుల నుండి రూ.లక్షలు వసూలు చేసిందన్నారు. ఈ ఏజెన్సీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, ప్రభుత్వమే నేరుగా సెక్యూరిటీ గార్డు, స్వీపర్ పోస్టులను భర్తీ చేసి జీతాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బా తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు కూల్చేశారని తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నం

- వైసిపి నాయకులే కారణం అంటూ సెల్ఫీవీడియో

ప్రజాశక్తి - బిక్కవోలు(తూర్పుగోదావరి)

తమ ఇంటిని అన్యాయంగా కూల్చేశారంటూ తల్లీకొడుకు పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తమ ఆత్మహత్యకు వైసిపి నాయకులే కారణమంటూ సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురం గ్రామ శివారు తోటపేటలో జిల్లా పరిషత్‌కు చెందిన స్థలంలో కోటిపల్లి కామాక్షి, ఆమె కుమారుడు మురళీకృష్ణ 30 ఏళ్లుగా నివసిస్తున్నారు. ఇటీవల ఆ ఇంటిని అధికారులు కూల్చేశారు. దీంతో వారు వీధిన పడ్డారు. తమకు న్యాయం చేయాలంటూ 20 రోజులుగా అధికారుల చుట్టూ తిరిగారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దీన్ని సెల్ఫీ వీడియో తీసి సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే వారిని అనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకష్ణారెడ్డి పరామర్శించారు.

పెరిగిన వరకట్న వేధింపులు

- డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి



ప్రజాశక్తి- విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలో సైబర్ నేరాలు, వరకట్న వేధింపుల కేసులు పెరిగా యని డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. లోన్‌యాప్‌ల వేధింపులతో ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్లతో డిజిపి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను నిరోధించేందుకు దిశ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిచేందుకు చర్యలు చేపట్టామన్నారు. నాటుసారా తయారు చేస్తున్న గ్రామాలను గుర్తించి, సారా తయాదారులతో దీనికి స్వస్తి పలికించి వారికి వేరే వృత్తుల్లో పునరావాసం కల్పించేందుకు గ్రామ స్థాయిలో సర్వేలు నిర్వహించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. ఎస్‌సి, బిసి కార్పొరేషన్ల ద్వారా వివిధ పథకాలు అందించి 3,400 కుటుంబాలకు పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. లోన్‌యాప్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కువ మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్న ఖాతాలపై బ్యాంకు అధికారులు నిఘా పెట్టాలన్నారు. గంజాయి రవాణాను నియంత్రించేందుకు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో కూడా గంజాయిని నియంత్రించేందుకు ఆయా ప్రభుత్వాలు చర్యలు చేపడితే రానున్న మూడునాలుగేళ్లలో గంజాయి రవాణాను పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఎఒబిలో మావోయిస్టు కార్యకలాపాలను నియంత్రించేందుకు పోలీసు శాఖ ఎప్పటిలాగే చర్యలు కొనసాగిస్తోందని చెప్పారు. జిల్లాల పునర్విభజనతో పోలీసు శాఖకు ఏర్పడిన సిబ్బంది, వాహనాలు, మౌలిక వసతుల కల్పన వంటి సమస్యలను ఇప్పటికే చాలావరకూ పరిష్కరించామన్నారు. సమావేశంలో శాంతిభద్రత విభాగం అదనపు డిజి డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్, విశాఖపట్నం రేంజ్ డిఐజి ఎస్.హరికృష్ణ, జిల్లా ఎస్‌పి ఎం.దీపిక పాటిల్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

- ప్రతి గ్రామ సచివాలయంలో ఏర్పాటు
- విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ విజయవాడ అర్బన్


తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద బుక్ ఎగ్జిబిషన్‌లో ప్రజాశక్తి బుక్‌స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి బొత్స

రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ప్రతి గ్రామ సచివాలయంలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలని తమ ఆలోచన అని తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావులు జైల్లో ఉండి కూడా పుస్తకాలు చదివారని, రాశారని చెప్పారు. రాష్ట్రంలో సంపూర్ణ డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పత్రికలు, గ్రంథాలయాలు కీలక పాత్ర పోషించాయని ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. సిఎం ఆదేశాలతో 10,960 గ్రామాల్లో డిజిటల్ గ్రంథాలయ వ్యవస్థ నిర్మాణం జరుగుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ మందపాటి శేషగిరిరావు చెప్పారు. పిల్లలను పుస్తకాలకు అలవాటు పడేలా 'నో టు డ్రగ్స్, ఎస్ టు బుక్స్' పేరుతో ప్రభుత్వం తరపున ప్రచారం తీసుకొస్తున్నామని పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ వెల్లడించారు. రాష్ట్రంలో 10 లక్షల మంది గ్రంథాలయాల మెంబర్ షిప్ ఉందని, ఇది వచ్చే వారోత్సవాలకు కోటికి పెరగాలని ఆకాంక్షించారు. ప్రతి పాఠశాలలో గ్రంథాలయం ఉండాలని, ప్రతిరోజు పిల్లలు కనీసం అరగంట సేపు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్ సురేష్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, టి కల్పలత రెడ్డి, మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్, పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పుణ్యశీల, పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఎంఆర్ ప్రసన్న కుమార్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకానికి ఆదరణ తగ్గలేదు

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవంలో డిఆర్ఒ

ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ పరంగా వేగవంతమైన మార్పులు వచ్చినా పుస్తకానికి ఆదరణ తగ్గలేదని ఎన్‌టిఆర్ జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ) కె.మోహన్‌కుమార్ అన్నారు. జాతీయ పుస్తక వారోత్సవాల సందర్భంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మోహన్‌కుమార్ మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించేది పుస్తకాలేనని పేర్కొన్నారు. పుస్తకాలను బహుమతిగా ఇవ్వడం వల్ల ఇతరులకు కూడా పుస్తకాలు చదవాలనే ఆసక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షులు బి.బాబ్జి, ఉపాధ్యక్షులు జి.లక్ష్మి, కార్యదర్శి కె.లక్ష్మయ్య, పలువురు నగర ప్రముఖులు, పుస్తక ప్రచురణకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాలపై విషం చిమ్మడం మానుకోండి

పవన్‌కు బొత్స సూచన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పేదలకు ఇస్తున్న ఇళ్లస్థలాలపై విషం చిమ్మడం మానుకోవాలని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సూచించారు. సోమవారంనాడు తాడేపల్లిలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక యజ్ఞంలా 31లక్షలమందికి ఇళ్లస్థలాలను ఇచ్చిందన్నారు. అందులో 21 లక్షల మందికి ఇళ్లనిర్మాణం పనులు జరుగుతుంటే పవన్‌కల్యాణ్ విజయనగరంకు వెళ్లి అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటిదాకా ఖర్చుపెట్టిందే రూ 15వేల కోట్లు అయితే రూ10వేల కోట్ల అవినీతి ఎలా జరుగుతుందో పవన్‌కల్యాణ్ చెప్పాలని అన్నారు. రూ 10వేల కోట్ల అవినీతి ఎక్కడ జరిగిందో నిరూపించాలని సవాల్ చేశారు. తెలుగుదేశం హయంలో చంద్రబాబునాయుడు ఎన్ని ఇళ్లస్థలాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు.

దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాలయానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- త్వరలోనే విశాఖ నుంచి విజయవాడ/తిరుపతి వరకు వందే భారత్ రైలు : వాల్తేరు డివిజన్ డిఆర్ఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)


మాట్లాడుతున్న డిఆర్ఎం అనూప్ సత్పతి

విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వేజోన్ కార్యాలయానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని వాల్తేర్ రైల్వే డివిజన్ డిఆర్ఎం అనూప్ సత్పతి తెలిపారు. విశాఖలోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.106 కోట్లతో దక్షిణ కోస్తా రైల్వే జోన్ భవనాల నిర్మాణం చేపట్టనున్నామన్నారు. తొలిదశలో పాత వైర్‌లెస్ కాలనీలో 13 ఎకరాల్లో జోన్ కోసం భూసేకరణ జరుగుతోందని, ఎనిమిది ఎకరాల్లో ప్రతి అంతస్తుల్లో 4000-4500 చదరపు మీటర్ల వైశాల్యంతో మల్టీ స్టోరేడ్ భవనాల నిర్మాణం చేపట్టనున్నామని తెలిపారు. డిపిఆర్‌ను సమీక్షించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. విశాఖ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు కేంద్రం రూ.456 కోట్లను ఇప్పటికే మంజూరు చేసిందని, దేశంలోనే అత్యాధునిక వసతులతో ఈ స్టేషన్‌ను తీర్చిదిద్దనున్నామని చెప్పారు. 36 నెలల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. నూతన ప్రణాళికలలో భాగంగా విశాఖ రైల్వే స్టేషన్‌లో అదనంగా మరో రెండు రైల్వే ప్లాట్‌ఫారాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. విశాఖ నుంచి విజయవాడ లేదా తిరుపతికి సెమీ బులెట్ వందే భారత్ రైలును ప్రాంభించడానికి పైకి ప్రతిపాదనలు పంపించామని, అనుమతి వచ్చిన వెంటనే ట్రైల్ రన్ జరిపి సేవలు ప్రారంభిస్తామని వెల్లడించారు.

తెనాలిలో ఆరంభమైన అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)


ప్రొజెక్టర్‌ను ఆన్ చేస్తున్న ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్, చిత్తరంజన్

15వ అంతర్జాతీయ బాలల చలనచిత్రోత్సవం గుంటూరు జిల్లా తెనాలి కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. తొలి ప్రదర్శనగా చైనా వారి 'లిటిల్ బిగ్ సోల్జర్', రెండవ ప్రదర్శనగా దక్షిణ కొరియా వారి 'డాగ్స్', మూడవ ప్రదర్శనగా హిందీ సినిమా 'హమ్ ఔర్ ఆప్' చిత్రాలను ప్రదర్శించారు. చిల్డ్రన్స్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో రెండురోజుల పాటుఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు, బొల్లిముంత కృష్ణ సారథ్యంలో ఏర్పాటు చేసిన చలన చిత్రోత్సవాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు సామాజిక దృక్పదం కూడా అవసరమన్నారు.సందేశాత్మక చిత్రాల ప్రదర్శనను ప్రతి విద్యార్థి తిలకించాలన్నారు. సామాజిక మాధ్యమాలవైపు మొగ్గుచూపుతున్న విద్యార్థుల్లో సందేశాత్మక చిత్రాలతో మార్పు రావాలన్నారు. సినీ దర్శకులు చిత్తరంజన్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం, రావిపాటి వీరనారాయణరావు మాట్లాడుతూ.. పాఠశాల దశ నుంచే విద్యార్థుల్లో క్రమశిక్షణ అవసరమని తెలిపారు. ప్రస్తుత సమాజంలో బాలబాలికలు ఎదుర్కొంటున్న సమస్యలకు అద్దం పట్టేలా బాలల చిత్రాల నిర్మాణం జరగాలన్నారు. కార్యక్రమంలో బాల నటులు భానుప్రకాష్, వివేక విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు జి.వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీశ్రీ నగర్ కాలనీవాసులు

నష్టపరిహారం, ఇళ్లపట్టాల కోసం ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తమకు నష్టపరిహారం, ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట అనంతపురం వరద బాధితులు ధర్నా చేశారు. సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ముందుగా శ్రీశ్రీ నగర్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. 'జగన్ మామయ్య మా అమ్మానాన్నకు ఇంటి పట్టాలు ఇవ్వండి, జగన్ అన్న మా ఇంటికి పట్టాలివ్వండి' అంటూ వరద బాధిత చిన్నారులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర్ కార్యదర్శులు ఆర్‌వి నాయుడు, వి. రామిరెడ్డి మాట్లాడారు. నెల క్రితం వచ్చిన వరదలతో అనంతపురంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయన్నారు. ఇందులో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాలనీలను వరదలు చుట్టుముట్టకుండా నడుమివంక చుట్టూ ప్రహరీని నిర్మించి, వంతెనల ఎత్తును పెంచాలని కోరారు. నడిమివంక పరిసర ప్రాంతాల్లోని ఆక్రమణలపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగర శివారు ప్రాంతాల్లో 18 సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తోన్న శ్రీశ్రీ నగర్, గణేనాయక్ కాలనీ, అభ్యుదయ కాలనీ, సుందరయ్య కాలనీ, చైతన్య కాలనీ వాసులకు తక్షణం ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్‌డిఒ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. ధర్నాకు సిపిఎం నగర కమిటీ సభ్యులు ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వరద బాధితులు, సిపిఎం నగర నాయకులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ అక్రమాలపై సమగ్ర విచారణ

- ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం ఎస్ఎస్‌బిఎన్ ఎయిడెడ్ కళాశాల స్కాలర్‌షిప్‌ల వ్యవహారంలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురం అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్, ఎస్‌సి,ఎస్‌టి,బిసి, ఎపిఎస్ఎఫ్‌తో పాటు పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. ఈ నిరసనలో ఐక్య విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ ఎస్ఎస్-ఎస్‌బిఎన్ కళాశాలలో స్కాలర్‌షిప్‌ల అక్రమాలు పెద్దఎత్తున జరిగాయన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన డబ్బులను ఇతర బ్యాంకులకు చెల్లించిన వ్యవహారంపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యిందని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.80 లక్షలు అక్రమార్కులు ఇతర ఖాతాలకు దారి మళ్లించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాలలో జరిగిన అన్ని అక్రమాలపై మాజీ ట్రస్టు సభ్యులు ఐదుగురు కలెక్టర్‌కు నాలుగు నెలల క్రితమే ఫిర్యాదు చేశారన్నారు. అప్పట్లో ఇందుకోసం విచారణ కమిటీ ఏర్పాటు చేశారని, కానీ కమిటీ నివేదికపై గోప్యత పాటించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం విచారణ కమిటీల నివేదికలను బహిర్గతం చేయాలని కోరారు. వీటిన్నింటిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను బట్టబయలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, సూర్యచంద్ర యాదవ్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు గుత్త ధనంజయ నాయుడు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థి సంఘం నాయకులు సురేష్, నవయువ సమైక్య జిల్లా కార్యదర్శి కసాపురం ఆంజనేయులు పాల్గొన్నారు. విద్యార్థుల ఆందోళనకు జనసేన నాయకులు టిసి వరుణ్, భవాని రవికుమార్, తెలుగు యువత నాయకులు బొమ్మినేని శివ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ రెడ్డి మద్దతు తెలిపారు.

శ్మశానవాటిక స్థలం ఆక్రమణ

(మొదటి పేజీ తరువాయి)

చాంద్‌బాషా చేరుకొని ఈ స్థలం తనదంటూ, తనకు పట్టా ఉందంటూ, ఇక్కడ మృతదేహాన్ని పూడ్చడానికి వీలులేదంటూ అడ్డుకున్నాడు. దీనిపై గిరిజనులు స్పందిస్తూ, ఇది శ్మశాన వాటికకు కేటాయించిన స్థలమని బదులిచ్చారు. ఆయనకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా, వైసిపి నాయకుడు వినలేదు. పైగా, గిరిజనులపై దాడికి యత్నించాడు. తాను వైసిపి నాయకుడినని భయపెట్టాడు. దీంతో, గిరిజనులు ఎస్ఐ ఫిరోజా ఫాతిమాకు, తహశీల్దార్ సిహెచ్.ఉషాకు సమాచారం అందజేశారు. పోలీసు, రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకొని గిరిజనులతో మాట్లాడారు. తహశీల్దార్ స్పందిస్తూ. ఇది ప్రభుత్వ భూమని, ఈ విషయం కోర్టు దృష్టికి కూడా తీసుకెళ్లానని, ఇది గిరిజనుల కోసం కేటాయించిన శ్మశానవాటికేనని, ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించుకోవచ్చని బదులిచ్చారు. సర్వే బృందాన్ని పిలిచి శ్మశానవాటికకు సంబంధించిన భూమిని కొలతలు వేసి గిరిజనులకు అప్పగించాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసుల సహకారంతో మృతదేహాన్ని గిరిజనులు అక్కడే పూడ్చారు. గిరిజనుల ఫిర్యాదుతో వైసిపి నేత చాంద్‌బాషాపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును పోలీసులు నమోదు చేశారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితులకు...

రూ.50 లక్షల పరిహారమివ్వాలి

- కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు

ప్రజాశక్తి - ఏలూరు

తమకు ఇచ్చిన హామీ ప్రకారం న్యాయం చేయాలని, పరిహారం పెంచి ఎకరాకు రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు ఏలూరు కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ధర్నాలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఆర్బిట్రేషన్ పిటిషన్లపై జిల్లా కలెక్టర్ జడ్జిమెంట్ ఇచ్చి పరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ కంటే ఎపిలో తక్కువ పరిహారం ఇచ్చి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. రైతుల నుండి బలవంతంగా భూములు లాక్కోవడం చట్ట విరుద్ధమన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చట్ట ప్రకారం పునరావాసం పునఃనిర్మాణం కల్పించాలని కోరారు. రైతులు తమ పుంతరోడ్లు యథావిధిగా వినియోగించుకునేలా సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, సర్వీస్ రోడ్లు బిటి రోడ్లు, తగిన ఎత్తు, వెడల్పులలో అండర్‌పాస్‌లు నిర్మించాలని కోరారు. తమకు న్యాయం చేయాలని పోరాటం చేస్తూ పనులు అడ్డుకుంటున్న రైతులపై పోలీసుల బెదిరింపులు అన్యాయమన్నారు. బోర్లు కోల్పోయిన రైతులకు ఉచితంగా బోర్లు వేయాలని, చెట్లు, షెడ్లకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. రైతులకు న్యాయం చేస్తామని, ఈ నెల 19న ఆర్బిట్రేషన్ జడ్జిమెంట్ ఇస్తామని, ఇతర సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముళ్లపూడి అశోక్, ఆచంట గోపాలకృష్ణ, కొడవటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్విట్టర్‌లో మరో 4,400 ఉద్యోగాలు ఫట్

వాషింగ్టన్ : టెస్లా అధినేత ఎలన్ మస్క్ ట్విట్టర్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత అందులోని ఉద్యోగుల భవిష్యత్తు తీవ్ర గందరగోళంగా మారింది. ఎప్పుడు ఎవరి ఉద్యోగం ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవలే ప్రపంచ వ్యాప్తంగా ఆ సంస్థకు ఉన్న మొత్తం ఉద్యోగుల్లో సగం మందిని అంటే 3500 సిబ్బందిని తొలగించిన విషయం తెలిసిందే. తాజాగా ట్విట్టర్‌కు కాంట్రాక్టు లేదా అవుట్‌సోర్సింగ్ పద్దతిలో పని చేసే మొత్తం 5,500 మందిలో 4,400 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు అంతర్జాతీయ మీడియా సంస్థలు రిపోర్టు చేశాయి. వీరికి ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే శనివారం తొలగింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. తాజాగా ఉద్వాసనకు గురైన వారిలో అమెరికా సహా ఇతర దేశాలకు చెందిన కంటెంట్ మోడరేషన్, రియల్ ఎస్టేట్, మార్కెటింగ్, ఇంజినీరింగ్‌తో పాటు ఇతర విభాగాలకు చెందిన సిబ్బందిని ఉన్నారు. వీరికి సోమవారమే చివరి పని దినమని సమాచారం.

HDFC BANK
We understand your world

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

ప్రత్యేకంగా ఋణగ్రహీతలకు, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమైనది ఏమనగా దిగువ పేర్కొన్న ఖాతాలకు సంబంధించి తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు వేలం వెయ్యడానికి ప్రతిపాదించబడినది. ప్రత్యేకంగా ఋణగ్రహీతలకు తాము స్వయంగా సంతకం చేసిన ఋణ ఒప్పంద పత్రంలోని నియమ నిబంధనల ప్రకారం, తాము తీసుకున్న ఋణాలను చెల్లించకపోవడం, ఋణ బకాయిలు చెల్లించవలసిందిగా హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు లిమిటెడ్ (బ్యాంకు) నోటీసులు జారీ చేసినప్పటికీ బకాయి చెల్లింపులో విఫలం చెందడంతో సదరు తాకట్టు పెట్టిన బంగారు నగలు వేలం వేయబడతాయి. దిగువ పేర్కొన్న ఖాతాల్లోని ఋణం మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా ఋణగ్రహీతలకు 7 రోజుల తుది గడువుతో నోటీసు(లు) జారీచేయబడింది. ఒకవేళ సదరు ఋణ మొత్తం చెల్లించడంలో విఫలమైన పక్షంలో తనఖా పెట్టిన మొత్తం బంగారాన్ని మరో నోటీసు జారీచేయకుండా వేలం వేసే హక్కు బ్యాంకు కలిగియుంది. బ్యాంకుకు చెల్లించవలసిన ఋణ మొత్తం చెల్లించడంలో ఋణగ్రస్తులు నిర్లక్ష్యం వహించడంతో, ఋణ ఒప్పంద నియమాల ప్రకారం బ్యాంకుకున్న హక్కులను అమలు చేస్తూ, తాకట్టు పెట్టిన బంగారం మొత్తాన్ని వేలం వేయడం ద్వారా అమ్మకాలు చేపట్టి రుణగ్రహీతలు బ్యాంకుకు చెల్లించవలసిన ఋణం మొత్తాన్ని రాబట్టుకోవాలని నిర్ణయించింది.

దిగువ తెలిపిన షెడ్యూల్ ప్రకారం దిగువ తెలిపిన శాఖల వద్ద వేలం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో దిగువ తెలిపిన తేదీన తనఖా పెట్టిన సెక్యూరిటీ వేలం నిర్వహించకపోయినా లేదా పూర్తి కాకపోయినా, ఏదేని తదుపరి తేదీన సదరు వేలం నిర్వహించుటకు లేదా కొనసాగించుటకు బ్యాంకు హక్కు కలిగి ఉంటుంది.

క్ర. సం.	లోన్/రిఫరెన్స్ నం.	రుణగ్రహీత పేరు	రుణం తేది	ఋణం (రూ.)	వేలం జరుగు ప్రదేశం	వేలం జరుగు తేదీ & సమయం
1	72661840	YK లక్ష్మీపతి రాజు	01-09-20	150000	0050-విశాఖపట్టణం	22-11-2022 3.30 PM
2	72615935	వేమ చక్రపాణి	05-08-20	36000	0189-గుంటూరు	24-11-2022 3.30 PM
3	72666885	ఎం సుధాకర్	03-09-20	85723	0214-తిరుపతి	24-11-2022 3.30 PM
4	72660245	వల్లం సురేంద్ర బాబు	31-08-20	79000	0473-నెల్లూరు	22-11-2022 3.30 PM
5	72667894	చంపాదేవి సోలంకి	04-09-20	2665000	0568- వన్ టౌన్ - విజయవాడ	22-11-2022 3.30 PM
6	72668123	చంపాదేవి సోలంకి	07-09-20	2480000	0568- వన్ టౌన్ - విజయవాడ	22-11-2022 3.30 PM
7	72668278	చంపాదేవి సోలంకి	07-09-20	1490000	0568- వన్ టౌన్ - విజయవాడ	22-11-2022 3.30 PM
8	73052451	కట్టా వెంకట రమణ	27-05-21	112000	0704-కడప	25-11-2022 3.30 PM
9	73270858	గొల్లపల్లి భార్గవ్ యాదవ్	11-10-21	68000	0705-అనంతపూర్	25-11-2022 3.30 PM
10	73209227	గోడి రవి కుమార్‌రెడ్డి	02-09-21	460000	0742-కర్నూలు	22-11-2022 3.30 PM
11	72689102	SV రమణ రెడ్డి	16-09-20	1120000	0973-గూడూరు	23-11-2022 3.30 PM
12	73111981	నెల్లమలి కస్తూరయ్య	06-07-21	223000	0973-గూడూరు	23-11-2022 3.30 PM
13	72612173	తోట పెంచల జోత్స్న	03-08-20	96067	0973-గూడూరు	23-11-2022 3.30 PM
14	73222006	కూనరెడ్డి పరమేశ్వర రెడ్డి	09-09-21	130000	0995-నంధ్యాల	23-11-2022 3.30 PM
15	73211077	కూనరెడ్డి రామ్ భూపాలరెడ్డి	03-09-21	96000	0995-నంధ్యాల	23-11-2022 3.30 PM
16	73239830	రామాజీ ప్రసన్న లత	21-09-21	40000	0995-నంధ్యాల	23-11-2022 3.30 PM
17	73038772	చింతకుంట మహీధర్ రెడ్డి	13-05-21	140000	1013-ప్రొద్దుటూరు	24-11-2022 3.30 PM
18	73235573	వెజ్జు సూర్యచంద్రరావు	18-09-21	200000	1033-చిన్నమిరం	23-11-2022 3.30 PM
19	73529512	ముంద్రు శివ ప్రసాద్	18-05-22	199000	1034-నరసరావుపేట	24-11-2022 3.30 PM
20	73230759	వేములూరి చాణక్యుడు	15-09-21	39000	1034-నరసరావుపేట	24-11-2022 3.30 PM
21	72677226	పి విశాల్	09-09-20	1120000	1243-డాబా గార్డెన్,-విశాఖపట్నం	23-11-2022 3.30 PM
22	73186411	పెరుమాళ్ల మణికంఠ రెడ్డి	18-08-21	215000	1624-పిడుగురాళ్ళ	23-11-2022 3.30 PM
23	72368866	పింగిళి దీపిక	09-01-20	102423	1641-ఏలూరు	23-11-2022 3.30 PM
24	73332705	పోరల్ రాకేష్	02-12-21	270000	2025-రాయదుర్గం	22-11-2022 3.30 PM
25	73032120	కేడిమి నరేష్	06-05-21	124000	2025-రాయదుర్గం	22-11-2022 3.30 PM
26	73423535	బొమ్మితి గారి మరెక్క	21-02-22	105000	2025-రాయదుర్గం	22-11-2022 3.30 PM
27	73444088	నాయకుల లక్ష్మీదేవి	09-03-22	30000	2025-రాయదుర్గం	22-11-2022 3.30 PM
28	73464591	తిరువీడి గురివిశెట్టి	28-03-22	680000	2259-మాచెర్ల	22-11-2022 3.30 PM
29	73192603	గొంగటి అంజిరెడ్డి	23-08-21	295900	2259-మాచెర్ల	22-11-2022 3.30 PM
30	72629354	విజయ్ కుమార్ సల్లా	13-08-20	118000	2280-కళ్యాణదుర్గ్	23-11-2022 3.30 PM
31	72623474	విజయ్ కుమార్ సల్లా	10-08-20	110000	2280-కళ్యాణదుర్గ్	23-11-2022 3.30 PM
32	72702425	హన్మంతరావు కన్నా	24-09-20	129000	2367-జగ్గయ్యపేట	23-11-2022 3.30 PM
33	72679592	జుజ్జూరి వంశీకృష్ణ	10-09-20	102300	2367-జగ్గయ్యపేట	23-11-2022 3.30 PM
34	73177082	నరేష్‌బాబు బెల్లంకొండ	12-08-21	79400	2367-జగ్గయ్యపేట	23-11-2022 3.30 PM
35	73217685	బాలంకయ్య దేరంగుల	07-09-21	77300	2381-మార్కాపూర్	25-11-2022 3.30 PM
36	73254332	నలదల రామ్ గోపాల్	29-09-21	2651000	2392-చీరాల	25-11-2022 3.30 PM
37	73108473	షేక్ ఉప్పలపాటి మహమ్మద్ సమీర్	02-07-21	194000	2437-చిలకలూరిపేట	25-11-2022 3.30 PM
38	73075901	లావణ్య ఆర్	14-06-21	262000	2703-KT రోడ్డు-తిరుపతి	24-11-2022 3.30 PM
39	72660119	కాసా శ్రీకాంత్ రావు	31-08-20	29000	2813-గాజువాక-విశాఖపట్టణం	22-11-2022 3.30 PM
40	73442230	అరుమళ్ల హరి ప్రసాద్	08-03-22	18800	2825-గాంధీ పార్క్-గుంటూరు	28-11-2022 3.30 PM
41	72672722	టంకశాల నాగరాజ కుమారి	07-09-20	329096	3975-ఎనికేపాడు	24-11-2022 3.30 PM
42	73211349	ఓజే రామ స్వామి	03-09-21	35000	4159-సి క్యాంప్ సెంటర్, కర్నూలు	22-11-2022 3.30 PM
43	73066607	గండు శేఖర్	07-06-21	151000	4284-వెంకటగిరి	22-11-2022 3.30 PM
44	73091379	రాజమ్మ పెయ్యల	23-06-21	95000	4284-వెంకటగిరి	22-11-2022 3.30 PM
45	73392672	పొన్నగంటి బాలవంశీ కృష్ణ	24-01-22	38000	7762-గొల్లగూడెం-తాడేపల్లిగూడెం	24-11-2022 3.30 PM
46	73592917	జి సతీష్ కుమార్	30-06-22	110000	8282-చిత్తూరు	24-11-2022 3.30 PM
47	73529609	మీగడ మరియన్న	18-05-22	90000	9396-నూనెపల్లి	23-11-2022 3.30 PM
48	73319028	మీగడ మరియన్న	22-11-21	89000	9396-నూనెపల్లి	23-11-2022 3.30 PM

ఈ వేలం "ఎక్కడ ఉన్నది అక్కడే" మరియు "ఉన్నది ఉన్నట్లు" ప్రాతిపదికన నిర్వహించబడుతుంది మరియు సదరు బంగారు ఆభరణాల నాణ్యత, స్వచ్ఛత, క్యారెట్ విలువ, బరువు లేదా మదింపుకు సంబంధించి ఎటువంటి ప్రాతినిధ్యాలు లేదా వారెంటీలు ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు ఇవ్వదు మరియు ఇవ్వబోదు. తాము ఇవ్వజూపిన విలువ మొత్తాన్ని బిడ్లు రూపంలో దాఖలు చేయడానికి ముందు సదరు బంగారు ఆభరణాల నాణ్యత, స్వచ్ఛత, క్యారెట్ విలువ, బరువు లేదా మదింపు గురించి తమకు తాము ధృవీకరించుకోడం, పరిశీలించుకోడం మరియు సంతృప్తి చెందడం మొదలగు అంశాలు కొనుగోలుదారుల యొక్క ఏకైక మరియు సంపూర్ణ బాధ్యత. వేలం నిర్వహించడానికి నిర్దేశించిన సమయానికి 45 నిమిషాల ముందు వేలందారులు తమ సొంత ఖర్చు మరియు వ్యయంతో, వేలం జరిగే చిరునామాలో నిపుణుల సలహాతో కానీ లేకుండా కానీ బంగారు ఆభరణాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవచ్చు. బ్యాంకు సముచితం అని భావించి నిర్ధారించిన కనీస రిజర్వు ధరకు లోబడి వేలం నిర్వహించబడుతుంది. బ్యాంక్ తన అభీష్టానుసారం విధించటానికి సబబుగా భావించే అదనపు నిబంధనలు మరియు షరతులకు లోబడి సదరు వేలానికి సంబంధించిన వేలం ప్రక్రియ మరియు అమ్మకం (ఒకవేళ ఉంటే) నిర్వహించబడుతుంది. ఒకవేళ పైన పేర్కొన్న రుణగ్రహీత(లు), ఋణ ఒప్పందం ప్రకారం బ్యాంకుకు చెల్లించాల్సిన తన వ్యక్తిగత ఋణ ఖాతా లోని ఋణం మొత్తాన్ని వేలానికి ముందు చెల్లిస్తే, తదుపరి నోటీసు లేకుండా, సదరు ఋణానికి సంబంధించి తనఖా పెట్టిన ఆభరణాలు వేలం నుండి ఉపసంహరించబడతాయి. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మరియు ఎటువంటి కారణం చూపకుండా వేలాన్ని వాయిదా వేయడం లేదా రద్దు చేయడం మరియు ఎటువంటి కారణం చూపకుండా ఏదైనా ఒక బిడ్డును కానీ లేదా అన్ని బిడ్లను కానీ రద్దు చేయడం లేదా తిరస్కరించడం వంటి సంపూర్ణ విచక్షణాధికారాలు బ్యాంకు అధీకృత అధికారి కలిగియున్నారని తెలియచేయడమైనది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 15-11-2022

అధీకృత అధికారి
HDFC బ్యాంకు లిమిటెడ్

ఎమ్మెల్యే టిజెఆర్‌కు నిరసన సెగ

పోలీస్ రక్షణతో సాగిన 'గడపగడపకూ..'



నిరసనకారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్‌బాబుకు నిరసన సెగ తగలింది. 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నాగులుప్పలపాడు మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించాల్సి ఉంది. గ్రామంలో పర్యటించేందుకు సిద్ధమైన ఎమ్మెల్యేను గ్రామస్తులు అడ్డుకున్నారు. ముళ్లకంచెలు, దిమ్మెలు అడ్డుగా పెట్టారు. 'ఎప్పుడో ఎన్నికలప్పుడు ఓట్లు అడిగేందుకు వచ్చారు.. మళ్లీ ఇప్పుడు వచ్చారు.. మా రోడ్ల పరిస్థితి చూడండి.. మా కాలనీకి ఏమి చేశారు.. కాలనీలో ఒక్క సిమెంట్ రోడ్డు కూడా వేయలేదని, పట్టాలు ఇచ్చారు గానీ స్థలాలు చూపలేదని పేర్కొన్నారు. గ్రామస్తులతో పోలీసులు చర్చలు జరిపారు. మాట్లాడుకొని పరిష్కరించుకోవచ్చుని సిఐ, ఎస్ఐలు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు ససేమిరా అన్నారు. గ్రామస్తులను చెదరగొట్టేందుకు పోలీసులు యత్నించడంతో వారు అక్కడే రోడ్డుపై బైఠాయించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే ర్యాలీపైకి గ్రామస్తులు చెప్పులు, రాళ్లు విసరడంతో నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల రక్షణలో ఎమ్మెల్యే గడగడపకూ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరసనకారులతో మాట్లాడి వారి సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. ఇన్ని సమస్యలు ఉంటే తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. మీ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

న్యాయ రాజధానితో కర్నూలు అభివృద్ధి

- వికేంద్రీకరణ సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

న్యాయ రాజధాని ద్వారా కర్నూలు మరింత అభివృద్ధి చెందుతుందని కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. 'పరిపాలన వికేంద్రీకరణపై అవగాహన' అనే సదస్సును కర్నూలు కెవిఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సదస్సులో కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, విద్యార్థి సంఘం జెఎసి నాయకులు శ్రీరాములు, సునీల్ కుమార్ రెడ్డి, ప్రశాంత్ కుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ.. కర్నూలులో న్యాయ రాజధాని ఏర్పాటును ప్రతి ఒక్కరు ఆహ్వానిస్తున్నారని తెలిపారు. కర్నూలుకు న్యాయ రాజధాని రాకుండా న్యాయస్థానాల ద్వారా ప్రతిపక్షాలు అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ మాదిరి మరో వేర్పాటు ఉద్యమం రాకుండా ఉండాలంటే అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. విజయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమ అభివృద్ధి చెందాలంటే కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలన్నారు.

పోలవరం నిర్వాసితులకు అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ
- దీక్ష విరమణ



దీక్షను విరమింపజేస్తున్న ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - కుక్కునూరు (ఏలూరు జిల్లా)

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేస్తున్న ముంపు మండలాల నిర్వాసితుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏలూరు జిల్లా కుక్కునూరులో ఎనిమిది రోజులుగా కొనసాగిస్తున్న రిలే దీక్షలను ఆయన సోమవారం సందర్శించారు. నిర్వాసితులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గోదావరి వరద ప్రస్తుతం 53 అడుగులకు చేరితేనే గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి నీటిని నిల్వచేస్తే విలీన మండలాల పరిస్థితి ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు వల్ల పూర్తి ముంపునకు గురవుతున్న ఎల్లప్పగూడెం, మాధవరం, కౌండిన్యముక్తి, బెస్తగూడెం గ్రామాలను 41.15 కాంటూర్‌లోకి చేర్చి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మొదటి విడతలో ప్రభుత్వం ప్రకటించిన ఎనిమిది గ్రామాలకు పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని కోరారు. గోదావరి వరదల కారణంగా మండలంలో1200 ఇళ్లు కూలిపో యాయని, 400 ఇళ్లకు మాత్రమే పరిహార మిచ్చారని, ఇందులో కొంతమంది అనర్హులకూ ఇవ్వడం ఎంతవరకు న్యాయమని విమర్శించారు. వరద బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని, వెంకటాపురం నుండి లంకాలపల్లి వరకూ రహదా రులు వేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు అండగా నిలిచి సమస్య పరిష్కారమ య్యే వరకూ తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం రిలే దీక్షలు చేస్తున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితుల సంఘం నాయకులు వై నాగేంద్రరావు, వై సాయి కిరణ్, ఎం బాబు, పట్ల లక్ష్మయ్య, రావు లక్ష్మి, మోహనరావు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- రామకుప్పం:

చిత్తూరు జిల్లా రామకుప్పం మండల పరిధిలోని చెల్దిగానిపల్లి వద్ద గల ప్రైవేట్ పాలడెయిరీలో ఓ యువకుడు విద్యుదాఘాతంతో దుర్మరణం చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఉమామహేశ్వరి తెలిపిన వివరాల మేరకు... వీకోట మండలం కొంగాటం పంచాయతీ శివునికుప్పం గ్రామానికి చెందిన సలీం (24) చెల్దిగానిపల్లిలోని ఓ ప్రైవేట్ పాలడెయిరీలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం డెయిరీ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌లో ఫ్యూజ్ పోవడంతో వైర్‌ను సరిచేయాల్సిందిగా డెయిరీ యాజమాన్యం సలీంను పంపింది. వైరు సరిచేసే క్రమంలో విద్యుత్ స్తంభాన్ని తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే సలీం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు, బంధులు పలమనేరు - కుప్పం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. డెయిరీ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తంచేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ
ఇ-ప్రొక్యూర్మెంట్ షార్టు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.2781/2022/ఇ1 తేది :14-11-2022
నిట్ నెం. 45/జే.టి.ఓ./2022-23

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ - సాధారణ నిధుల క్రింద మొత్తము 15 పనులకు ఈ దిగువ ఉదహరించిన తేదీల యందు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండర్ పిలువబడినది.

మొత్తము పనులు : 15 నెం.లు అంచనా వ్యయము : 235.45 లక్షలు

పని నెం.01 నుండి 15 లకు :

1) టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన ప్రారంభతేది : ది.14-11-2022 ఉదయం గం.11.00 ని.ల నుండి
2) టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ కొరకు నిర్ణయించిన చివరి తేది : ది.21-11-2022 ఉదయం గం.11.00 ని.ల వరకు
3. ప్రైస్‌బిడ్ తెరచు తేది : ది.21-11-2022 మధ్యాహ్నం గం.02.00 లకు

మిగతా వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ http://www.apeprocurement.gov.in చూడగలరు.

మొబైల్ నెం. 98499 07303.

ఇట్లు
కమీషనర్,
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ

ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - రాంబిల్లి (అనకాపల్లి)

నేవల్ బేస్ నిర్వాసితుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదని సిపిఎం మండల కార్యదర్శి జి.దేముడు నాయుడు అన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామం వద్దనున్న నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేటింగ్ బేస్ (ఎన్ఎఒబి) మెయిన్ గేటు వద్ద నిర్వాసితులు తలపెట్టిన ఆందోళన సోమవారానికి 15వ రోజుకు చేరింది. నిర్వాసితులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నేవల్ బేస్ నిర్మాణం కోసం స్థానికుల నుంచి భూములు, ఇళు తీసుకుని 17 ఏళ్లయినప్పటికీ వారికి తగిన న్యాయం చేయలేదన్నారు. దీంతో కొత్తపట్నం, వాడనరసాపురం, కెజి.పాలెం, నేవీ కాలనీ, చిన్న కలవలపల్లి, కొత్తపేట, గోవిందపాలెం, వాడపాలెం గ్రామాల ప్రజలు రోడ్డున పడ్డారని తెలిపారు. వారి సమస్యల పరిష్కారానికి అధికారులు కనీస చొరవ చూపకపోవడం శోచనీయమన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు న్యాయం చేయాలని, జెట్టీ నిర్మాణం చేపట్టి మత్స్యకారులను ఆదుకోవాలని, స్థానికులకు నేవల్ బేస్‌లో 75 శాతం ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల ఆందోళనకు ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ మాధవ్, జనసేన ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ సుందరపు విజయ్ కుమార్ మద్దతు తెలిపారు.

BGR ENERGY

బిజిఆర్ ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: A-5 పన్నంగాడు ఇండస్ట్రియల్ ఎస్టేట్, రామాపురం పోస్ట్, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ 524401
కార్పొరేట్ కార్యాలయం : 443, అన్నా సలై, టేనాంపేట్, చెన్నై 600018 ఫోన్ : +91 44 24301000, ఫ్యాక్స్ : +91 44 24364656
కార్పొరేట్ గుర్తింపు సం. : L40106AP1985PLC005318 ఈ-మెయిల్ : compliance@bgrenergy.com వెబ్‌సైట్ : www.bgrcorp.com

సెప్టెంబరు 30, 2022తో ముగిసిన త్రైమాసికం& అర్ధ వార్షికానికి ఆడిటుచేయని స్టాండలోను & కన్సాలిడేటెడు ఆర్థిక ఫలితాల నివేదిక (రూ. లక్షలలో)

క్ర. సం.	వివరాలు	స్టాండలోన్			కన్సాలిడేటెడ్		
		త్రైమాసికంతో ముగిసిన 30.09.2022 (ఆడిట్ చేయని)	అర్ధవార్షికంతో ముగిసిన 30.09.2022 (ఆడిట్ చేయని)	త్రైమాసికంతో ముగిసిన 30.09.2021 (ఆడిట్ చేయని)	త్రైమాసికంతో ముగిసిన 30.09.2022 (ఆడిట్ చేయని)	అర్ధవార్షికంతో ముగిసిన 30.09.2022 (ఆడిట్ చేయని)	త్రైమాసికంతో ముగిసిన 30.09.2021 (ఆడిట్ చేయని)
1.	ఆపరేషన్ల నుండి పూర్తి ఆదాయం	18083	45343	50888	18083	45343	50888
2.	కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (పన్ను, మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటెంలకు ముందు)	(16266)	(27767)	543	(16343)	(27926)	391
3.	పన్నుకు ముందు కాలవ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	(16266)	(27767)	543	(16343)	(27926)	391
4.	పన్ను తరువాత కాల వ్యవధి కొరకు నికర లాభం/(నష్టం) (మినహాయింపు మరియు/లేదా అసాధారణ ఐటెంల తరువాత)	(12147)	(20943)	417	(12225)	(21103)	265
5.	కాలవ్యవధి కొరకు (సమీకృత లాభం/(నష్టం) కాలవ్యవధి కొరకు పూర్తి సమగ్ర ఆదాయం (పన్ను తరువాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం(పన్ను తరువాత)	(12154)	(20974)	730	(12232)	(21134)	578
6.	ఈక్విటీ వాటా మూలధనం (రూ.10/-చొ॥న మూలధనం, పూర్తిగా చెల్లించిన)	7216	7216	7216	7216	7216	7216
7.	రిజర్వులు (రివాల్యువేషన్ రిజర్వు మినహా)	-	-	-	-	-	-
8.	వాటా ఒక్కింటికి రాబడి (రూ.10/-చొ॥న)						
	1. బేసిక్ : రూ.	(16.83)	(29.02)	0.58	(16.91)	(29.18)	0.44
	2. డైల్యూటెడ్: రూ.	(16.83)	(29.02)	0.58	(16.91)	(29.18)	0.44

గమనిక:
1. పై ఫలితాలు ఆడిట్ కమిటీచేత సమీక్షించబడినవి మరియు నవంబర్ 14, 2022న నిర్వహించబడిన సదరు సమావేశాల వద్ద బోర్డు ఆఫ్ డైరెక్టర్లచేత సిఫారసుచేయబడినది.
2. పైవి సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్& డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 33 క్రింద స్టాక్ ఎక్చేంజిలతో దాఖలుచేయబడిన ఆర్థిక ఫలితాల వివరణాత్మక ఫార్మెట్ యొక్క సారాంశం. ఆర్థిక ఫలితాల పూర్తి ఫార్మెట్ స్టాక్ ఎక్చేంజి వెబ్‌సైట్. www.nseindia.com మరియు www.bseindia.com కంపెనీ వెబ్‌సైట్ www.bgrcorp.com పై అందుబాటులో ఉంటాయి.

బిజిఆర్ ఎనర్జీ సిస్టమ్స్ లిమిటెడ్ తరువాత

ప్రదేశం: చెన్నై
తేది: నవంబర్ 14, 2022

అర్జున్ గోవింద్ రఘుపతి
మేనేజింగ్ డైరెక్టర్

సంపాదకీయం

నిరర్థక పర్యటన

ప్రధాని నరేంద్ర మోడీ శుక్ర, శని వారాల్లో చేసిన ఆంధ్రప్రదేశ్ పర్యటన రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను మరో మారు వమ్ము చేసింది. మోడీ టూర్ కోసం ఎ.పి. ప్రభుత్వం చేసిన కోట్లాది రూపాయల వ్యయం, సమయం వృథా ప్రయాసగా మిగిలిపోయింది. ప్రధాని రాష్ట్రానికి వస్తున్నారంటే, ఏమేమి వరాలిస్తారోనన్న ఉత్సుకత సహజంగానే ప్రజల్లో కలుగుతుంది. రాష్ట్ర విభజనతో సతమతమవుతున్న మనకైతే ఆ ఉత్సుకత ఇంకా ఎక్కువగా ఉంటుంది. పార్లమెంట్ పాస్ చేసిన విభజన చట్టం అమలు, ఆ సమయంలో ఇచ్చిన హామీలు, వాటికి తోడు కేంద్ర విధానాల్లో భాగంగా విశాఖ ఉక్కు మెడపై వేలాడుతున్న ప్రైవేటీకరణ కత్తి వంటి ఎన్నెన్నో జటిల సమస్యలపై ప్రధాని వివరణ ఇస్తారని ప్రతి ఒక్కరూ ఆశిస్తారు. కానీ మోడీ తన పర్యటనలో వాటి ఊసెత్తకపోవడంతో ఆయనది నిరర్థక పర్యటనే అయింది. ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలకు పరిమితమైంది. అవేమీ కొత్తవేం కాదు. ఆ మాటకొస్తే ప్రధాని శంకుస్థాపనలకు విలువే లేదనడానికి ప్రత్యక్ష ఉదాహరణ రాజధాని అమరావతి. అమరావతిలో రాజధాని నిర్మాణానికి భూమి పూజ చేసి, ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తామని చెప్పి, ఎనిమిదేళ్లల్లో రూ.2,500 కోట్లివ్వడం గగనమైంది.

హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఎ.పి. పారిశ్రామికంగా ఏమీ లేని రాష్ట్రమైంది. పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామన్నారు మోడీ, ఆయన పార్టీ బిజెపి. అనంతరం హోదా అనేది ముగిసిన అధ్యాయమని మాట తప్పారు. విశాఖలో రైల్వే జోన్ అన్నారు. ఇన్నేళ్లయినా నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేయలేదు. విశాఖ వచ్చిన మోడీకి ఆ విషయం గుర్తు లేక కాదు, కావాలనే విస్మరించారు. ఎందరో త్యాగాలు, బలిదానాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ను కేంద్రం అమ్మేస్తామనడంతో కార్మికులు ఏడాదిన్నరకుపైగా ఆందోళనలు చేస్తున్నారు. విశాఖ అభివృద్ధికి తలమానికంగా ఉన్న వైజాగ్ స్టీల్ గురించి ప్రస్తావించకుండా సమ్మిళిత వృద్ధి అంటే ప్రజలెలా నమ్ముతారు? విశాఖలో మెట్రో రైలు అంశం విభజన చట్టంలో పొందుపర్చగా అతీగతీ లేదు. విశాఖను ప్రపంచంలోనే అతి పెద్ద వ్యాపార కేంద్రంగా మారుస్తామనడం ఎవరిని మభ్యపెట్టడానికి? వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి ఇస్తామన్న నిధులను ఎగ్గొట్టారు. ఉన్న వైజాగ్ స్టీల్‌ను అమ్మకానికి పెట్టి కడపలో స్టీల్ ఫ్యాక్టరీకి ఎగనామం పెట్టారు. విభజన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధాని తెలుగు ప్రజల సుఖ సంతోషాలు కోరుకోవడం పెద్ద దగా.

రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేసిన కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీని రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిలదీయకపోవడం అభ్యంతరకరం. 'కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీతో మా బంధం రాజకీయాలకు అతీతం. రాష్ట్ర ప్రయోజనాలు తప్ప వేరే ఎజెండా మాకు లేదు' అని సభా ముఖంగా ప్రకటించిన జగన్, రాష్ట్రానికి ద్రోహం చేసినా బంధాన్ని కొనసాగించడానికి కారణమేంటో వెల్లడిస్తే బాగుండేది. కేంద్రాన్ని 'అడుగుతూనే ఉంటాం' అన్న జగన్ విశాఖ సభలోనూ అదే పని చేశారు తప్ప గట్టిగా మోడీని నిగ్గదీసింది లేదు. మోడీతో ఏకాంతంగా సమావేశమైన పవన్ కళ్యాణ్, రాష్ట్రానికి అన్యాయం చేసిన ప్రధానిని ప్రశ్నించినట్లేమీ కనబడలేదు. ప్రతిపక్ష టిడిపి సైతం కేంద్రాన్ని, మోడీని గట్టిగా డిమాండ్ చేసింది లేదు. రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని ప్రశ్నించేందుకు సిద్ధమైన వామపక్షాలను రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో నిలువరించింది. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉద్యమిస్తున్న కార్మిక సంఘాల నేతలను అరెస్టు చేసింది. తతిమ్మా రాష్ట్రాల్లో కేంద్రం చేస్తున్న అన్యాయాలపై ప్రభుత్వాలు, అక్కడి పార్టీలు వ్యతిరేకిస్తుండగా, మన దగ్గర అందుకు భిన్నంగా అధికార, ప్రధాన ప్రతిపక్షాలు నోరెత్తట్లేదు. రాష్ట్రానికొచ్చిన ప్రతిసారీ తెలుగు ప్రజల తెగువను ఆకాశానికెత్తడం ప్రధానికి రివాజైంది. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన బిజెపిపై తెలుగు ప్రజలు తెగువ ప్రదర్శించి తమ సత్తా నిరూపించాలి.

మహనీయుల మాట



విజయం మనల్ని ఊరికే వరించదు. దాని వెనుక ఎంతో కృషి, పట్టుదల, త్యాగం దాగుంటాయి.

- పీలే,
అమెరికన్ నటుడు.

నిజాయితీ లేని నయా ఉదారవాదం





ప్రభాత్ పట్నాయక్

ఆర్థిక పరిణామాలను శాస్త్రీయంగా వివరించడం కన్నా తమ దోపిడీని సమర్థించుకునే విధంగానే వివరించడానికి పాలక వర్గాలు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. అశాస్త్రీయమైన ఈ సైద్ధాంతిక వివరణలను అన్నింటినీ ఒకదగ్గర చేరిస్తే అది ఒక 'అశాస్త్రీయమైన ప్రత్యామ్నాయ ఆర్థిక శాస్త్రం' అవుతుంది. దీనినే మార్క్స్ "అసభ్య అర్థశాస్త్రం" అన్నాడు. అయితే ఈ 'అసభ్య అర్థశాస్త్రానికి' కూడా ఒక పద్ధతి ఉంటుంది. ఆర్థిక పరిణామాలను తనదైన "అసభ్య" పద్ధతికి లోబడి అది వివరించడానికి ప్రయత్నిస్తుంది. అటువంటి అసభ్య పద్ధతికి కూడా కట్టుబడకుండా పూర్తి అవకాశవాదంతో, కేవలం పాలకవర్గ దోపిడీని సమర్థించడమే లక్ష్యంగా పెట్టుకుని ఆర్థిక పరిణామాలను వివరించడానికి తయారైతే అది "అసభ్య" దశ కన్నా దిగజారిపోతుంది. అప్పుడు దానిలో ఏమాత్రమూ నిజాయితీ ఉండదు. ప్రస్తుతం నయా ఉదారవాద కాలంలో అటువంటి "నిజాయితీ లేని" దిగజారుడుతనం కనిపిస్తోంది. దీనిని వివరించడానికి నేను మూడు ఉదాహరణలిస్తాను.

మొదటి ఉదాహరణ దారిద్ర్య రేఖకు సంబంధించినది. గ్రామీణ భారతంలో రోజుకు తలసరి 2400 కేలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేని వారు, పట్టణాలలో 2100 కేలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేనివారు దారిద్ర్య రేఖకి దిగువన ఉన్నట్టు మన ప్లానింగ్ కమిషన్ 1973-74లో నిర్వచనం ఇచ్చింది. ఈ ప్రాతిపదిక సరైనదా కాదా అన్న చర్చను పక్కన పెడితే, కనీసం ఒక కొలవగలిగిన ప్రాతిపదికగా ఇది ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. ఈ దారిద్ర్య రేఖకు దిగువ ఎందరున్నారో అంచనా వేయడానికి నాలుగేళ్ళకో మారు జాతీయ శాంపిల్ సర్వే నిర్వహిస్తారు. నయా ఉదారవాద కాలంలో మన దేశంలో ఈ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి సంఖ్య పెరిగినట్టు ఈ శాంపిల్ సర్వేలు చాలా స్పష్టంగా వెల్లడిస్తున్నాయి (2017-18 సర్వే వివరాలను వెల్లడి కాకుండా ప్రభుత్వమే దాచిపుచ్చింది).

అయితే ప్లానింగ్ కమిషన్ దారిద్ర్యం యొక్క నిర్వచనాన్నే మార్చేసింది. తలసరి ఆహార వినియోగాన్ని లెక్కలోకి తీసుకోడానికి బదులు వినిమయ ధరల సూచీని ప్రాతిపదికగా చేసింది. ఒకానొక సంవత్సరంలో కనీసస్థాయి కేలరీలు పొందడానికి అవసరమైన ఆహారపు ధరల స్థాయిని నిర్ధారించింది. అప్పటి ధరల సూచికలోని పాయింట్లను దారిద్ర్య రేఖకు ప్రాతిపదికగా నిర్ణయించింది. ఇక ఆ తర్వాత సంవత్సరాలలో ధరల సూచిక పాయింట్లలో వచ్చే మార్పులను బట్టి దారిద్ర్య రేఖను మార్చుతూ వస్తోంది. వాస్తవంగా ఆ పాయింట్ల వద్ద లభించే ఆహారం ఎన్ని కేలరీల శక్తినిస్తోందో ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ధరల సూచికను లెక్కిస్తున్న తీరు మనకి తెలుసు. వాస్తవంగా పెరుగుతున్న ధరలను అది పూర్తిగా పరిగణనలోకి తీసుకోవడం లేదు. ధరల పెరుగుదల ఎక్కువగా ఉంటోంది. ధరల సూచిక పాయింట్లు మాత్రం ఆ పెరుగుదలలో కొంత భాగాన్నే చూపిస్తున్నాయి. ధరల సూచిక పాయింట్ల ప్రాతిపదికన దారిద్ర్య రేఖను నిర్ణయించినందువలన క్రమంగా ఆ పాయింట్ల వద్ద అంతకంతకూ తక్కువ కేలరీల ఆహారం లభిస్తోంది. తొలుత నిర్ణయించిన కేలరీల ప్రాతిపదిక స్థానంలో ధరల సూచికను ప్రాతిపదిక చేసినందువలన వచ్చిన ఫలితం ఇది. అయితే పాలకులు మాత్రం దీనిని చూడడానికి నిరాకరిస్తూ, దారిద్ర్యం తగ్గిపోతోందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. 1973-74తో పోల్చితే గ్రామీణ భారతదేశంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి శాతం 2011-12 నాటికి 56.4 నుండి 25.7కు తగ్గిందని, అదే పట్టణ ప్రాంతాలలోనైతే 49 నుండి 13.7కు తగ్గిందని, ఆ తర్వాత కాలంలో కూడా అదే ట్రెండ్ కొనసాగుతోందని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కాని అదే సమయంలో ప్రపంచ ఆకలి సూచికలో భారతదేశం స్థానం నానాటికీ దిగజారుతూ 107కి చేరింది (మొత్తం 120 దేశాలను పరిశీలించి ఆకలి సూచికను రూపొందించారు).

> **ధరల సూచిక పాయింట్లు మాత్రం ఆ పెరుగుదలలో కొంత భాగాన్నే చూపిస్తున్నాయి. ధరల సూచిక పాయింట్ల ప్రాతిపదికన దారిద్ర్య రేఖను నిర్ణయించినందువలన క్రమంగా ఆ పాయింట్ల వద్ద అంతకంతకూ తక్కువ కేలరీల ఆహారం లభిస్తోంది. తొలుత నిర్ణయించిన కేలరీల ప్రాతిపదిక స్థానంలో ధరల సూచికను ప్రాతిపదిక చేసినందువలన వచ్చిన ఫలితం ఇది. అయితే పాలకులు మాత్రం దీనిని చూడడానికి నిరాకరిస్తూ, దారిద్ర్యం తగ్గిపోతోందంటూ ప్రచారం చేసుకుంటున్నారు.**

దేశంలో ఆకలి పెరిగిందని ఒప్పుకోడానికి బదులు ప్రభుత్వ ఆర్థికవేత్తలు ప్రజల స్థితిగతులు మెరుగుపడ్డాయి గనుకనే వాళ్ళు తీసుకునే ఆహారపు కేలరీల విలువ తగ్గిపోయిందన్న వాదనను ఎత్తుకున్నారు. ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపడింది గనుకనే వాళ్ళు తమ బిడ్డల చదువు కోసం, కుటుంబ వైద్య అవసరాల కోసం ఎక్కువగా ఖర్చు పెడుతున్నారని, అందువలన వాళ్ళు తీసుకునే ఆహారపు కేలరీల విలువ తగ్గిపోవడం వారి జీవన ప్రమాణాల తగ్గుదలకు కాకుండా మెరుగుపడిందనడానికి సంకేతం అని వారు వాదిస్తున్నారు. వేరే ఏ దేశంలోనైనా, తలసరి ఆదాయం పెరిగితే అక్కడ ఆహారపు కేలరీల విలువ పెరుగుతోంది. మన దేశంలో కూడా ఆదాయాలు పెరిగిన సామాజిక తరగతుల ప్రజలు తీసుకునే ఆహారపు కేలరీల విలువ పెరుగుతోంది. కాని ఈ వాస్తవం మన అధికారిక ఆర్థికవేత్తలకు పట్టదు.

నిజానికి 2009-10లో చేసిన శాంపిల్ సర్వే ప్రకారం 2004-5తో పోల్చుకుంటే 28.3 శాతం నుండి 33.5 శాతానికి పేదరికం పెరిగింది (ధరల సూచిక ప్రాతిపదికన). అదే కేలరీల ప్రాతిపదికన చూసినప్పుడు పేదరికం 69.5 నుండి 75.5 శాతానికి పెరిగింది. అయితే అధికారులు ఆ శాంపిల్ సర్వే చేసిన ఏడాది కరువు వచ్చిందని, అందువలన ఆ సర్వే ఫలితాలను ప్రామాణికంగా తీసుకోవడం కుదరదని ప్రకటించారు. నిజానికి 2009-10 లో కరువు వచ్చినప్పటికీ ఆర్థిక వృద్ధి మొత్తం మీద 8.6 శాతంగా నమోదైంది. వ్యవసాయ రంగంలోనైతే 1.5 శాతం వృద్ధి నమోదైంది. అయినా, దారిద్ర్యరేఖకు దిగువన ఉండేవారి శాతం పెరిగింది. కనీసపు కేలరీల ఆహారం పొందలేకపోయినవారి శాతం పెరిగింది. మన ఆర్థికవేత్తలు ఒకవైపు దేశంలో ఆర్థికవృద్ధి నమోదైంది కాబట్టి అది పేదరికం తగ్గుదలకు సంకేతం అని వాదిస్తారు. మరోపక్క అలా ఆర్థికవృద్ధి నమోదైన సంవత్సరంలో వచ్చిన సర్వే ఫలితాలను మాత్రం ఒప్పుకోకుండా మళ్ళీ సర్వే చేయమని ఆదేశిస్తారు. వారిలో నిజాయితీ లేదనడానికి ఇదొక ఉదాహరణ.

ఇక రెండో ఉదాహరణ ప్రపంచ వాణిజ్య సంస్థకు సంబంధించినది. వ్యవసాయదారులకు ఆ యా దేశాల ప్రభుత్వాలు ఇచ్చే సబ్సిడీలలో కొన్నింటిని "మార్కెట్‌ను దెబ్బ తీసే సబ్సిడీలు" గాను, మరికొన్నింటిని "మార్కెట్‌ను దెబ్బ తీయని సబ్సిడీలు" గాను ప్రపంచ వాణిజ్య సంస్థ పరిగణిస్తుంది. సంపన్న పెట్టుబడిదారీ దేశాలు (యూరోపియన్ యూనియన్ దేశాలు, అమెరికా) తమ తమ వ్యవసాయ రంగాలకు నేరుగా నగదు రూపంలో ఇచ్చే సబ్సిడీలు మార్కెట్ ను దెబ్బ తీయవని ప్రపంచ వాణిజ్య సంస్థ అంటుంది. అదే మన దేశంలో ఇచ్చే మద్దత్తు ధర గాని, ఇన్‌పుట్ సబ్సిడీలు (ఎరువులకు విత్తనాలకు ఇచ్చేవి)గాని మార్కెట్‌ను దెబ్బ తీస్తాయని, అందుచేత వాటిపై పరిమితులు విధించాలని అంటుంది. నిజానికి మన దేశంలో ఇచ్చే మద్దతు ధరలు చిన్న రైతు వ్యవసాయాన్ని నిలబెట్టడంలోగాని, ప్రజా పంపిణీ వ్యవస్థను కొనసాగించడానికి గాని ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

> **ప్రజల ఆర్థిక స్థితి మెరుగుపడింది గనుకనే వాళ్ళు తమ బిడ్డల చదువు కోసం, కుటుంబ వైద్య అవసరాల కోసం ఎక్కువగా ఖర్చు పెడుతున్నారని, అందువలన వాళ్ళు తీసుకునే ఆహారపు కేలరీల విలువ తగ్గిపోవడం వారి జీవన ప్రమాణాల తగ్గుదలకు కాకుండా మెరుగు పడిందనడానికి సంకేతం అని వారు వాదిస్తున్నారు.**

> **రైతుల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించే విధానాన్ని ఎత్తివేయాలని వాదించేవాళ్లు ప్రపంచ వాణిజ్య సంస్థ ఎజెండానే మరో రూపంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. రైతులను ఆహార పంటల వైపు నుండి మళ్లించి తద్వారా దేశ ఆహార భద్రతను దెబ్బ తీయడమే వారి అసలు లక్ష్యం.**

కాని ప్రపంచ వాణిజ్య సంస్థ వాదన వేరేగా ఉంది. మద్దతు ధరలు ప్రకటించడం అంటే ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకోవడం అని, ఆ విధంగా జోక్యం చేసుకుంటే మార్కెట్ లోని సమతూకం దెబ్బ తింటుందని అంటుంది. అయితే అమెరికా తన దేశంలోని కొద్దిమందిగా ఉండే రైతులకు ఇచ్చే 10,000 కోట్ల డాలర్ల నగదు సబ్సిడీ మాత్రం మార్కెట్ మీద ఏ ప్రభావమూ చూపదని అంటుంది. నిజానికి అమెరికాలో చాలా సంవత్సరాలలో ప్రభుత్వం రైతులకు ఇచ్చిన నగదు సబ్సిడీ విలువ కన్నా ఆ రైతులు ఉత్పత్తి చేసిన పంటల విలువ తక్కువగా ఉంది. ప్రపంచ వాణిజ్య సంస్థ వాదన ప్రకారం చూసుకుంటే, వ్యవసాయ భూమి విస్తీర్ణం బట్టి ఇచ్చే ఆ నగదు సబ్సిడీ ఫలితంగా, అమెరికాలో అసలు ఎవరూ పంటలే పండించనవసరం లేదు. కాని ఆ విధంగా జరగలేదు కదా. ప్రభుత్వం ఇచ్చిన నగదు దన్నుతో ఆ రైతులు తమ పంటలను ఎక్కువగా పండించారు. భారతదేశంలో కూడా మద్దతు ధరలు, ఇన్‌పుట్ సబ్సిడీలు ఇక్కడ ఉన్న చిన్న చిన్న రైతులు నిలదొక్కుకుని వ్యవసాయోత్పత్తిని పెంచడానికి తోడ్పడతాయి. మరి అమెరికాలో ఇచ్చే సబ్సిడీ విధానం సరైనదని, ఇక్కడ సబ్సిడీ విధానం తప్పు అని ప్రపంచ వాణిజ్య సంస్థ ఎందుకు వాదిస్తోంది? కేవలం సంపన్న పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలను కాపాడి వర్ధమాన దేశాల వాణిజ్య ప్రయోజనాలను దెబ్బ తీయడమే దాని అసలు లక్ష్యం.

ఇక నా మూడో ఉదాహరణ మన ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ విధానం గురించి. మన దేశంలో రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వడం నిలిపివేయాలని వాదించేవాళ్ళు చాలా కాలం నుండీ ఉన్నారు. అలా కనీస ధర గ్యారంటీ చేయడం వలన రైతులు ఆహార పంటలను ఎక్కువగా పండిస్తున్నారని, ఎక్కువ ఆదాయాలు ఆర్జించిపెట్టే ఆహారేతర, వాణిజ్య పంటల వైపు రైతులు దృష్టి పెట్టడం లేదని వాళ్ళు అంటున్నారు. ఒకవైపు ఆకలిగొన్న ప్రజానీకం సంఖ్య పెరిగిపోతూ వుంటే రైతులు ఆహారేతర పంటలవైపు మళ్ళాలని వాదించడమే అర్థం లేనిది. ఆహార ధాన్యాల నిల్వలు పెరిగిపోతున్నాయి గనుక ఆహారేతర పంటల వైపు మళ్ళాలని చెప్పడం కూడా సరైన వైఖరి కాదు. ఆహార ధాన్యాల నిల్వలు పేరుకుపోకుండా ఉండాలంటే ఈ దేశంలో ఆకలిగొన్న ప్రజానీకపు కొనుగోలు శక్తిని పెంచడం పరిష్కారం అవుతుందే తప్ప ఆహార పంటల సాగు మానుకోవడం పరిష్కారం కాదు.

పోనీ, ఈ మేధావుల చెప్పినట్టు విని మన రైతులు ఆహార పంటలనుండి ఆహారేతర పంటలవైపు మారారే అనుకుందాం. అప్పుడు ఆ పంటల ధరలు పతనం కావు అని గ్యారంటీ ఏమైనా ఉందా? అలా ఆహారేతర పంటల ధరలు ఒక్కసారి పడిపోతే అప్పుడు ఈ రైతులను ఆదుకోడానికి మళ్ళీ మద్దతు ధరలు ప్రకటించాల్సి వస్తుంది కదా ?

రైతుల పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించే విధానాన్ని ఎత్తివేయాలని వాదించేవాళ్లు ప్రపంచ వాణిజ్య సంస్థ ఎజెండానే మరో రూపంలో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. రైతులను ఆహార పంటల వైపు నుండి మళ్లించి తద్వారా దేశ ఆహార భద్రతను దెబ్బ తీయడమే వారి అసలు లక్ష్యం.

అత్యధిక ప్రజానీకానికి ద్రోహం చేసే నయా ఉదారవాద విధానాలు తమ అసలు రూపాన్ని కప్పి పుచ్చుకోడానికి, తమ ఎజెండాను సమర్థించుకోడానికి ఇటువంటి నిజాయితీ లేని వాదనలను ఆర్థిక సిద్ధాంతాల పేరుతో ముందుకు తెచ్చే తాబేదార్లను ఉపయోగించుకుంటాయి.

(స్వేచ్ఛానువాదం)

సెటైర్

బేసికల్‌గా ఆయన మోడీ కదా!


సుబ్రమణ్యం

ఐదు వందల కోట్ల భారీ బడ్జెట్‌తో తీసిన సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని అనుకుంటే అది ఫ్లాప్ అయికూచుందనుకోండి. అప్పుడు అభిమానుల పరిస్థితి, నిర్మాత, దర్శకుడు, యాక్టర్ల పరిస్థితి ఎలా ఉంటుంది? ఇప్పుడు మోడీ వచ్చి వెళ్ళాక విశాఖలో, రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీల పరిస్థితి ఆ విధంగానే ఉంది. మోడీ పర్యటనకి పదిహేను రోజుల ముందు నుంచీ ఒకటే సందడిగా ఉండేది కాస్తా మోడీ తిరుగు ప్రయాణం అయిన తర్వాత మాత్రం ఉన్నట్టుండి సైలెంట్‌గా కనిపిస్తోంది.

పైకి కాస్తంత గంభీరంగా కనిపించడానికి వైసిపి నాయకులు తంటాలు పడుతున్నారు. "రెండు వారాలపాటు నానా హైరానా పడ్డాం. చెట్లు కొట్టించాం. దుకాణాలు లేపేశాం. జనాల్ని తోలుకు రావడానికి (వారి దృష్టిలో జనం గొర్రెలు కదా) నానా పాట్లూ పడ్డాం. లక్ష మందిని తీసుకొచ్చాం. రెండు లక్షల మంది వచ్చారని పత్రికల్లో రాయించాం. మోడీ గారిని సంతృప్తి పరచడానికి ఏమేం చేయాలో అన్నీ చేశాం. ఎక్కడా ప్రజల నిరసనలు వినపడకుండా, ఎర్ర జెండాలు కనపడకుండా ఎక్కడికక్కడ పోలీసులతో తొక్కేశాం. ఇంత చేసినా, మోడీ గారి నోటి వెంట జగన్ ప్రభుత్వం బాగా పని చేస్తోంది అని అనిపించలేకపోయాం కదా!" అని స్థానిక వైసిపి నేతలు లోలోపల బాధ పడుతున్నారు. "కనీసం మూడు రాజధానుల గురించైనా ప్రస్తావించలేదు కదా" అని వేదన పడుతున్న వాళ్ళూ లేకపోలేదు.

మామూలుగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ప్రసంగించి, ప్రధాని ముందు రాష్ట్ర ప్రజల అభ్యర్థనలను "మిక్కిలి సవినయంగా" ఉంచిన తర్వాత ప్రధాని "ఎంతో దయతో", "అత్యంత అభిమానంతో" రాష్ట్రానికి కొన్ని వరాలు ప్రకటించాలి. కాని ప్రధాని ముందే తన స్పీచ్ పూర్తి చేసేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి ప్రసంగించారు. "అడక్కుండానే మాకు రైల్వే స్టేషన్ ఆధునీకరణ ఇచ్చావ్. విశాఖ- రాయగఢ్ రైల్వే కారిడార్ ఇచ్చావ్, ఆరు లైన్ల రోడ్డు కూడా ఇచ్చావ్, ఇలాగే ఇంకా ఇస్తావ్. మాకు తెలుసు. అలాగే, ఆ చేత్తోటే పోలవరం నిధులు కూడ ఇస్తావని, విశాఖ ఉక్కును అమ్మకూడదన్న నిర్ణయం తీసుకుంటావని, ప్రత్యేక హోదా ఇస్తావని నేను నమ్ముతున్నాను. నువ్వు ఇస్తావ్. నాకు తెలుసు. ఎందుకంటే బేసికల్లీ యు ఆర్ మోడీ." అన్న విధంగా నువ్వు నాకు నచ్చావ్ సినిమాలో వెంకటేశ్ డైనింగ్ టేబుల్ దగ్గర ప్రార్థన చేసిన స్టైల్లో ముఖ్యమంత్రి ప్రసంగం సాగింది. జగన్ ప్రార్థనకి మోడీ ఏమీ స్పందించలేదు. ఎందుకంటే బేసికల్‌గా ఆయన మోడీ కదా. కాని వైసిపికి ఒళ్ళు దాచుకోకుండా పని చేసే కార్యకర్తలు మాత్రం "151 మంది ఎమ్మెల్యేలు, 22 మంది లోక్‌సభ ఎంపీలు ఉన్న తిరుగులేని మా పార్టీ అధినేత కేంద్రం ముందు మాత్రం ఇలాగైపోతున్నారేమిటి? అని తలలు పట్టుకుంటున్నట్టు అభిజ్ఞవర్గాల భోగట్టా.

"మాది బొత్తిగా వన్ సైడ్ లవ్ లాగా ఉంది కదా. పార్లమెంటులో అన్ని సందర్భాలలోనూ మోడీకే అనుకూలంగా ఓట్లు వేస్తున్నాం. రాష్ట్రపతి ఎన్నికల్లో 100 శాతం ఓట్లు అధికార పార్టీ అభ్యర్థికి పడిన ఏకైక రాష్ట్రం మాదే. ఒక వ్రతం మాదిరిగా మా అధినేత కేంద్రాన్ని గాని, మోడీని కాని నోరు తెరిచి ఒక్క మాట కూడా విమర్శించిన సందర్భం లేదు. లోకల్ బిజెపి నేతలు మమ్మల్ని నానా రకాలుగా తిడుతున్నా...అంతర్వేది అనో, రామతీర్థం అనో, అన్య మత ప్రచారం అనో రకరకాలుగా గొడవలు రేపుతున్నా...మా అధినాయకుడు "వ్యూహాత్మక మౌనం" పాటించారే తప్ప నోరు మెదపలేదు కదా. అయినా ఇంకా మోడీజీ కి మాపై దయ కలగడం లేదెందుకని? ఏమిటి మా ప్రార్థనలో లోపం ?" ఇది అధికార పార్టీ థింక్ ట్యాంక్ అంతర్మథనం.



ఇది చాలదన్నట్టు జగన్ "మాది రాజకీయాలకు అతీతమైన బంధం" అని వ్యాఖ్యానించడం కొత్త సమస్యగా మారింది. ఈ వ్యాఖ్యతో జగన్ ప్రతిపక్షాలను క్లీన్ బౌల్డ్ చేసేశారు అంటూ ఓ టివి చానెల్ (సాక్షి కాదు) అత్యుత్సాహంగా వ్యాఖ్యానించింది కూడా. ఇద్దరు రాజకీయ నాయకుల నడుమ రాజకీయాలకు అతీతమైన సంబంధం ఉండడం ఏమిటి? అని సామాన్య జనం మాత్రం విస్తుపోతున్నారు. ఆ బంధాన్ని అతికించిన ఫెవికాల్ ఏది? అది అదానీ బంధమా? లేక అంబానీ బంధమా? లేక రెండూ కలిసిన బంధమా? మరేదైనా వివాహ బంధమా? తెలుసుకోవాలని జనాలు ఉవ్విళ్ళూరుతున్నారు.

మామూలుగా అధికారపార్టీ సభలకి జనాలని తరలించడానికి అధికార యంత్రాంగం అంతా కదులుతుంది. ఇందుకు కాంగ్రెస్ కాని, టిడిపి కాని అతీతం కాదు. ఐతే విశాఖ సభకి జనాల్ని తరలించిన తీరు ప్రత్యేకం. "మీరు మీటింగ్‌కి రాకపోతే పెన్షన్ ఆపేస్తాం, డ్వాక్రా నిధులు ఇవ్వం, రేషన్ కార్డు కట్ చేసేస్తాం" అంటూ వినూత్న పద్ధతిలో వలంటీర్లు, చోటా నాయకులు జనాలని ఉత్సాహపరిచినట్టు వచ్చిన జనాలే చెప్పుకున్నారు. "మీటింగ్‌కి వెళ్తే కొత్తగా ఏదో మాకు ఇస్తారని అనుకున్నాం. కాని వెళ్ళకపోతే ఉన్నవి ఊడబీకేస్తాం అని భయపెట్టడం గతంలో ఎన్నడూ చూడలేదు" అని సీనియర్ మహిళలు చాలామంది గొణుక్కున్నారు.

ఇక ప్రధానితో ప్రత్యేక ఇంటర్వ్యూ సాధించిన జనసేనాని, ఇంటర్వ్యూ తర్వాత మరెక్కడా కనిపించకుండా రుషికొండ దగ్గర తేలారు. రోడ్ మ్యాప్ కోసం వెయిట్ చేస్తున్నాను అన్న ఆ హీరో మోడీతో మీటింగ్ తర్వాత ఆ ఊసు పెట్టడం లేదు.

అసలు ప్రధాన ప్రతిపక్షానికైతే ఈ మొత్తం మోడీ పర్యటనే మింగుడు పడలేదు. అందుకనే ఆ పార్టీ నేత సడెన్‌గా తెలంగాణలో ఆ పార్టీని బలోపేతం చేయడం మీద దృష్టి సారించడం జరిగింది. "మోడీ వస్తాడు, అమరావతి సంగతి తేల్చేస్తాడు, ఆ దెబ్బతో జగన్ ఇరుకున పడతాడు" అని స్థానిక టిడిపి నేతలు కొందరు అత్యుత్సాహ పడ్డారు. కాని వారు ఇప్పుడు వేరే పనుల్లో బిజీ అయిపోయినట్టుంది మరి.

"మా పుంజుని బరిలోకి దింపుతున్నాం. ఆ తర్వాత చూపిస్తాం మా తడాఖా" అంటూ బిజెపి కి చెందిన కొందరు నాయకులు గత రెండు నెలల నుంచీ నానా హడావుడీ చేశారు. "రాష్ట్ర రాజకీయాల రంగుల్ని, షేపుల్ని మార్చేస్తాం" అన్నారు. వాళ్ళ వంతు వాళ్ళూ జనాల్ని తోలుకొచ్చారు. ఎంతైనా స్వంత పార్టీ కదా. అందుకే మోడీ వాళ్ళతో ప్రత్యేకంగా గెస్ట్‌హౌస్ లో మీటింగ్ పెట్టారు. ఆ మీటింగ్‌లో ఏం జరిగిందో ఏమో. ఆ తర్వాత బిజెపి నేతలంతా గప్‌చుప్. ఐతే ఒకటి, రెండు ఆంగ్ల పత్రికలు మాత్రం విషయాన్ని బైటపెట్టాయి. "నా పేరు చెప్పుకుని మీరిక్కడ బలపడదామని చూస్తే కుదరదు. గుజరాత్ లో నేను ఏ విధంగా నా స్వంత పద్ధతులలో పైకొచ్చానో ఇక్కడ కూడా మీరు అదే విధంగా మీదైన స్వంత పద్ధతులలో బలపడాల్సిందే" అని మోడీ కుండ బద్దలుగొట్టినట్టు సమాచారం. "మనవాడే కదా అని మొర పెట్టుకుంటే మరి నాలుగు వడ్డించమన్నాడట వెనకటికి ఎవడో. అలా వుంది ఈ యనగారి పరిస్థితి. ఆయనగారికి గుజరాత్ లో అంబానీ, అదానీ ఉన్నారు. ఇక్కడ మనకెవరున్నారు? ఉన్న కొద్దిమందినీ ఇప్పటికే రెండు ప్రాంతీయ పార్టీలూ పంచేసుకున్నాయి. అంటూ రాష్ట్ర బిజెపి నేతలు ఆవేదనలో ఉన్నారు. "గుజరాత్ లో ఆయన అధికారంలోకి వచ్చాక కదా మత మారణ హోమం సృష్టించింది? మనల్ని ముందే రేగ్గొట్టమంటే ఎలా సాధ్యం? అని కూడా తర్జనభర్జనలు పడుతున్నారని సమాచారం.

"మన విశాఖ ఉక్కుని ప్రైవేట్ పరం కాకుండా చూస్తాం అని మన దగ్గర గట్టి కబుర్లు చెప్పిన ఈ ప్రాంతీయ పార్టీల నాయకులెవరికీ కేంద్రాన్ని గట్టిగా నిలదీసే దమ్ము లేదు అన్న విషయం మాకు స్పష్టం అయిపోయింది. ఇకముందు వారి చుట్టూ తిరగడం మానేసి మా కార్మికవర్గం సత్తా ఏమిటో చూపిస్తాం" అని విశాఖ కార్మికవర్గం మాత్రం ఊపు మీద ఉంది. ఇక ఎర్రజెండా పార్టీలు ఆ కార్మికవర్గం వెంటే ఉంటాయని వేరే చెప్పాలా?

★

జనవాక్యం

న్యాయమేనా?

రాజీవ్ గాంధీ హంతకులుగా నిర్ధారించబడి జీవిత ఖైదు అనుభవిస్తోన్న ఏడుగురు ముద్దాయిలను సుప్రీంకోర్టు విడుదల చేసింది. జీవిత ఖైదు నుండి దీర్ఘకాలం తర్వాత స్వేచ్ఛనివ్వడం మానవత్వమే కానీ తీవ్రవాదం లాంటి హీన నేరాలకు అది వర్తించవచ్చా? ఆ మధ్య గుజరాత్ ప్రభుత్వం ఒక సామూహిక మానభంగం, హత్య కేసుల్లో ముద్దాయిలకు కూడా స్వేచ్ఛనిచ్చింది. ముద్దాయిలకు, నేరం రుజువు కాబడి శిక్షలో ఉన్నవాళ్లకు ఉపశమనం కలిగించే పెద్ద మనస్సుగల వ్యవస్థ మరోవైపు విచారణకు కూడా నోచుకోని చిన్నచిన్న నేరాల్లోని అనుమానితుల్ని, నిందితుల్ని జైళ్లలో మగ్గేలా చూడడం కరెక్టేనా? అలాంటి వారు లక్షల్లో ఉండడం మరీ అన్యాయం. న్యాయం అందరికీ ఒకేలా అమలు కాకపోవడానికి చాలా కారణాలు ఉండొచ్చు. అయితే ఆ లోపాల్ని దిద్దుకోలేకపోతే అది న్యాయం కాదు. సత్వర న్యాయం సరైన న్యాయం అందించడానికి అవసరమైన సంస్కరణలు పాలనా వ్యవస్థలో, న్యాయ వ్యవస్థలో అవసరం.

– డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

చిన్నారులే దేశ భవిష్యత్తు : గవర్నర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ భవిష్యత్తుకు చిన్నారులే కీలకమని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. దర్బార్ హాల్‌లో సోమవారం జవహర్‌లాల్ నెహ్రూ 133వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ నెహ్రూకు గులాబీలు, పిల్లలంటే చాలా ఇష్టమని, పిల్లలు తోటలోని మొగ్గల్లాంటి వారని, జాగ్రత్తగా, ప్రేమగా పెంచి పోషించాలని చెబుతూ ఉండేవారన్నారు . భూగోళాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నేటి విద్యార్థులు, యువతపై ఉందని, నెహ్రూ స్మారకార్థం పాఠశాలలు, కళాశాలల్లో మొక్కలు నాటడం ద్వారా బాలల దినోత్సవాన్ని జరుపుకోవాలని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

నెల్లూరు పూర్వపు డిఎఫ్‌ఒ హాజరీకి ఉత్తర్వులు

ప్రజాశక్తి - అమరావతి

కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా రొయ్యల చెరువులను ధ్వంసం చేయించిన నెల్లూరు జిల్లా గత అటవీ అధికారి (డీఎఫ్‌ఓ) మంగమ్మ, రేంజ్ అధికారి మారుతి ప్రసాద్‌ల తీరుపై హైకోర్టు మండిపడింది. డిసెంబర్ 15న జరిగే విచారణకు వారిద్దరూ స్వయంగా హాజరుకావాలని జస్టిస్ యు. దుర్గాప్రసాద్‌రావు సోమవారం ఆదేశించారు. తోటపల్లి గూడూరు మండలం, కోడూరులోని సర్వే నెం.1505లోని 20 ఎకరాల రొయ్యల చెరువు ధ్వంసం చేసేందుకు ఇచ్చిన నోటీసును వి. గంగాధర్ హైకోర్టులో మూడేళ్ల క్రితం సవాల్ చేశారు. రేంజ్ అధికారికి నోటీసు జారీ అధికారం లేదని, డిఎఫ్‌ఓకు మాత్రమే ఉందని గతంలో హైకోర్టు తేల్చింది. ఆ నోటీసును రద్దు చేసింది. చెరువు ధ్వంసం చేయరాదని చెప్పింది. చెరువు ధ్వంసం చేయడం గురించి గంగాధర్ హైకోర్టు దృష్టికి తేవడంతో వారిద్దరిపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది.

తెలంగాణ హైకోర్టు నుంచి ఫైళ్లు తెప్పించారా?

రెండు రాష్ట్రాల రిజిస్ట్రార్లకు హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి

హైకోర్టు విభజన తర్వాత రాష్ట్ర హైకోర్టుకు చెందిన ఫైళ్లను తెలంగాణ హైకోర్టు నుంచి తెప్పించేందుకు తీసుకున్న చర్యలు తెలియజేయాలని రెండు రాష్ట్రాల హైకోర్టుల రిజిస్ట్రార్లను హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర హైకోర్టుకు చెందిన ఫైళ్లు తెలంగాణలో ఉండిపోయిన నేపథ్యంలో తీసుకున్న చర్యల గురించి వివరించాలని ఇరువురు రిజిస్ట్రార్ జనరల్లను చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా,జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులుతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఒక కేసు విచారణ సమయంలో గవర్నమెంట్ ప్లీడర్లు కల్పించుకుని తెలంగాణ హైకోర్టు నుంచి ఫైళ్లు రాకపోవడం వల్ల ఎదురౌతున్న సమస్యల గురించి చెప్పారు. విచారణను ఈ నెల 30కి వాయిదా పడింది.

మనీష్ సిసోడియా సన్నిహితుడు అరెస్ట్

న్యూఢిల్లీ : ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కీలక సహాయకుడు విజయ్ నాయర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం అదుపులోకి తీసుకుంది. ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించిన కేసులో సిబిఐ కస్టడీకి వ్యతిరేకంగా ఆయన బెయిల్ విచారణ జరగనున్న సమయంలో ఈ అరెస్ట్ జరగడం గమనార్హం.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల ఆప్కాస్ చొరవ ప్రశంసనీయం

ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఇపిఎఫ్, ఇఎస్‌ఐ సమస్యల పరిష్కారం కోసం ఆప్కాస్ (ఎపి కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్సెస్ సర్వీసస్) చూపుతున్న చొరవ ప్రశంసనీయమని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె నివాస్ పేర్కొన్నారు. సోమవారం మంగళగిరని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆప్కాస్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్) బి.నాగప్రసాద్ పాల్గొన్నారు.

జగన్ హాలిడే తీసుకోడమే మిగిలింది

టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పవర్ హాలిడే, క్రాప్ హాలిడే ఇచ్చిన ప్రభుత్వం ఇప్పుడు ఆక్వా హాలిడే ఇచ్చిందని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. ఇక జగన్ హాలిడే తీసుకోవడం మాత్రమే మిగిలి ఉందని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆక్వా రంగాన్ని ఉద్ధరిస్తానని జగన్ నమ్మించి దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వ అసమర్థతతో ఆక్వా రంగం సంక్షోభంలో పడిందని పేర్కొన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలు, దాణా ఖర్చులు, నిర్వహణ ఖర్చులతో ఆక్వా రైతులు కుదేలయ్యారని విమర్శించారు. వంద కౌంట్ కిలో రొయ్య ఉత్పత్తికి రూ.270లు ఖర్చవుతుంటే కనీసం రూ.200లు కూడా రాక రైతులు ఆక్వా హాలిడే ప్రకటిస్తున్నారని వివరించారు. కొత్త చట్టాల పేరుతో ఆక్వా రైతులను, ప్రాసెసింగ్ ప్లాంట్లను నిర్వహిస్తున్న వారిని వేధిస్తూ వైసిపి నేతలు కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆక్వా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జోన్‌తో సంబంధం లేకుండా ఆక్వా రైతులందరికి యూనిట్ విద్యుత్ రూ.1.50లకే అందించాలని కోరారు. దాణా, ఇతర సామాగ్రిని రాయితీకి ఇచ్చి మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కుష్టుపై ప్రత్యేక సర్వే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వచ్చే నెల 5వ తేదీ వరకు కుష్టు వ్యాధిసోకిన వారిని గుర్తించేందుకు సర్వేను నిర్వహించనున్నట్లు వైద్యఆరోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై యాస్మిన్ తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. పల్లెనుండి పట్టణ స్థాయి వరకు ఈ కార్యక్రమాన్ని 21 రోజుల పాటు రాష్ట్రంలోని 26 జిల్లాలలో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ సర్వేలో ఆశా వర్కర్లు, వలంటీర్లను కలిపి 42,752 మంది పనిచేస్తారని తెలిపారు. గుర్తించిన వారిని దగ్గరలో ఉన్న ప్రాథమిక లేదా పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపుతామని అన్నారు. రోజువారీగా 20 నుండి 25 ఇళ్లను సందర్శిస్తారని అన్నారు.ఈ సర్వే పర్యవేక్షణకు 3404 మంది పారా మెడికల్ సిబ్బందిని ఎంపిక చేశామని వివరించారు.

సిఆర్‌డిఎ చట్టబద్ధతపై హైకోర్టులో పిల్

ఏడేళ్లనాటి వ్యాజ్యంలో కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

ఎపి సిఆర్‌డిఎ చట్టబద్ధత లేదంటూ 2015లో దాఖలైన పిల్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. విచారణను డిసెంబర్ 15కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు డివిజన్ బెంచ్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. సిఆర్‌డిఎ యాక్ట్ రాజ్యాంగ విరుద్ధమని వెల్లడించాలని కోరుతూ రిటైర్డు న్యాయమూర్తులు జస్టిస్ ఎ.గోపాలరావు, జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి, ప్రముఖ జర్నలిస్ట్ ఏబీకే ప్రసాద్, సీనియర్ న్యాయవాది సి.సదాశివరెడ్డి ఏడేళ్ల క్రితం పిల్ దాఖలు చేశారు. (జస్టిస్ గోపాలరావు ఇటీవల మతి చెందిన కారణంగా, జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి రాష్ట్ర లోకాయుక్తగా నియమితులైన కారణంగా వారి పేర్లను పిటిషనర్లుగా తొలగించాలని అనుబంధ పిటిషన్లు దాఖలయ్యాయి) రాష్ట్ర పునర్విభజన చట్ట నిబంధనలకు, 2013లో వచ్చిన భూ సేకరణ చట్టానికి వ్యతిరేకంగా ఈ చట్టం ఉందని, శివరామకృష్ణన్ రిపోర్టుకు వ్యతిరేకంగా రాజధానిని నిర్ణయించారని పిల్‌లో పేర్కొన్నారు. అమరావతి రాజధానిపై హైకోర్టు తీర్పును సవాల్ చేసిన కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువడనుందని, కొంత కాలం ఈ పిల్‌పై విచారణను వాయిదా వేసి వేచిచూద్దామని హైకోర్టు పేర్కొంది. తమ పిల్‌పై ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ లాయర్ వివేకానంద కోరారు. ప్రభుత్వం కౌంటర్ వేయలేదని గవర్నమెంట్ స్పెషల్ ప్లీడర్ కె. జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టు ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు విచారణను డిసెంబర్ 12కి వాయిదా వేసింది.

ఉన్నత విద్యాకోర్సుల్లో అత్యధిక ప్రవేశాలు

విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్నత విద్యాకోర్సుల్లో రికార్డు స్థాయిలో విద్యార్థుల అడ్మిషన్లు జరిగాయని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ విద్యాసంవత్సరం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం 3,37,987 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తే వారిలో దాదాపు 3,15,600 మంది వివిధ కోర్సుల్లో ఉన్నత విద్యలో ప్రవేశాలు పొందారని తెలిపారు. డిగ్రీ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియపై ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె హేమచంద్రారెడ్డిలతో కలిసి విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష నిర్వహించారు. గతంలో కంటే డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పడిపోయాయంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారిలో కేవలం 22వేల పైచిలుకు విద్యార్థులు మాత్రమే ఉన్నత చదువుల్లో ప్రవేశం పొందలేదని వివరించారు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ కోర్సుల్లో 1.20లక్షల మంది, ఫార్మసీలో 12వేల మంది, వ్యవసాయం-ఆక్వా కల్చర్‌లో 5వేల మంది, మెడికల్, నర్సింగ్ కోర్సుల్లో 15వేల మంది అడ్మిషన్లు పొందారని అధికారులు మంత్రికి తెలిపారు. డిగ్రీ కోర్సుల్లో 1.48లక్షల మంది ఐఐఐటీ, ఎన్‌ఐటి వంటి కోర్సుల్లో 5,600 మంది, ఇతర రాష్ట్రాల్లో మరో 10వేల మంది ప్రవేశాలు పొందారని చెప్పారు.

పడకేసిన పేదల ఇళ్ల నిర్మాణం

అధికారంలోకి వస్తే సొంతింటి కల నెరవేరుస్తాం : టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పేదవాడి పక్కా ఇళ్ల నిర్మాణం పూర్తిగా పడకేసిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు విమర్శించారు. నవరత్నాలు పథకం కింద ఐదేళ్లల్లో 25లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు ఇస్తామని వైసిపి నాయకులు ఎన్నికలకు ముందు ఊదరగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడున్నరేళ్లల్లో 60వేల ఇళ్లను కూడా ప్రభుత్వం పూర్తిచేయలేదని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల్ని మభ్యపెడుతూ, మోసం చేస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోందే తప్ప ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. 2019-20 బడ్జెట్‌లో రూ.3,600కోట్లు కేటాయించి రూ.760కోట్లు, 2020-21లో రూ.3,690కోట్లు కేటాయించి రూ.1141కోట్లు మాత్రమే ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. ఇళ్ల నిర్మాణానికి జగన్ ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. జగనన్న కాలనీలు జనావాసాలకు అనుగుణంగా పూర్తిచేసుకోవడం అసాధ్యమని పేర్కొన్నారు. పక్కా గృహాలకిచ్చే రూ.1.80లక్షల్లో రూ.1.50లక్షల కేంద్రం నుంచి, రూ.30వేలు ఉపాధి హామీ పథకం డబ్బులు ఇస్తోందని వివరించారు. జగన్ పేదల ఇళ్లకు ఇస్తున్న సాయం గుండుసున్నా అని విమర్శించారు. భూముల సేకరణ పేరుతో తక్కువ ధర ప్రైవేట్ భూములను వైసిపి ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు అధిక ధరతో ప్రజాధనాన్ని స్వాహా చేశారని ఆరోపించారు. జగనన్న కాలనీలు భవిష్యత్తులో నిరర్థక ఆస్తులుగా మిగులుతాయే తప్ప ఎక్కడా అవి ఉపయోగపడవని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం వస్తేనే తప్ప పేదల ఇళ్ల నిర్మాణ పథకం ముందుకు వెళ్లే అవకాశం లేదని తెలిపారు. పేదల అభిరుచులకు అనుగుణంగా పక్కా ఇళ్ళను నిర్మించి పేదల సొంతింటి కలను తాము సాకారం చేస్తామని చెప్పారు.

కాషాయ రంగుతో పాఠశాల భవనాలు

కర్నాటకలో 'ప్రాజెక్ట్ వివేకా'ను తలపెట్టిన బిజెపి సర్కార్

విద్యారంగాన్ని కాషాయీకరణ చేయటమేనని విమర్శలు

న్యూఢిల్లీ : కర్నాటకలో బీజేపీ సర్కార్ మరో వివాదాస్పద అంశాన్ని తెరపైకి తీసుకొచ్చింది. విద్యను కాషాయీకరణ చేయడానికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. ప్రాజెక్ట్ వివేకా పేరుతో రాష్ట్రంలోని 8వేల పాఠశాలలను కాషాయరంగుతో నిర్మించనున్నామని కర్నాటక విద్యామంత్రి బి.సి.నగేశ్ తాజాగా ప్రకటించారు. దీనిపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ గురించి కల్బుర్గి జిల్లాలో మంత్రి ఆదివారం ప్రకటించారు. వివేకానంద శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. వివేకా కొత్త క్లాస్‌రూమ్‌లు కాషాయరంగులో ఉండబోతున్నాయని అన్నారు. ఈ అంశంపై పలువురు విద్యావేత్తలు పెదవి విరిచారు. విద్యారంగానికి మతం రంగు ఎందుకు పులమాలనుకుంటున్నారని విద్యావేత్త డాక్టర్ నిరంజనాచార్య వి.కె.ప్రశ్నించారు. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పేందుకు వీలుగా చైల్డ్ ఫ్రెండ్లీ క్లాస్‌రూమ్‌ల అవసరముందని, మంత్రి ఇష్టాఇష్టాలతో.. ఆయన ప్రాతినిథ్యం వహిస్తున్న రాజకీయ పార్టీ భావజాలానికి అనుగుణంగా నిర్ణయాలు ఉండరాదని అన్నారు. ఇది పూర్తిగా రాజకీయ, మతపరమైన ఉద్దేశాలతో విద్యారంగాన్ని కాషాయీకరణ చేసే వ్యవహారమేనని అన్నారు. రాజ్యాంగ మౌలిక విలువలకు పూర్తి విరుద్ధమని చెప్పారు.

ఈ వివాదంపై మంత్రి నగేశ్ స్పందిస్తూ, కాషాయరంగు పెయింటింగ్ నిర్ణయాన్ని సరైనదేనని సమర్థించుకున్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కాదని, ప్రాజెక్ట్‌తో ప్రమేయమున్న ఆర్కిటెక్ట్ నిర్ణయమేనని వివరణ ఇచ్చారు. ఆర్కిటెక్ట్ చెప్పినదానిని బట్టే తాము ముందుకు వెళ్లాల్సి ఉందని అన్నారు. వివేకా క్లాస్ రూమ్ పథకం కింద పాతబడిన, వినియోగంలో లేని పాఠశాలల స్థానంలో కొత్తవి వివేకా క్లాస్‌రూమ్స్ పేరుతో నిర్మిస్తారు. ఈ పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.992 కోట్లను కేటాయించనున్నది. రాష్ట్ర నిధులతో ప్రభుత్వం 7వేల పాఠశాలలను, మిగతా 1000 క్లాస్‌రూమ్‌లను కల్యాణ కర్నాటక రీజినల్ డెవలప్‌మెంట్ బోర్డ్ ఫండ్‌తో నిర్మిస్తారని సమాచారం.

నాన్ ఇంటర్‌లాకింగ్ పనులతో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చినగంజాం-కరవది మధ్య రైల్వే మూడవ లైన్‌ను ప్రారంభించేందుకు ఇంటర్ లాకింగ్ పనులు ప్రారంభించడంతో పలు రైళ్లను ఈనెల 13నుంచి 18వ తేదీ వరకు రద్దుచేసినట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలు రైళ్లు 15 నిమిషాల నుంచి 1.30గంటల ఆలస్యంగా నడుస్తాయని తెలిపింది. 07500 విజయవాడ-గూడూరు ట్రైన్ ఈ నెల 13 నుంచి 18 వరకూ రద్దయిందని పేర్కొంది. 07461 విజయవాడ-ఒంగోలు, 07576 ఒంగోలు-విజయవాడ, 07458 గూడూరు- విజయవాడ, 07978 విజయవాడ- బిట్రగుంట, 07977 బిట్రగుంట-విజయవాడ, 17260 విజయవాడ-గూడూరు, 17259 గూడూరు-విజయవాడ రైళ్లు ఈ నెల 14 నుంచి 18 వరకూ రద్దయ్యాయని రైల్వే తెలిపింది.



తమిళనాడులో 24 జిల్లాల్లో నీట మునిగిన వరి పంట

చెన్నై : భారీ వర్షాల కారణంగా 24 జిల్లాల్లో 45,800కు పైగా హెక్టార్లల్లో వరి పంట నీటమునిగిందని తమిళనాడు ప్రభుత్వం తెలిపింది. ఏడు జిల్లాల్లో 16,800 మందికిపైగా ప్రజలను 38 పునరావాస కేంద్రాలకు తరలించినట్లు వెల్లడించింది. నీలగిరి, దిండిగుల్, థేని జిల్లాలకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ నుంచి ఒక్కొక్క బృందాన్ని పంపామని, కుడ్డలోర్, చెన్నై, తిరువల్లూర్, కాంచీపురం, మయిలదుథురై జిల్లాలకు రాష్ట్ర డిజాస్టర్ ఫోర్స్ నుంచి ఒక్కొక్క బృందాన్ని పంపినట్లు తెలిపింది.

వైఎస్ వివేక హత్య కేసులో ఎర్రగంగి రెడ్డి బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్యకేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయడంపై సోమవారంలోపు ఆదేశాలు వెలువరిస్తామని జస్టిస్ ఎంఆర్ షా తెలిపారు. ఈ కేసులో ఎర్ర గంగిరెడ్డికి బెయిలు రద్దు చేయాలంటూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ హిమా కోహ్లిల ధర్మాసనం విచారించింది.

ఆర్కిటెక్ట్ సూచనమేరకు కాషాయరంగు

కర్ణాటక మంత్రి

బెంగళూరు : ఆర్కిటెక్ట్ సూచన మేరకు తరగతి గదులకు కాషాయం రంగు వేయనున్నామంటూ కర్ణాటక విద్యాశాఖ మంత్రి ప్రకటించారు. గడగ్ జిల్లాలో .నిర్వహించిన ఓ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బి.సి.నగేష్ ఈమేరకు ప్రకటించారు. వివేకా పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న నూతన భవనాల్లోని తరగతి గదులకు కాషాయం రంగు వేయనున్నామని పేర్కొన్నారు. తరగతి గదులన్నీ ఒకేవిధంగా ఉండేలా సుమారు 7,500కు పైగా గదులకు కాషాయం రంగు వేయనున్నామని అన్నారు. ఆర్కిటెక్ట్ సూచన ప్రకారమే కాషాయం రంగు వేస్తున్నామని... ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అనుసరించి కాదంటూ ఆయన ప్రకటించడం గమనార్హం.

ఈ ప్రకటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు లేకపోవడం, టీచర్ల కొరత, అధిక డ్రాపవుట్స్ వంటి సమస్యలు అనేకం ఉండగా, రాష్ట్ర బిజెపి ప్రభుత్వం గోడల రంగుపై దృష్టి సారించిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రియాంక ఖార్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వతంత్ర భారత దేశంలో మాది జాతీయ పార్టీ అని గొప్పలు చెప్పుకున్నప్పుడు.. మూడు రంగులను వేయవచ్చు కదా.. కేవలం కాషాయ రంగు మాత్రమే ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పుడు దేశాన్ని ఆర్కిటెక్ట్‌లు, మేస్త్రీలు నడుపుతున్నారా అని ఎద్దేవా చేశారు.



కార్తీక మాస సందర్భంగా హైకోర్టు వద్ద చీఫ్ జస్టిస్ పీకే మిశ్రా, ఇతర న్యాయమూర్తులు సోమవారం మొక్కలు నాటారు. ఆచార్య రామానుజం సంక్షేమ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఉసిరి మొక్కను సీజే నాటి పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదుల సంఘం నేతలు పాల్గొన్నారు.

పునాదుల్లోనే పునరావాసం

- ఇంటికి రూ.ఐదు లక్షల జిఒ పెండింగ్
- 436 ఇళ్లకు పార్ట్ బిల్లుల చెల్లింపులకు నో
- 855 ఎకరాల్లో తొలగని ఇసుక దిబ్బలు
- అమలుకు నోచనిసిఎం హామీ


గుడారాల్లోనే జీవనం సాగిస్తున్న పులపుత్తూరు నిర్వాసితులు


పులపుత్తూరులో బేస్‌మెంట్‌లకే పరిమితమైన లేఅవుట్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

'అన్నమయ్య' నిర్వాసితుల పునరావాసం పునాదులకే పరిమితమైంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇస్తామని సిఎం జగన్ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. కొంతమంది నిర్వాసితులు అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించినా పార్ట్ బిల్లులు విడుదల కాలేదు. ఇసుక దిబ్బలు తొలగించకపోవడంతో పంట సాగు లేక నిర్వాసితులు పట్టణాలకు వలసపోతున్నారు.

2021 నవంబర్ 19 తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా రాజంపేట మండలంలోని అన్నమయ్య రిజర్వాయర్ తెగిపోవడంతో పులపత్తూరు, మందపల్లి, రామచంద్రాపురం, గుండ్లూరు, తోగూరుపేట, శేష మాంబపురం గ్రామాలను వరద ముంచెత్తిన విషయం విదితమే. 39 మంది చనిపోయారు. వందలాది ఇళ్లు కూలిపోయాయి. వేలాది పశుసంపద గల్లంతైంది. సర్వం కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ మేరకు 436 మందికి ఐదు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇంటి నిర్మాణానికి ఐదులక్షల చొప్పున కేటాయిస్తామని జారీ చేసిన జిఒ ఫైనాన్స్‌లో పెండింగ్ ఉంది. ఈ ఏడాది నవంబర్ 19 నాటికి ఏడాది పూర్తవుతున్నా ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగలేదు. 436 ఇళ్ల స్థలాల్లో 180 మంది రూ.150 లక్షల వరకు అప్పులు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించుకున్నారు. పార్ట్ బిల్లు సైతం విడుదల చేయకపోవడంతో వడ్డీల చెల్లింపులకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

నిర్వాసిత గ్రామాల్లోని సుమారు 1000 ఎకరాల్లో ఇసుక మేటలు వేసింది. పలుమార్లు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ మందపల్లి మినహా పుల పుత్తూరు తదితర గ్రామాల్లో జెసిబిలతో ఇసుకను కుప్పలుగా పోశారు. ఇసుక తరలింపును మరిచారు.

దీంతో సాగుకు అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా కుటుంబ జీవనం దుర్భరంగా మారింది. 'అన్నమయ్య'ను సకాలంలో పునర్ నిర్మిస్తామని, పరివాహక ప్రాంతాల్లో ప్రొటెక్షన్‌వాల్ నిర్మిస్తామని సిఎం హామీ ఇచ్చారు. ఇందు కోసం ప్రతిపాదించిన రూ.787.77 కోట్లు కాగితాలకే పరిమితమయ్యాయి. చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసి బహుదా నదికి వరదలు పోటెత్తితే తమ సంగతేంటని నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇసుక మేటలు తొలగించండి

పొలాల్లో ఇసుక మేటల కారణంగా పంటల సాగుకు అవకాశం లేదు. జీవనం కోసం చిల్లర దుకాణం పెట్టుకున్నాను తద్వారా వచ్చే అరకొర డబ్బుతో సంసారాన్ని నెట్టుకొస్తున్నాను.

- కె.ఉమామహేశ్వరరాజు, ఉపసర్పంచ్ పులపుత్తూరు.

బేస్‌మెంట్‌లకు బిల్లులు ఇవ్వాలి

బేస్‌మెంట్‌కు పార్ట్‌బిల్లులు ఇవ్వడం లేదు. బిల్లులు అడిగితే 446 మంది బేస్‌మెంట్లు నిర్మించుకుంటేనే ఇస్తామని అధికారులు చెబుతున్నారు. అప్పు చేసి బేస్‌మెంట్లు వేశాం. అందరూ బేస్‌మెంట్ కట్టేవరకూ వడ్డీలు చెల్లించాలి.

- కుంభగిరి గంగయ్య, పులపుత్తూరు.

రూ.787.77 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం

అన్నమయ్య పునరుద్ధరణకు రూ.787.77 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశాం. ఈ నెల రెండున పరిపాలనాపరమైన అనుమతి లభించింది. డిజైనింగ్, టెక్నికల్ అనుమతి లభించిన వెంటనే టెండర్లు పిలుస్తాం.

- కె.శ్రీనివాసులు, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్, అన్నమయ్య జిల్లా

దొందూ దొందే -కరణం వెంకటేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో :

కుప్పంలో చంద్రబాబునాయుడు, మంగళగిరిలో లోకేష్ గెలిచే పరిస్థితి లేదని, ఇద్దరి రాజకీయ భవిష్యత్ దొందూ దొందేనని చీరాల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జీ కరణం వెంకటేష్ విమర్శించారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. 14 ఏళ్లు అధికారంలో వున్నా ఏవిధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళ్లాలో కనీస అవగాహన లేనివిధంగా బాబు మాట్లాడుతున్నారన్నారు.

వాట్సాప్‌తో ఉచిత క్రెడిట్ స్కోర్స్ : ఎక్స్‌పీరియన్ వెల్లడి

హైదరాబాద్ : భారతీయ వినియోగదారులు తమ క్రెడిట్ స్కోర్‌ను ఉచితంగా వాట్సాప్‌తోనూ పొందవచ్చని క్రెడిట్ బ్యూరో అయిన ఎక్స్‌పీరియన్ ఇండియా తెలిపింది. ఖాతాదారులు క్రెడిట్ రిపోర్ట్‌ను ఎక్కడైనా, ఎప్పుడైనా సురక్షితంగా పొందేలా చర్యలు తీసుకున్నట్లు ఎక్స్‌పీరియన్ ఇండియా కంట్రీ మేనేజర్ నీరజ్ ధావన్ తెలిపారు. వాట్సాప్ ద్వారా 91-9920035444కు 'హాయ్' అని పంపించడం ద్వారా క్రెడిట్ స్కోర్‌ను పొందవచ్చన్నారు.

80 శాతం దరఖాస్తులు పెండింగ్

- 22 (ఎ) భూముల క్లియరెన్స్ కోసం రైతుల ఎదురు చూపులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నిషేధిత భూముల జాబితా నుంచి తమ భూములకు విముక్తి కల్పించాలని అన్నదాతలు దశాబ్దాలకు పైగా పోరాడుతున్నప్పటికీ ఆచరణలో ఆయా భూములకు ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ లభించడం లేదు. తమ భూములు పట్టాభూములైనప్పటికీ ప్రభుత్వ రికార్డుల్లో అసైన్డ్ భూములుగా, ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచని ప్రొహిబిటెడ్ భూములు 22 (ఎ) కింద నమోదైన భూములకు క్లియరెన్స్ సత్వరమే ఇచ్చేందుకు ప్రభుత్వం అక్టోబరు 20న ప్రత్యేక కమిటీలు వేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రెవెన్యూ రికార్డులను పరిశీలించి రెవెన్యూ అధికారులు సమస్యలు పరిష్కరించాల్సి ఉండగా, భూములు తమవే అని నిరూపించుకునేందుకు, ఆయా భూములకు సంబంధించిన లింక్ డాక్యుమెంట్లు ఇచ్చే బాధ్యతలను రైతులపైనే ప్రభుత్వం నెట్టేసింది. రెవెన్యూ రికార్డులు, లింక్ డాక్యుమెంట్లు, కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన డాక్యుమెంట్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉండే ల్యాండ్ హోల్డింగ్ సర్టిఫికెట్ సేకరించాల్సి రావడం తప్పనిసరిగా మారింది. ఆయా రికార్డుల్లో దరఖాస్తుదారుడే భూ యజమానిగా నమోదై ఉండాలి. 1954కు ముందు అసైన్డ్‌భూమిని పొందినట్లు పట్టా కూడా నిషేధిత జాబితా నుంచి తొలగించే సమయంలో అధికారులు పరిశీలిస్తున్నారు. రైతుల వద్ద భూములకు సంబంధించి మార్గదర్శకాల్లో పేర్కొన్న రికార్డుల్లో ఏ ఒక్కటీ లేకున్నా సాంకేతిక కారణాలను సాకుగా చూపుతూ ఆయా దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడిపోతున్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే గత ఐదేళ్లలో పట్టాభూములు అసైన్డ్ భూముల కింద నిషేధిత జాబితాలో 26,202 దరఖాస్తులు ప్రభుత్వానికి అందగా, ఇందులో 80శాతం పెండింగ్‌లో ఉన్నాయి. పట్టా భూములు ప్రభుత్వ భూముల కింద నమోదయ్యాయంటూ రాష్ట్రవ్యాపంగా 4,339 దరకాస్తులు రాగా, ఇందులో పరిష్కరించినవి 242 మాత్రమే. పెండింగ్ దరఖాస్తుల పర్సెంటేజి 81.70శాతంగా నమోదైంది.

8.39 శాతానికి టోకు ద్రవ్యోల్బణం

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది అక్టోబర్‌లో టోకు ద్రవ్యోల్బణం సూచీ (డబ్ల్యుపిఐ) 8.39 శాతానికి తగ్గి.. 19 నెలల కనిష్ట స్థాయికి దిగివచ్చిందని ప్రభుత్వ గణంకాలు తెలిపాయి. ప్రధానంగా ఇంధనం, తయారీ వస్తువుల ధరలు తగ్గడమే ఇందుకు కారణమని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. 2021 మార్చిలో కనిష్టంగా 7.89 శాతంగా నమోదు కాగా.. ఆ తర్వాత నుంచి పెరుగుతూనే వచ్చింది. గడిచిన సెప్టెంబర్‌లో ఈ సూచీ 10.79 శాతంగా, గతేడాది అక్టోబర్‌లో ఏకంగా 13.83 శాతంగా నమోదయ్యింది. గడిచిన నెలలో ముఖ్యంగా ఖనిజ చమురు, ప్రాథమిక లోహాలు, లోహ ఉత్పత్తులు, వస్త్రాలు, ఖనిజాల ధరలు తగ్గడంతో డబ్ల్యుపిఐ తగ్గిందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ తెలిపింది.

తగ్గిన రిటైల్ ద్రవ్యోల్బణం

గడిచిన అక్టోబర్‌లో వినియోగదారుల ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 6.77 శాతానికి తగ్గి మూడు మాసాల కనిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. అహారోత్పత్తుల ధరలు తగ్గడమే ఇందుకు కారణమని కేంద్ర గణంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) తెలిపింది. అయినప్పటికీ ఆర్‌బిఐ లక్ష్యానికంటే ఎక్కువగానే ద్రవ్యోల్బణం నమోదయ్యింది. సిపిఐని 2-6 శాతం మధ్యన కట్టడి చేయాలని ఆర్‌బిఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఇంతక్రితం సెప్టెంబర్ మాసంలో సిపిఐ 7.41 శాతంగా నమోదయ్యింది.

పళ్లు, కూరగాయల విభాగం విస్తరణ

స్విగ్గీ ఇన్‌స్టామర్ట్ వెల్లడి

హైదరాబాద్ : స్విగ్గీ క్విక్ కామర్స్ గ్రాసరీ విభాగం స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ తన పళ్లు కూరగాయల డెలివరీని మరింత విస్తరించినట్లు ప్రకటించింది. విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లోని తమ వినియోగదారులు ఇక స్థానిక పళ్లు, కూరగాయల విక్రేతలను సులభంగా చేరవచ్చని తెలిపింది. 2020లో హైదరాబాద్, 2021లో వైజాగ్, విజయవాడలో తొలిసారి కిరాణా వస్తువుల డెలివరీని ప్రారంభించింది. తాజాగా దీన్ని పళ్లు, కూరగాయల విభాగంలోకి విస్తరించినట్లయ్యింది.

శంకుస్థాపనకే పరిమితం

- మూడున్నరేళ్లుగా ముందుకుసాగని నెల్లూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు
- విశాఖ రైల్వే స్టేషన్ ఆధునికీరణ పనులకు ప్రధాని శంకుస్థాపనతో మళ్లీ ఇప్పుడు చర్చనీయాంశం


నెల్లూరు రైల్వే స్టేషన్ ఊహా చిత్రం

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

బిజెపి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేస్తోంది. హామీలు ఇవ్వడమే తప్ప, అమలు చేయడం లేదు. రాష్ట్రంలోని నెల్లూరు రైల్వే స్టేషన్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునికీకరించనున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. దేశంలోనే తొలి మోడ్రన్ రైల్వే స్టేషన్‌గా రూ.147 కోట్లతో నిర్మించడానికి 2019 ఫిబ్రవరి 21న అప్పటి ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ శంకుస్థాపన చేశారు. 21 నెలల్లోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు తట్టమట్టి కూడా తీయలేదు. కేవలం శిలాఫలకం మాత్రమే మిగిలింది. తాజాగా విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ప్రధాని నరేంద్ర మోడీ శనివారం శంకుస్థాపన చేసిన నేపథ్యంలో నెల్లూరు రైల్వే స్టేషన్ ఆధునికీకరణ విషయం కూడా మళ్లీ ఇప్పుడు చర్చనీయాంశంగా మరింది. నెల్లూరు పనులను ఎన్‌బిసిసికి అప్పట్లో అప్పగించారు. 69 వేల స్క్వేయర్ ఫీట్‌లో స్టేషన్, రెండు లక్షల స్క్వేయర్ ఫీట్‌లో కమర్షియల్ ఏరియాను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. రైల్వేస్టేషన్‌కు త్రీ ప్లస్ (జి ప్లస్2) కింద, కమర్షియల్ బిల్డింగ్‌ను ఎనిమిది లెవల్స్ (జిప్లస్7)తో అభివృద్ధి చేయాల్సి ఉంది. రెండంతస్తులు బేస్‌మెంట్ నిర్మించాలి. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, రోడ్లు, పార్కింగ్, సోలార్ పవర్ ఎనర్జీ, కేఫ్స్, ఇన్ఫర్మేషన్ సెంటర్, సబ్‌వే, రోప్‌వే, లిఫ్ట్, ఎక్స్‌లేటర్, కమర్షియల్ షాపులు, ఫుడ్ కోర్టులు, మాల్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన ఊహా చిత్రాలను రైల్వే శాఖ గతంలోనే విడుదల చేసింది. అయితే, రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ఇప్పటి వరకూ ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ప్రతి రోజు నెల్లూరు స్టేషన్ మీదుగా 140 రైళ్లు వెళ్తున్నాయి. ఇందులో ఆరు ప్యాసింజర్ రైళ్లు ఉన్నాయి. ప్రతి రోజూ 25 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. మూడేళ్లు గడిచినా నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ ప్రచారానికే పరిమితమైంది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఆధునీకరణకు రూ.460 కోట్లతో శంకుస్థాపన చేశారు. నెల్లూరులో మాదిరిగానే ప్రకటనకే పరిమితం అవుతుందా? ఆచరణ రూపం దాల్చుతుందా? అనేది వేచి చూడాలి.

విమానాశ్రయంపైనా దోబూచులాట...

నెల్లూరు జిల్లా అంత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కృష్ణపట్నం పోర్టు నిర్మాణంతోపాటు థర్మల్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విమానాశ్రయ ఏర్పాటు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోబూచులాడుతున్నాయి. తొలుత దామవరం వద్ద విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని చెప్పి, ఇప్పుడు రామాయపట్నం పోర్టు సమీపానికి దీన్ని మార్పు చేశారు.

భారత పట్టణాలకు భారీ పెట్టుబడులు

- ఏడాదికి రూ.4.6 లక్షల కోట్లు అవసరం
- ప్రపంచ బ్యాంక్ అంచనా

న్యూఢిల్లీ : భారత్‌లోని పట్టణాల అభివృద్ధికి వచ్చే 15 ఏళ్లలో 840 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.70 లక్షల కోట్లు) పెట్టుబడులు అవసరం అవుతాయని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు మౌలిక వసతులు కల్పించడానికి ఏడాదికి సగటున 55 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.4.6 లక్షల కోట్లు) వ్యయం చేయాలని తెలిపింది. ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం (పిపిపి)లో మౌలిక వసతుల కల్పనకు సరైన సమయని పేర్కొంది. కాగా.. రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థల బాడీలు సహా కేంద్ర ప్రభుత్వంలోని స్మార్ట్ సిటీలు, ప్రధాన మంత్రి ఆవాస యోజన (పిఎంఎవై) లాంటి అర్బన్ మిషన్ విభాగాలు ప్రగతిలో నెమ్మదత్వాన్ని ప్రదర్శిస్తున్నాయని ప్రపంచ బ్యాంక్ తన ఒక రిపోర్టులో పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో ఉండాల్సిన పటు టారీఫ్ ఛార్జీల కంటే తక్కువగా ఉన్నాయని.. దీంతో రెవెన్యూ తగ్గుతుందని తెలిపింది. 2036 నాటికి భారత్‌లోని పట్టణాల్లో 60 కోట్ల మంది ప్రజలు నివసించవచ్చని అంచనా వేసింది. ఇప్పుడున్న జనాభాకు మరో 40 శాతం మంది చేరడంతో అదనపు ఒత్తిడి నెలకొననుందని విశ్లేషించింది.

ఎల్ఐసి షేర్ 9% పరుగు

నష్టపోయిన సెన్సెక్స్



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) షేర్లు కొనుగోళ్ల మద్దతుతో సోమవారం పరుగులు పెట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022-23) సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 11 రెట్ల వృద్ధితో రూ.15,952 కోట్ల నికర లాభాలు సాధించడంతో ఎల్ఐసి షేర్లకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఇంట్రాడేలో ఏకంగా 9 శాతం పెరిగి రూ.684.9కు చేరింది. బిఎస్ఇలో తుదకు 5.85 శాతం లాభపడి రూ.664.80 వద్ద ముగిసింది. ఉదయం రూ.666 వద్ద ప్రారంభమైన సూచీ ఓ దశలో రూ.654.60 కనిష్టానికి తగ్గి.. మరో దశలో రూ.682.70 గరిష్ట స్థాయి వద్ద నమోదయ్యింది. మరోవైపు బిఎస్ఇ సెన్సెక్స్ అమ్మకాల ఒత్తిడితో 171 పాయింట్లు పడిపోయి 61,624కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 29 పాయింట్లు తగ్గి 18,329 వద్ద ముగిసింది. సెన్సెక్స్-30లో డాక్టర్ రెడ్డీస్ అత్యధికంగా 4 శాతం పతనం కాగా.. ఐటిసి, హెచ్‌యుఎల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐ బ్యాంక్, నెస్లే ఇండియా స్టాక్స్ అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.



మోహన్‌కు సాహిత్య అకాడమీ బాల పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కవి పత్తిపాక మోహన్‌కు సాహిత్య అకాడమీ బాల పురస్కారం సోమవారం ప్రదానం చేశారు. ప్రసిద్ధ త్రివేణి కళా సంఘం ఆడిటోరియంలో సాహిత్య అకాడమీ నిర్వహించిన బాల సాహిత్యోత్సవంలో సాహిత్య అకాడమీ అధ్యక్షులు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత చంద్రశేఖర్ కంబార్ బాల పురస్కారాన్ని మోహన్‌కు అందజేశారు. పురస్కారం కింద అకాడమీ తామ్ర ఫలకం, జ్ఞాపిక, రూ.50 వేల నగదుతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ హిందీ బాల సాహితీవేత్త ప్రకాష్ మను హాజరై విశేష హాజరయ్యారు. ప్రముఖ బాల సాహితీవేత్త, కవి, అనువాదకులు, విమర్శకులు పత్తిపాక మోహన్, తెలుగులో 2022 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారానికి ఎంపికైన విషయం తెలిసిందే. మోహన్ రచించిన బాలల తాత బాపూజీ గేయ సంపుటికి ఈ పురస్కారం లభించింది.

జిఎస్‌టి పరిధిలోకి పెట్రో ఉత్పత్తులు

- కేంద్రం సిద్ధంగా వుందన్న మంత్రి

శ్రీనగర్ : పెట్రోల్, డీజిల్‌లను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావడానికి కేంద్రం సిద్ధంగా వుందని పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూర్తి సోమవారం చెప్పారు. ఇటువంటి చర్యకు రాష్ట్రాలు అంగీకరించే అవకాశం లేదన్నారు. "జిఎస్‌టి పరిధిలోకి పెట్రోల్, డీజిల్‌లను తీసుకురావాలంటే, రాష్ట్రాలు అంగీకరించాల్సి వుంది. ఒకవేళ రాష్ట్రాలు అంగీకరిస్తే మేం సిద్ధంగా వున్నాం. దీన్నెలా అమలు చేస్తారా అన్నది తర్వాత విషయం, అయినా దాన్ని చూసుకోవాల్సింది ఆర్థిక మంత్రి." అని పూరి ఇక్కడ విలేకర్లతో వ్యాఖ్యానించారు.

కెయుఎఫ్ఒఎస్ విసి నియామకం రద్దు

తిరువనంతపురం : యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) నిబంధనలు అమలు చేయలేదని పేర్కొంటూ కొచ్చిలోని కేరళ ఫిషరీస్ యూనివర్సిటీ (కెయుఎఫ్ఒఎస్) వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.రిజిజాన్ నియామకాన్ని కేరళ హైకోర్టు రద్దు చేసింది. డాక్టర్ రిజి జాన్‌కు విసిగా అర్హత లేదన్న పిటిషనర్ల పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. నియమితులైన వ్యక్తికి అర్హత ఉన్నప్పటికీ యుజిసి నామినీ లేకుండానే సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేశారనీ, ఒకరి కంటే ఎక్కువ మంది పేర్లు లేకుండానే ప్యానెల్‌ను తయారు చేశారని పేర్కొంటూ న్యాయస్థానం ఈ నియామకం చెల్లదని పేర్కొంది. విసి నియామకంలో కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన చట్టం ప్రకారమే ప్రభుత్వం వ్యవహరించింది. చట్టంపై యుజిసి నిబంధనలు అధికం అవుతాయని హైకోర్టు స్పష్టం చేసింది.

వద్గం నుంచి జిగ్నేష్ మేవాని

గాంధీనగర్ : గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే 39 మంది అభ్యర్థుల పేర్లను కాంగ్రెస్ ఆదివారం విడుదల చేసింది. ఆదివారం ఉదయం ముందుగా ఆరుగురు అభ్యర్థులతో ఐదో జాబితాను విడుదల చేసిన కాంగ్రెస్, తరువాత సాయంత్రం 33 మందితో ఆరో జాబితాను విడుదల చేసింది. దీంతో ఇప్పటి వరకూ మొత్తంగా 142 మంది అభ్యర్థులను పార్టీ ప్రకటించింది. ఆదివారం విడుదల చేసిన జాబితా ప్రకారం వద్గం నియోజకవర్గం నుంచి జిగ్నేష్ మేవానిని బరిలోకి దింపింది. జయంతి జెరజ్‌భాయ్ పటేల్ మోర్బీ నియోజక వర్గం నుంచి, జామ్‌నగర్ రూరల్ నుంచి జీవన్ కుంభర్ వదియా పోటీ చేయనున్నారు. ఈ నెల 4న 43 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ తొలి జాబితా విడుదల చేసింది.

ఖంభలియా నుంచి ఆప్ సిఎం అభ్యర్థి పోటీ

గుజరాత్ ఎన్నికల్లో ఆప్ ముఖ్యమంత్రి అభ్యర్థి ఇసుదన్ గాధ్వి ఖంభలియా నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఈ విషయాన్ని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. దీంతో ఆప్ ఇప్పటి వరకూ 175 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. 182 మంది ఎమ్మెల్యేలు ఉన్న గుజరాత్ అసెంబ్లీకి డిసెంబరు 1, 5 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 8న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఎమ్మెల్యేల కొనుగోలు నిందితుల పిటిషన్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితులు రామచంద్రభారతి తదితరులు దాఖలు చేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ అంశంపై తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ కోర్టు విచారణ జరుపుతోందని, సాయంత్రం ఆదేశాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. విచారణ వాయిదా వేయాలని కోరారు. అంగీకరించిన ధర్మాసనం సోమవారానికి విచారణ వాయిదా వేసింది.

కనీస వేతనం రూ.26 వేలుగా ప్రకటించాలి

- రామ్‌లీలా మైదానంలో కదం తొక్కిన కార్మికులు
- రాష్ట్రపతికి మెమోరాండం అందజేత



న్యూఢిల్లీ : మజ్దూర్ అధికార్ సంఘర్ష్ అభియాన్ (ఎంఎఎస్ఎ) నేతృత్వంలో ఆదివారం రామ్‌లీలా మైదానంలో కార్మికులు భారీ బహిరంగ సభ నిర్వహించారు. దేశంలో ఉన్న దాదాపు 16 రంగాల సంఘాలు, సమాఖ్యల కలయికతో ఎంఎఎస్ఎ ఏర్పడింది. బీహార్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, తమిళనాడు, కర్ణాటక, హర్యానాతో సహా వివిధ రాష్ట్రాల నుంచి ఈ సభకు కార్మికులు హాజరయ్యారు. కనీస వేతనాన్ని నెలకు రూ.26 వేలుగా ప్రకటించాలని, నిరుద్యోగులందరికీ నెలకు రూ.15 వేలు జీవనాధార భత్యం ఇవ్వాలని, కార్మిక వ్యతిరేక కోడ్‌లు నాలుగింటిని రద్దు చేయాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికులందరికీ వైద్య, విద్య హక్కులు కల్పించాలని కోరారు. కేంద్రం, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు 'షరతులు లేని మద్దతు'ని అందిస్తున్నాయని ఎంఎఎస్ఎ నాయకులు విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎంఎఎస్ఎ నాయకులు మెమోరాండం సమర్పించారు. 'పెచ్చరిల్లుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆకలి' వంటి సమస్యలు వేలాదిమంది కార్మికులను ఆత్మహత్యకు పురిగొల్పుతున్నాయని ఆ మెమోరాండంలో పేర్కొన్నారు. కార్మికుల చట్టబద్ధమైన యూనియన్ హక్కు నేరంగా పరిగణించబడుతోందని, అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు వంటి స్కీమ్ వర్కర్లు విచక్షణారహితంగా దోపిడీకి గురవుతున్నారని, సమానపనికి సమానవేతనం వంటి ప్రాథమిక హక్కులు కాలరాయబడ్డాయని వివరించారు.

అన్ని రాష్ట్రాల్లో వలసదారులను గుర్తించండి..

- వారిని దేశం నుంచి వెళ్లగొట్టండి..
- ఐబి, నిఘా వర్గాలకు అమిత్ షా ఆదేశాలు

న్యూఢిల్లీ : వలసదారుల పేరిట మైనార్టీలపై అణచివేతలకు మోడీ సర్కార్ సిద్ధమైంది. ప్రతి రాష్ట్రంలో అక్రమ వలసదారులను గుర్తించి, నిర్బంధించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారు. వారిని దేశం నుండి వెళ్లగొట్టాలని ఉన్నతస్థాయి ఇంటెలిజెన్స్ అధికారులను ఆదేశించారు. పొరుగు దేశాలు వారిని అనుమతించక పోయినా..వలసదారులను తరిమికొట్టాలని నిఘా వర్గాలను ఆదేశించినట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. అన్ని రాష్ట్రాల సబ్‌సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరోస్ (ఎస్ఐబి)లతో ఈనెల 9న నిర్వహించిన సమావేశంలో.. అధికారులకు విధిగా లక్ష్యాలను నిర్దేశించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రతిరాష్ట్రంలో దాదాపు 100మందికిపైగా చొరబాటుదారులను గుర్తించాలని, వారి గుర్తింపు పత్రాలను తనిఖీ చేయాలని, అవసరమైతే అరెస్టులు చేయాలని ఆదేశించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. పంజాబ్‌లో సిక్కులు క్రైస్తవ మతంలోకి మారిన ఘటనలను ప్రస్తావిస్తూ.. క్రైస్తవ మత మార్పిడి ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించినట్టు సమాచారం. ఉత్తరప్రదేశ్, బీహార్ సరిహద్దు జిల్లాల్లో ముస్లిం జనాభా పెరుగుదలపై ఇంటెలిజెన్స్ బ్యూరో ఇచ్చిన సమాధానంపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారని మీడియాలో వార్తలు వెలువడ్డాయి. దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలను లక్ష్యంగా చేసుకొని ఎన్ఆర్‌సిని చేపట్టాలనే ఆలోచనలో మోడీ సర్కార్ ఉంది.

ఆరాధనా స్థలాల చట్టం చెల్లుబాటుపై వైఖరి తెలిపేందుకు మరింత గడువివ్వండి

- సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : ఆరాధనా స్థలాల చట్టం చెల్లుబాటుపై తన వైఖరిని వివరించేందుకు మరికొంత సమయం కావాలని కేంద్రం సోమవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. నిర్దిష్ట స్థాయిలో సవివరమైన చర్చలు జరపడం అవసరమని పేర్కొంది. 1991లో తీసుకువచ్చిన ఈ చట్టం 1947 ఆగస్టు 15నాటికి వున్న రీతిలోనే మతపరమైన ఆరాధనా స్థలాల స్వభావాన్ని, గుర్తింపును పరిరక్షించాలని కోరుతోంది. దీనిపై కేంద్రం తన వైఖరిని అఫిడవిట్ రూపంలో డిసెంబరు 12కల్లా అందజేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ ఆదేశించింది. జనవరి మొదటి వారంలో దీనిపై విచారణ జరిపేందుకు కోర్టు అంగీకరించింది. గతంలో కూడా ఈ కేసులో ప్రభుత్వం ఇలాగే రెండుసార్లు వాయిదా కోరిందని పిటిషనర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ తరపున వాదిస్తున్న సీనియర్ న్యాయవాది రాకేష్ ద్వివేది తెలిపారు. రామ జన్మభూమి కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ఆరాధనా స్థలాల చట్టం చెల్లుబాటు సమస్యను పరిష్కరించిందా? లేదా? అని అక్టోబరు 10న కోర్టు ప్రభుత్వాన్ని కోరింది. భిన్నమైన సందర్భంలో అయోధ్య తీర్పు ఇవ్వబడినందున, బహుశా ఈ అంశం ఇందులో ఇమిడి వుండకపోవచ్చని కేంద్రం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు.

బలవంతపు మత మార్పిడి చాలా తీవ్ర విషయం

బలవంతపు మత మార్పిడిని చాలా తీవ్రమైన అంశంగా సుప్రీంకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. ఈ పద్ధతిని కట్టడిచేసేందుకు నిజాయితీగా కృషి చేయాలని కేంద్రాన్ని కోరింది. తక్షణమే దీన్ని అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా జస్టిస్ ఎం.ఆర్.షా, హిమా కొహ్లిలతో కూడిన ధర్మాసనం కోరింది. మీరేం చర్యలు తీసుకుంటున్నారో కూడా మాకు చెప్పండని కోరింది

26న రాజ్‌భవన్‌లకు పాదయాత్ర

- 1 నుంచి 11 వరకు ఎంపిలకు వినతులు
- ఎస్‌కెఎం జాతీయ సమావేశంలో నిర్ణయం



ఎస్‌కెఎం జాతీయ సదస్సులో రైతు నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కనీస మద్దతు ధరతోపాటు రైతు సమస్యలపై నవంబర్ 26న అన్ని రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌లకు పాదయాత్రలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నిర్ణయించింది. ఎస్‌కెఎం జాతీయ స్థాయి సమావేశం సోమవారం నాడిక్కడ గురుద్వారా శ్రీ రాకబ్ గంజ్ సాహిబ్‌లో జరిగింది. బూటా సింగ్ బుర్జ్‌గిల్, రమీందర్ సింగ్ పాటియాలా, జగ్తార్ సింగ్ బజ్వాతో కూడిన ప్యానెల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా, బికెయు నేత రాకేష్ తికాయత్, దర్శన్ పాల్, గుర్నామ్ సింగ్, ఆశిష్ మిట్టల్, సునీలం, సాహు, కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చారిత్రాత్మక రైతు ఉద్యమం విజయవంతమై ఏడాది కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఎస్‌కెఎంకు ఇచ్చిన హామీల్లో చాలావరకు నేటికీ నెరవేర్చలేదని విమర్శించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు ఎస్‌కెఎం పిలుపునిచ్చింది. గతేడాది నవంబర్ 19న రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారని, అదే రోజు ఈ ఏడాది నవంబర్ 19న ఫతే దివస్‌గా నిర్వహించాలని ఎస్‌కెఎం నిర్ణయించింది. ఎస్‌కెఎం పిలుపుతో 2020 నవంబర్ 26న లక్షలాదిమంది రైతులు ఢిల్లీకి వచ్చారని, ఈ ఏడాది అదే రోజున అన్ని రాష్ట్రాల్లో రాజ్‌భవన్‌లకు పాదయాత్రలు చేపట్టి, గవర్నర్లకు ఎస్‌కెఎం డిమాండ్లతోపాటు ఆయా రాష్ట్రాల్లో ప్రత్యేకమైన డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. 2021 డిసెంబర్ 11న విజయం సాధించిన తరువాత రైతులు విజయయాత్రలతో తమ గ్రామాలకు తిరిగి వెళ్లారని, ఈ ఏడాది అదే రోజున విజయోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1 నుండి 11 వరకు లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు వినతి పత్రాలు అందజేయాలని ఎస్‌కెఎం సమావేశం నిర్ణయించింది. ఎస్‌కెఎం తదుపరి సమావేశం డిసెంబర్ 8న జరగనుందని, ఆ సమావేశంలో ఉద్యమ భవిష్యత్తు కార్యాచరణను నిర్ణయిస్తామని పేర్కొంది. ఆ సమావేశంలో "పూర్తి స్థాయి రుణమాఫీ, ఎంఎస్‌పి హామీ" కోసం పోరాటాన్ని ప్రకటిస్తామని తెలిపింది.

ఎంపిలు, ఎమ్మెల్యేలపై 4,984 కేసులు పెండింగ్

- తాజా, మాజీ ఎంపిలపై 1,675 కేసులు
- తాజా, మాజీ ఎమ్మెల్యేలపై 2,324 కేసులు
- తెలంగాణసహా తొమ్మిది హైకోర్టు రిపోర్టు సమర్పించలేదు
- ఏపిలో 92 కేసులు
- సిజెఐ జస్టిస్ చంద్రచూడ్‌కు అమికస్ క్యూరీ రిపోర్టు అందజేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2021 డిసెంబర్ నాటికి 4,984 కేసులు తాజా, మాజీ ఎంపి, ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్నాయని అమికస్‌క్యూరీ రిపోర్టు స్పష్టం చేసింది. అందులో 2018 నాటికి 4,122 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. రాష్ట్రాల్లో ప్రజా ప్రతినిధులపై పెండింగ్‌లో కేసుల వివరాలకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో అమికస్ క్యూరీగా సీనియర్ న్యాయ వాది విజయ్ హన్సారియాను నియమించింది. సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్‌కు అమికస్‌క్యూరీ విజయ్ అన్సారీ 17వ రిపోర్టును అందజేశారు.

న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ ధర్మాసనం విచారించనుంది. ఈ సందర్భంగా దేశంలోని ఎంపి, ఎమ్మెల్యేలపై పెండింగ్‌లో ఉన్న కేసుల జాబితాను సిజెఐకు అందజేశారు. దేశంలో 2018 నాటికి 1,675 మంది తాజా, మాజీ ఎంపిలు, 2,324 మంది తాజా, మాజీ ఎమ్మెల్యేలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంది. 1,991 కేసుల్లో చార్జ్స్ పెండింగ్‌లో ఉన్నాయని, 2,007 కేసుల్లో ట్రైయిల్ పెండింగ్ ఉందని తెలిపింది. 264 కేసులు హైకోర్టులు, సుప్రీం కోర్టు స్టే విధించడంతో పెండింగ్‌లో ఉన్నాయని, 430 కేసులు జీవిత ఖైదీ, మరణ శిక్షల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. అందులో 180 మంది సిట్టింగ్ ఎంపి, ఎమ్మెల్యే కాగా, 250 మంది మాజీ ఎంపి, ఎమ్మెల్యేలని నివేదిక పేర్కొంది. 2021 డిసెంబర్ నాటికి 4,984 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇందులో 1,899 కేసులు ఐదేళ్లకు పైబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. 2018 అక్టోబర్ 4 తరువాత 2,775 కేసులు కొట్టివేసినట్లు రిపోర్టులో పేర్కొంది. 25 హైకోర్టుల్లో 16 హైకోర్టులు రిపోర్టు సమర్పించాయని, 9 హైకోర్టులు రిపోర్టులు అందజేయలేదని తెలిపింది. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్ముకాశ్మీర్, లడక్, మేఘాలయా, రాజస్థాన్, బీహార్, సిక్కిం రాష్ట్రాలు రిపోర్టు ఇవ్వలేదని అమికస్ క్యూరీ తన రిపోర్టులో పేర్కొంది.

ఏపిలో 92 కేసులు పెండింగ్

ఆంధ్రప్రదేశ్ 92 మందిపై కేసులు ఉండగా, అందులో 50 కేసులు ఐదేళ్లకు పైబడే పెండింగ్‌లో ఉన్నాయని ఏపి హైకోర్టు తెలిపింది. విజయవాడలో జిల్లా అసిస్టెంట్ న్యాయమూర్తి కేడర్‌లో ఒక ప్రత్యేక న్యాయ స్థానం ఉంది. ఏపి హైకోర్టులో 92 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

వీటిలో 57 కేసులు నాన్‌బెయిలబుల్ వారెంట్లు, బెయిలబుల్ వారెంట్లు సమన్ల కోసం పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు తెలిపిందని అమికస్ క్యూరీ నివేదికలో పేర్కొన్నారు. 51 మంది ఎంపి, మాజీ ఎంపిలపై మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం కేసుల్లో నిందితులుగా ఉన్నారని ఇడి తెలిపిందన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సంబంధించి వేర్వేరు దశల్లో 71 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని ఇడి తెలిపిందన్నారు. ఎంపి, ఎమ్మెల్యేలకు సంబంధించి 121 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీరిలో 14 మంది సిట్టింగ్ ఎంపిలు, 34 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నారని సిబిఐ పేర్కొందని నివేదికలో తెలిపారు. ఇద్దరు సిట్టింగ్ ఎంపి, ఎమ్మెల్యేలపై రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) పేర్కొందన్నారు.

కృష్ణా జలాల వినియోగంపై కేంద్రానికి నోటీసులు

- తెలంగాణ, కెఆర్ఎంబి కూడా నోటీసులు జారీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కో, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)లకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఏపి ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది జయదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర విభజన తరవాత 2015లో కుదిరిన జల ఒప్పందాలను తెలంగాణ ఉల్లంఘిస్తోందన్నారు. జలాశయం నుంచి రెండు రాష్ట్రాలు నీరు వాడుకుంటున్నాయని, ఏపి సమ్మతి లేకుండానే జల విద్యుదుత్పత్తికి తెలంగాణ ప్రభుత్వం నీరు విడుదల చేసిందన్నారు. ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలు బోర్డులు తీసుకున్నాయని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తెలిపారు. ఇరు పక్షాల వాదనల అనంతరం బోర్డు ఏర్పడిన తరువాత పురోగతిపై కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కో, కెఆర్ఎంబిలకు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో సమాధానం ఇవ్వాలని, తదుపరి రెండువారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని పేర్కొంది. జనవరి రెండో వారంలో మంగళవారానికి విచారణ వాయిదా వేసింది.

వర్జీనియా వర్శిటీ కేంపస్‌లో కాల్పులు

- ముగ్గురు మృతి

వర్జీనియా : అమెరికా రాష్ట్రమైన వర్జీనియాలో యూనివర్శిటీ కేంపస్‌లో సోమవారం జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించగా, ఇద్దరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఈ కాల్పులు జరిపిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వర్జీనియా యూనివర్శిటీ (యువిఎ) ప్రధాన కేంపస్ అయిన చార్లెట్స్‌విల్లేను మూసివేశారు. యూనివర్శిటీలో విద్యార్థి క్రిస్టోఫర్ డార్నెల్ జోన్స్ ఈ కాల్పులకు పాల్పడి వుంటాడని అనుమానిస్తున్నట్లు యువిఎ అధ్యక్షుడు జిమ్ రియాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదాహో రాష్ట్రంలో జరిగిన మరో ఘటనలో నలుగురు విద్యార్థులు మరో యూనివర్శిటీ కేంపస్‌కి సమీపంలో గల ఇంట్లో చనిపోయి కనిపించారని పోలీసులు తెలిపారు.

ఢిల్లీలో దారుణం

- ప్రియురాలిని ముక్కలుగా నరికిన ఉన్మాది



ఢిల్లీ : ఢిల్లీలో అమానుష ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెళ్లి చేసుకోవాలని అడిగిన ప్రియురాలిని దారుణంగా హత్య చేసి, ఆమె దేహాన్ని 35 ముక్కలుగా నరికేశాడు. మే 18న ఈ హత్య జరగ్గా... ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఢిల్లీ దక్షిణ జిల్లా అడిషనల్ డిసిపి-1 అంకిత్ చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ముంబైలోని మల్టీ నేషనల్ కంపెనీ కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న సమయంలో 26 ఏళ్ల శ్రద్ధ వాకర్, అఫ్తాబ్ అమీన్ పూనావాలా ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి వారి కుటుంబాలు అంగీకరించకపోవడంతో ఏప్రిల్ చివరి వారం లేదా మే మొదటి వారంలో వారు ఢిల్లీ వచ్చి, మెహ్రౌలిలోని అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్నారు. వీరి మధ్య వివాహం విషయమై వివాదం రావడంతో, ఆమె గొంతు కోసి చంపేశాడు. ఆమె మృతదేహాన్ని 35 ముక్కలుగా నరికి ఫ్రిజ్‌లో దాచాడు. 18 రోజుల పాటు ఢిల్లీలోని మెహ్రౌలీ అడవుల్లో పడేశాడు. నిందితుడు అఫ్తాబ్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. ఆమె ఫోన్ అందుబాట్లో లేకపోవడం, స్నేహితురాలు ఇచ్చిన సమాచారంతో శ్రద్ధ తండ్రి వికాస్ మదన్ వాకర్ ముంబై పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేశారు.



శాంతివన్ వద్ద నివాళులర్పిస్తున్న సోనియాగాంధీ, ఖర్గే తదితరులు

ఆధునిక భారత నిర్మాత నెహ్రూ

- సోనియా సహా పలువురి నివాళి

న్యూఢిల్లీ : భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 133వ జయంతిని సోమవారం దేశవ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు ఘనంగా నివాళులర్పించారు. న్యూఢిల్లీలో నెహ్రూ స్మారక చిహ్నం శాంతివన్ వద్ద కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తదితరులు నెహ్రూకు నివాళులర్పించారు. సోషల్ మీడియా ద్వారా పలువురు నేతలు నివాళులర్పించారు. నెహ్రూను ఆధునిక భారత నిర్మాతగా కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అభివర్ణించారు. నెహ్రూ అద్భుతమైన సహకారం లేకుండా 21వ శతాబ్దపు భారతదేశాన్ని ఊహించలేమన్నారు. నెహ్రూ ప్రగతిశీల ఆలోచనలు భారతదేశ సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లాయని ఖర్గే ట్వీట్ చేశారు.

నెహ్రూ సేవలను గుర్తుచేసుకున్నాం : మోడీ

జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి మోడీ నివాళులర్పించారు. దేశానికి నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. 'జయంతి సందర్భంగా మాజీ ప్రధాని నెహ్రూజీకి నివాళులు. దేశానికి నెహ్రూ చేసిన సేవలను గుర్తు చేసుకున్నాం' అని మోడీ ట్వీట్ చేశారు.

అభిషేక్ బోయినపల్లికి బెయిల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం విధానం అవకతవకలపై సిబిఐ కేసుకు సంబంధించి హైదరాబాద్ వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లి, ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌ఛార్జి విజయ్ నాయర్‌కు సిబిఐ ప్రత్యేక కోర్టు బెయిలు ఇవ్వగా, ఇడి అభ్యర్థన మేరకు ఐదు రోజుల కస్టడీకి అనుమతించింది. అభిషేక్, విజయనాయర్ బెయిలు పిటిషన్లు విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఎంకె నాగపాల్ రూ.2 లక్షల పూచీకత్తుపై బెయిలు మంజూరు చేశారు. మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణ నిమిత్తం ఐదు రోజుల ఇడి కస్టడీకి అనుమతించింది.

మరోసారి డి.కె శివకుమార్‌ని విచారించిన ఇడి

నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షులు డికె శివకుమార్‌ను ఇడి సోమవారం మళ్లీ విచారించింది. ఢిల్లీలోని ఇడి కార్యాలయంలో శివకుమార్‌ను ఇడి విచారించడం ఇది రెండోసారి. యంగ్ ఇండియన్‌కు వివరాలు లేని భారీ మొత్తాన్ని శివకుమార్, సురేష్ విరాళంగా ఇచ్చారని ఇడి పేర్కొంటోంది.

రాజధాని, రాష్ట్ర విభజనపై వేర్వేరుగా విచారణ

- 28కి విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అమరావతి రాజధాని, రాష్ట్ర విభజన పిటిషన్లపై వేర్వేరుగా విచారిస్తామని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ రెండు అంశాలపై అమరావతి రైతులు, రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన 36 పిటిషన్లను సోమవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసఫ్, జస్టిస్ హృషికేష్ రాయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ వాదనలు వినిపిస్తూ ఈ పిటిషన్లు రెండు బ్యాచ్‌లుగా ఉన్నాయని, ఒకటి ఏపి, తెలంగాణకు సంబంధించిన రాష్ట్ర విభజనకు సంబంధించిన పిటిషన్లని, మరో బ్యాచ్‌లో అమరావతి రాజధాని అభివృద్ధికి సంబంధించి నవని పేర్కొన్నారు. విభజన చట్టానికి సంబం ధించిన 28, రాజధానికి సంబంధించిన 8 పిటిషన్లు దాఖలు అయ్యాయని జస్టిస్ కెఎం జోసఫ్ తెలిపారు. ఈ మొత్తం 36 పిటిషన్లను మొదట సబ్ డివిజన్ చేస్తామని స్పష్టం చేశారు. ఒక్క పిటిషన్‌కు కూడా నోటీసులివ్వలేదని అభిషేక్ మనుసింఘ్వీ తెలపగా, రైతుల తరపు సీనియర్ న్యాయవాది పాలీ ఎస్. నారీమన్ జోక్యం చేసుకొని ఒకదానికి నోటీసులు ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ వాదనలు వినిపించారు. మూడు రాజధానుల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్న తరువాత కూడా హైకోర్టు నిషేధిస్తూ తీర్పు ఇచ్చిందని, ఇది న్యాయ పరిధికి బయట అంశమని పేర్కొన్నారు. న్యాయ, శాసన, కార్యనిర్వహక వ్యవస్థలు ఎక్కడ కూర్చొని పని చేయాలనే అంశాన్ని హైకోర్టు తీర్పు నిషేధిస్తుందని అన్నారు. శాసన వ్యవస్థను నిషేధించలేమని, శాసన వ్యవస్థ తన పని చేయకూడదని హైకోర్టు, సుప్రీం కోర్టులు చెప్పలేవని పేర్కొన్నారు. దీన్ని తాము వ్యతిరేకిస్తున్నామని రైతుల తరపున సీనియర్ న్యాయవాది శ్యాం దివాన్ అన్నారు. రాజధాని కోసం 29 వేల మందికి పైగా భూములు ఇచ్చారని, వారు గురించి తాము మాట్లాడుతున్నామని రైతుల తరపున మరో న్యాయవాది రంజిత్ కుమార్ లేవనెత్తారు. ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ వాదనలు వినిపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని ఉపసంహరించుకున్న తరువాత కూడా హైకోర్టు ఇలా చేయండని పేర్కొనడం ఎంత వరకు సబబని అన్నారు. రాజధానిని నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్న హైకోర్టు తీర్పును ప్రభుత్వ న్యాయవాది వైద్యనాథన్ చదివి వినిపించారు. ఏపి హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని కోరినట్లు న్యాయవాది వైద్యనాథన్ పేర్కొన్నారు. ఈనెల 28న అన్ని అంశాలను పరిశీలిస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. అదే రెండో విభజన చట్టం, రాజధాని కేసులో వేర్వేరుగా విచారిస్తామని పేర్కొన్నారు.

'కమీషన్లు ఇవ్వనిదే ఏదీ జరగదు'

- ఉత్తరాఖండ్ మాజీ సిఎం తీరత్‌సింగ్

డెహ్రాడూన్: తమ రాష్ట్రంలో కమీషన్లు ఇవ్వనిదే ఏ పని జరగదని ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తీరత్ సింగ్ రావత్ వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. బిజెపి సీనియర్ నేత, మాజీ సిఎం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వాన్ని ఇరుకునపడేసింది. ఆ వీడియోలో తీరత్ సింగ్ ఓ గదిలో కూర్చుని రాష్ట్రంలోని 'కమీషన్‌ఖోరి' గురించి మాట్లాడారు. "నేను ముఖ్యమంత్రిగా పనిచేశాను. బహుశా ఇలాంటివి చెప్పకూడదేమో. ఉత్తరాఖండ్‌లో కమీషన్లు ఉన్నాయని నేను నిస్సందేహంగా అంగీకరిస్తాను. మా రాష్ట్రం ఉత్తరప్రదేశ్ నుంచి విడిపోయే సమయంలో ప్రజా పనులు జరగాలంటే 20శాతం వరకు కమీషన్లు ఇవ్వాల్సి వచ్చేది. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇవి తగ్గాల్సింది. కానీ, ఆ ప్రాక్టీస్ కొనసాగడమే గాక.. కమీషన్లు 20శాతం నుంచి ప్రారంభమయ్యాయి. కొంత మొత్తాన్ని కమీషన్‌గా ఇస్తేనేగానీ ఉత్తరాఖండ్‌లో ఎవరికీ ఏ పనీ జరగదు. దీనికి ఫలానా వారే బాధ్యులని నేను చెప్పలేను. కానీ ఇదో అలవాటుగా మారింది. మన రాష్ట్రాన్ని మన కుటుంబం లా చూసినప్పుడే ఇది పోతుంది" అని తీరత్ వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లలో ప్రస్తుతం బిజెపినే అధికారంలో ఉండటం గమనార్హం.



మీ కోసం

ప్రతి రోజూ 8 నుంచి 10 గ్లాసుల నీళ్లుతాగడం వల్ల మన శరీరానికి కావాల్సినంత తేమ అందుతుంది. కళ్లు కూడా పొడిబారకుండా ఉంటాయి.

జీవన సౌరభం

అన్నీ కోల్పోయినా.. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు. ఆత్మవిశ్వాసం వుంటే మనం కోల్పోయిన వాటన్నింటినీ తిరిగి దక్కించుకోవచ్చు.

ప్లాస్టిక్ -అనర్థాలు



వీడిదెము వీడిదెము
ప్లాస్టిక్‌ను వీడిదెము
ప్లాస్టిక్‌ను వీడిన, మంచి
జీవితాన్ని గడిపెదము!

అందరికీ దూరంగా
ప్లాస్టిక్‌ను ఉంచెదము
కాలుష్యం బారినుండి
కాపాడుకొనెదము ...

ప్లాస్టిక్కు బొమ్మలతో
ఆడకుండా ఆపుదము
మట్టి, చెక్క బొమ్మలతో
పిల్లల నాడిపించెదము

ప్లాస్టిక్కును వాడితేను
వ్యాధుల బారినపడిదెము


పర్యావరణ పరంగాను
సమస్యలెదుర్కొనెదము

రాగి, స్టీలు పాత్రలను
విరివిగాను వాడెదము
ఆరోగ్యము పొందుతూ
హాయిగా ఉండెదము!

\- రావిపల్లి వాసుదేవరావు
94417 13136

లెక్క తేల్చండి

చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.



జవాబు : 100

నేను గీసిన బొమ్మ





\- పి. శిరీషా, 6వ తరగతి, ఎంపియుపి స్కూలు, సుతారపల్లి, రామయంపేట, మెదక్ జిల్లా.

గుండె పదిలం



మారుతున్న జీవనశైలి, ఆహారపుటలవాట్లు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న వేళ ... ఒకప్పుడు ఐదు పదులు దాటిన తరువాత తరచుగా సంభవించే గుండెపోటు ముప్పు ఇప్పుడు 30 లోపు యువకులను కూడా కబళిస్తోంది. కుటుంబంలో గుండెపోటు చరిత్ర లేని వారు కూడా హఠాత్ మరణాలకు గురౌతున్నారు. జీవనశైలి, ఒత్తిడి, ఇతర అనారోగ్య సమస్యలకు తోడు కరోనా తర్వాత ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి మునుపటిలా లేదు. దీంతో గుండెపోటుకు ఇతమిద్ధంగా ఇదీ కారణమని చెప్పలేని పరిస్థితులు కనపడుతున్నాయి.



ప్రస్తుత పరిస్థితుల్లో మన ఆరోగ్య పరిస్థితిని అంచనా వేసేముందు కరోనా ముందు, ఆ తర్వాత అని బేరీజు వేసుకోవాల్సి ఉంది. అంతలా మన ఆరోగ్యశైలిలో మార్పు కనిపిస్తోంది. పోస్ట్ కోవిడ్ సమస్యలతో ఆస్పత్రి పాలయ్యేవారు ఎక్కువయ్యారు. అంతర్గత అవయవాల పనితీరులో సమతుల్యత దెబ్బతింది. ప్రస్తుతం కరోనా కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టినా ఆరోగ్యంపై పడిన ప్రభావం మాత్రం దీర్ఘకాలం కొనసాగుతుందని వైద్యులు చెబుతున్నారు.


కరోనా కూడా ఒక కారణం..

కోవిడ్-19 వల్ల శ్వాసకోశ వ్యాధులతోపాటు గుండెపోటు లాంటి ముప్పులు కూడా పెరుగుతాయని గతంలో అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. గతంలో ప్రపంచాన్ని కబళించిన మహమ్మారుల వ్యాప్తికి సంబంధించిన అధ్యయనాలను పరిశీలించినప్పుడు అకాల మరణ ముప్పు, జీవిత కాలం తగ్గిపోవడం వంటి సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

1918లో స్పానిష్ ఫ్లూ వ్యాప్తి తర్వాత, సాధారణ లక్షణాలతోపాటు కొన్ని తీవ్రమైన దుష్ప్రభావాలు కూడా కనిపించాయి. వరుసగా పెరుగుతూ వచ్చిన గుండె పోటు కేసుల్లో 1940 నుంచి 1959 మధ్య ఒక్కసారిగా పెరుగుదల కనిపించింది.

కోవిడ్-19 వ్యాప్తి మొదలైనప్పుడు నిర్వహించిన పరిశోధనల సమాచారం ప్రకారం, కరోనా వైరస్ ఇన్ఫెక్షన్‌తో గుండె పోటు ముప్పు కూడా పెరుగుతుంది. దీనివల్ల గుండె ఆగిపోవడం, మయోకార్డియల్ డామేజ్, అరిథమియా, ఎక్యూట్ కరోనరీ సిండ్రోమ్ లాంటి సమస్యల ముప్పు ఎక్కువ అవుతున్నట్లు వెలుగులోకి వచ్చింది.

ఒక కొత్త వైరస్‌పై రోగ నిరోధక వ్యవస్థ పోరాటం మొదలు పెట్టినప్పుడు.. ఒక్కోసారి గుండె రక్తనాళాలు దెబ్బతినే ముప్పు ఉంటుంది. రక్త నాళాలు కుంచించుకుపోతాయి. ఫలితంగా వాటిలో రక్తం సాఫీగా ప్రసరించదు. దీన్నే వ్యాస్కులర్ ఇన్‌ఫ్లమేషన్‌గా పిలుస్తారు. దీంతో అప్పటికే గుండె సమస్యలతో బాధపడేవారికి ముప్పు మరింత ఎక్కువవుతుంది.



అధిక ఒత్తిడి, వ్యాయామాలు..

ఆరోగ్యం కోసం కసరత్తు చేయడం అనాదిగా వస్తున్న అలవాటు. అయితే దేనికైనా కొన్ని పరిమితులు ఉంటాయి. హద్దులు దాటినప్పుడు విపరీతాలు సంభవిస్తాయి. రాను రాను ఆరోగ్యం స్థానంలో ఆకారంపై శ్రద్ధ ఎక్కువైంది. ఛాతీ వెడల్పు, భుజం చుట్టుకొలత, కండలు తిరిగిన శరీరమే లక్ష్యంగా గంటల తరబడి కసరత్తు చేయడం మొదలైంది. శరీర దారుఢ్యంపై యువతలో పెరుగుతున్న ఆసక్తి ఇబ్బడిముబ్బడిగా జిమ్ కల్చర్ పెరగడానికి దోహదపడేలా చేసింది. నిపుణుల శిక్షణ, నియమ నిబంధనలు, వయసుకు తగ్గ బరువులు ఎత్తడం, పోషకాహారం తీసుకునే స్థాయిలు వ్యాయామంలో చాలా కీలకం. కానీ అవేమీ పట్టించుకోకుండా శక్తికి మించి బరువులు మోయడం, పరుగులు పెట్టడం, బస్కీలు తీయడంతో శరీర అవయవాలు విపరీత ఒత్తిడికి గురవుతున్నాయన్న సంగతి మర్చిపోతున్నారు. ఇవే గుండె ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నాయి.

ఈ మధ్యకాలంలో జిమ్‌లో వర్కౌట్స్ చేస్తూ కుప్పకూలిపోయిన సెలబ్రిటీల వార్తలు వింటున్నాం. యూట్యూబ్‌ల్లో కూడా జిమ్ చేస్తూ మరణించిన యువకుల వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఈ పరిణామమే చాలామందిని కలవరపెడుతోంది. ఏడాది కాలంలో చిత్రరంగంలో కొంతమంది నటులు జిమ్ చేస్తూ మరణించారు. సిద్ధార్థ్ శుక్లా, పునీత్ రాజ్‌కుమార్, రాజు శ్రీవాస్తవ, తాజాగా బాలీవుడ్ బుల్లితెర నటుడు వర్కౌట్స్ చేస్తూ హఠాత్తుగా గుండెపోటు వచ్చి చనిపోయారు.



జిమ్ లేదా ఇతర ఏదేని వ్యాయామం చేసినప్పుడు గుండెపై కచ్చితంగా ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా జిమ్, రన్నింగ్, జాగింగ్ వంటివి చేసినప్పుడు గుండె వేగం, బీపీ పెరుగుతాయి. జిమ్‌లో మోతాదుకు మించి కసరత్తు చేయడం వల్ల గుండె స్పందనల్లో వ్యత్యాసం ఎక్కువవుతుంది.

హార్ట్‌బీట్‌లో మార్పులు

ఆరోగ్యవంతుల్లో సాధారణ హార్ట్‌బీట్ అనేది 60 నుంచి 90 మధ్యలో ఉంటుంది. జిమ్ లేదా ఇతర వ్యాయామాలు చేసినప్పుడు హార్ట్‌బీట్ పెరగడం సహజం. ఇలాంటి సమయాల్లో గుండె వేగం 120 నుంచి 140 వరకు వెళ్తుంది. వ్యాయామం తరువాత 3 నిమిషాల్లో తిరిగి సాధారణ స్థాయికి చేరుకుంటుంది. వ్యాయామం చేసినప్పుడు హార్ట్‌బీట్ 140 దాటినా లేక వ్యాయామం తరువాత 3 నిమిషాల్లో సాధారణ స్థాయికి చేరకపోయినా సదరు వ్యక్తికి గుండె సమస్యలున్నట్టు అనుమానించాలి. సామర్థ్యానికి మించి తీవ్రమైన వ్యాయామం చేస్తే హార్ట్‌బీట్ 140 దాటి ఒక్కసారిగా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది.

ఎప్పుడు గుండెపోటు రావొచ్చు?

'సాధారణంగా జిమ్ చేసే సమయంలో గుండెపోటు రావడానికి పలు కారణాలున్నాయి. అందులో ప్రధాన కారణం.. హైపర్‌ట్రోఫిక్ అబస్ట్రక్టివ్ కార్డియోమయోపతి (హెచ్‌వోసీఎం). ఇది వంశపారంపర్యంగా ఉండే గుండె జబ్బు. ఈ జబ్బు ఉన్నవారికి 50 ఏళ్లు వచ్చినా ఎలాంటి లక్షణాలు బయటపడవు. సాధారణ జీవితమే గడుపుతారు. శారీరక శ్రమ అధికమైనప్పుడు, ఒత్తిడి పెరిగినప్పుడు మాత్రమే లక్షణాలు బయట పడతాయి. ఎక్కువగా జిమ్, జాగింగ్ వంటి వ్యాయామాలు చేసినప్పుడు హఠాత్తుగా గుండెపోటు వచ్చే అవకాశాలు ఈ సమస్య ఉన్నవారిలో అధికం. ఇది కాకుండా ఊబకాయం, హైపర్‌టెన్షన్, నియంత్రణ కాని మధుమేహం వంటి సమస్యలున్న వారికి సైతం వ్యాయామం చేస్తున్నప్పుడు గుండె సమస్యలు రావచ్చ'ని వైద్య నిపుణులు చెబుతున్నారు.

(వైద్య నిపుణుల సూచనల ఆధారంగా)

\- జీవన



'లాఠీ' టీజర్ విడుదల

హీరో విశాల్ కథానాయకుడిగా ఏ వినోద్ కుమార్ దర్శకత్వంలో రానా ప్రొడక్షన్స్‌పై రాబోతోన్న చిత్రం 'లాఠీ'. రమణ, నంద సంయుక్త నిర్మాణంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో సునయన హీరోయిన్‌గా చేస్తున్నారు. తెలుగు, తమిళ్, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో డిసెంబర్ 22న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్ర టీజర్, ఫస్ట్ సింగిల్, గ్లింప్స్ లాంచింగ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని టీజర్ లాంచ్ చేశారు. హీరో కార్తికేయ, శివబాలాజీ, మధుమిత, అభినయ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల చిత్రం 'అచీవర్'

ప్రస్తుతం వస్తున్న కమర్షియల్ చిత్రాల మధ్య విడుదల అవుతున్న చిన్నారుల చిత్రం 'అచీవర్'. తల్లాడ సాయికృష్ణ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం చిన్న పిల్లల ఆలోచనా విధానంపైన ప్రభావం చూపించే విధంగా ఉందని సెంట్రల్ సెన్సార్ బోర్డ్ మెంబర్ మొగులపల్లి ఉపేంద్ర గుప్త అన్నారు. చిల్డ్రన్స్ డే సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముగ్గురు చిన్నారులు చదువుకుంటూనే తెలివితేటలతో తీవ్రవాదులను ఎలా ఎదుర్కొన్నారనే కథాంశంతో ఈ సినిమా తీశారు. సినిమాలో నటించిన కపిల్, చాణక్య, విశ్వతేజల చదువులకు ఇబ్బంది కాకుండా దసరా సెలవుల్లోనే షూటింగ్ పూర్తి చేసుకున్నారు. వెంకటేష్ ఉప్పల సంగీతం అందించగా, తుమ్మలపల్లి రామసత్యనారాయణ నిర్మించారు.



షూటింగ్‌లో స్పృహతప్పి పడిపోయిన నాగశౌర్య



ఒక పోరాట సన్నివేశం చిత్రీకరిస్తుండగా హీరో నాగశౌర్య ఒక్కసారిగా స్పృహతప్పి కిందపడిపోయారు. యూనిట్ సభ్యులు వెంటనే అతన్ని ఎ.ఐ.జి. హాస్పిటల్‌కి తరలించారు. ఈనెల 20న ఆయన వివాహం జరగనుండగా అటు వివాహ పనులు, ఇటు సినిమా షూటింగ్ రెండూ విరామం లేకుండా గడుపుతున్నారని తెలుస్తోంది. 'డి-హైడ్రేషన్ వలన అలా పడిపోయాడు. జ్వరం కూడా 105 డిగ్రీలు ఉంది, అయినా షూటింగ్‌కి వెళ్లాడు. అది పోరాట సన్నివేశం అవ్వడం వల్ల పడిపోయాడ'ని తండ్రి శంకర్ ప్రసాద్ తెలిపారు.

'జపాన్' ఫస్ట్ లుక్



హీరో కార్తి కథానాయకుడిగా డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మాణంలో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఆర్ ప్రకాష్ బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. కార్తికి ఇది 25వ సినిమా. తాజాగా 'జపాన్' ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు నిర్మాతలు. అను ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సునీల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంతో సునీల్ తమిళ్‌లో అరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.


ప్రస్తుతం కార్తి ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్‌కు గురైంది. ఈ విషయాన్ని ఆయనే ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. 'హాయ్ ఆల్. నా ఫేస్ బుక్ పేజీ హ్యాక్ అయ్యింది. ప్రస్తుతం టెక్నికల్ టీంతో కలిసి పనిచేస్తున్నాం. త్వరలోనే అకౌంట్‌ను తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తాం' అని ట్వీట్ చేశారు.

'ఎర్రర్-500' ట్రైలర్ విడుదల



మైత్రేయ మోషన్ పిక్చర్స్ పతాకంపై యు.బాలరెడ్డి నిర్మాతగా యువ నటులు జస్వంత్ పడాల (జెస్సీ), నక్షత్ర త్రినయని ప్రధాన పాత్రలలో నూతన దర్శకుడు సాందీప్ మైత్రేయ ఎన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎర్రర్-500'. తాజాగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేశారు. దర్శకుడు వి. ఎన్ ఆదిత్య, హీరో ఆకాష్ పూరితో పాటు బిగ్‌బాస్ రవి, సోహెల్, సిరి, కాజోల్, నేహా చౌదరి, అర్జున్ కళ్యాణ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మమతామోహన్ దాస్ పుట్టినరోజు కానుక



మలయాళ హీరోయిన్ మమతామోహన్ దాస్ ప్రస్తుతం ఓ చిత్రంలో నటిస్తున్నారు. రుద్రాంగి పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రం టైటిల్‌ను చిత్రబృందం ప్రకటించింది. సోమవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా ఆమెకు కానుకగా చిత్రం టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసింది. మలయాళంలో సోషల్ థ్రిల్లర్ బ్యాక్ డ్రాప్‌లో నటిస్తోన్న చిత్రానికి 'లైవ్' అనే ఆసక్తికర టైటిల్‌తో పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఫిలిమ్స్ 24 బ్యానర్‌పై దర్పన్ బంగేజా, నితిన్ కుమార్ నిర్మిస్తున్నారు.

నిఖత్ జరీన్‌కు అర్జున



30న అవార్డు ప్రదానం

న్యూఢిల్లీ: ప్రపంచ మహిళల బాక్సింగ్ ఛాంపియన్, హైదరాబాద్‌కు చెందిన నిఖత్ జరీన్ అర్జున అవార్డుకు ఎంపికైంది. ఈనెల 30న న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జరిగే అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా నిఖత్ ఈ అవార్డును అందుకోనుంది. అలాగే షట్లర్లు లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్‌తోపాటు అథ్లెట్లు ఎల్డోస్ పాల్, అవినాష్ సాబ్లేలతో సహా మొత్తం 25 మంది అథ్లెట్లు ఈ ఏడాదికి అర్జున అవార్డుకు ఎంపికయ్యారని, రాష్ట్రపతి భవన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే కార్యక్రమంలో అవార్డు గ్రహీతలు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటారని యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. రెగ్యులర్ కేటగిరీలో జీవన్‌జోత్ సింగ్ తేజ(ఆర్చరీ), మహ్మద్ అలీ కమర్ బాక్సింగ్), సుమ సిద్ధార్థ్ షిరూర్(పారాషూటింగ్), సుజీత్ మాన్ (రెజ్లింగ్) ద్రోణాచార్య అవార్డుకు ఎంపికయ్యారు. దినేష్ జవహర్ లాడ్(క్రికెట్), బిమల్ ప్రఫుల్లా ఘోష్(ఫుట్‌బాల్), రాజ్‌సింగ్ జీవితకాల పురస్కారాలను అందుకోనున్నారు. అశ్విని అక్కుంజి(అథ్లెటిక్స్), ధరమ్వీర్ సింగ్(హాకీ), బిసి సురేష్(కబడ్డీ), నిర్ బహదూర్ గురుంగ్(పారా అథ్లెటిక్స్) క్రీడలు మరియు ఆటలలో జీవితకాల సాధనకు ధ్యాన్ చంద్ అవార్డును పొందుతారు. వర్ధమాన, యువ ప్రతిభను గుర్తింపుగా ఇచ్చే రాష్ట్రీయ ఖేల్ ప్రోతాహన్ పురస్కారాన్ని కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ, లడఖ్ స్కీ స్నోబోర్డ్ అసోసియేషన్ కార్పొరేట్ సామాజిక బాధ్యత మరియు క్రీడల ద్వారా క్రీడలను ప్రోత్సహించడానికి నామినేట్ చేయబడ్డాయి.

మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డు(2022) : ఆచంట శరత్ కమల్

అర్జున్ అవార్డు : సీమా పునియ, ఎల్డోజ్ పాల్, అవినాశ్ సాబ్లే(అథ్లెటిక్స్), లక్ష్యసేన్, హెచ్‌ఎస్ ప్రణయ్(బ్యాడ్మింటన్), అమిత్, నిఖత్ జరీన్(బాక్సింగ్), భక్తి ప్రదీప్ కులకర్ణి, ఆర్.ప్రజ్ఞానంద(చెస్), దీప్ గ్రేస్ ఎక్కా(హాకీ), సుశీలా దేవి(జుడో), సాక్షి కుమారి(కబడ్డీ), నయాన్ మౌనీ సకియా(లాన్‌బౌల్), సాగర్ కైలాస్(మల్లకంబ్), ఇలవేని వలరివాన్, ఓంప్రకాశ్ మిథర్వాల్(షూటింగ్), శ్రీజ ఆకుల(టేబుల్ టెన్నిస్), వికాశ్ ఠాకూర్, అన్షు, సరిత(వెయిట్‌లిఫ్టింగ్), పర్వీన్(వుషూ), మానసి గిరిశ్చంద్ర జోషి, తరుణ్ దిల్లాన్(పారా బ్యాడ్మింటన్), స్వప్నిల్ సంజయ్ పాటిల్(పారా స్విమ్మింగ్), జర్లిన్ అనిక(డెఫ్ బ్యాడ్మింటన్).

ద్రోణాచార్య అవార్డు(స్పోర్ట్స్-రెగ్యులర్): జీవన్‌జిత్ సింగ్(ఆర్చరీ), మహ్మద్ అలీ ఖమర్(బాక్సింగ్), సుమ సిద్ధార్థ్(పారా షూటింగ్), సుజిత్ మాన్(రెజ్లింగ్)

లైఫ్‌టైమ్ కేటగిరీ: దినేశ్ జవహర్ లాడ్(క్రికెట్), బిమల్ ప్రఫుల్లా ఘోష్(ఫుట్‌బాల్), రాజ్‌సింగ్(రెజ్లింగ్)

ధ్యాన్‌చంద్(లైఫ్‌టైమ్): అశ్విని అకుంజి(అథ్లెటిక్స్), ధర్మవీర్ సింగ్(హాకీ), బిసి సురేశ్(కబడ్డీ), నిర్ బహదూర్ గరుంగ్(పారా అథ్లెటిక్స్)

రాష్ట్రీయ ఖేల్ ప్రస్థాన్ పురస్కార్-2022: థన్‌స్టాడియా ఎంటర్ ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్, కలింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ, లడక్ కి అండ్ స్నోబోర్డ్ అసోసియేషన్

మౌలానా అబుల్ కలామ్ అజాద్ ట్రోఫీ-2022: గురునానక్ దేవ్ యూనివర్శిటీ, అమృత్‌సర్.


ఉత్తమ ఆటగాళ్లుగా కోహ్లి, సూర్యకుమార్

టి20 ప్రపంచకప్ అత్యుత్తమ జట్టును ప్రకటించిన ఐసిసి

దుబాయ్: టి20 ప్రపంచకప్‌లో అత్యంత విలువైన ఆటగాళ్లతో కూడిన జట్టును అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) సోమవారం వెల్లడించింది. టీమిండియా స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, సూర్యకుమార్ ఈ జాబితాలో స్థానం దక్కించుకున్నారు. విరాట్ కోహ్లి టోర్నీలో 98.66సగటుతో 296 పరుగులు చేసిన ముందు వరసలో నిలిచాడు. పాక్‌పై అద్భుతంగా ఇన్నింగ్స్ ఆడిన విరాట్ కోహ్లి (82నాటౌట్) ఒంటిచేత్తో జట్టును గెలిపించిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌పై 64, నెదర్లాండ్స్ మీద 62, ఇంగ్లాండ్‌తో 50 పరుగులు చేసి టీ20 ప్రపంచకప్‌లో విరాట్ అత్యుత్తమ బ్యాటర్‌గా నిలిచాడు. అలాగే 239పరుగులతో రాణించిన సూర్యకుమార్ కూడా చోటు దక్కించుకున్నాడు. నెదర్లాండ్స్‌తో 51, దక్షిణాఫ్రికాతో 68, జింబాబ్వేతో 61 పరుగులు చేసి మూడు అర్థ సెంచరీలను తన ఖాతాలో వేసుకున్న ఈ ఆటగాడు అద్భుతమైన స్ట్రైకరేట్(189.68)ను ప్రదర్శించాడు. మొత్తం ఆరు దేశాల జట్లను ఇందుకోసం ఎంపిక చేశారు. కప్ గెలిచిన ఇంగ్లండ్, రన్నరప్‌గా నిలిచిన పాకిస్తాన్, సెమీ ఫైనల్‌కు చేరుకున్న భారత్, న్యూజిలాండ్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి.

ఐసిసి టి20 ప్రపంచకప్ అత్యుత్తమ జట్టు: జోస్ బట్లర్, అలెక్స్ హేల్స్, సామ్ కరన్, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్, గ్లెన్ ఫిలిప్స్, సికిందర్ రాజా, షాదాబ్ ఖాన్, అన్రిచ్ నోర్జే, మార్క్ వుడ్, షామిన్ షా అఫ్రిది, హార్దిక్ పాండ్యా(12వ ఆటగాడు)

ఫిఫా సంగ్రామానికి ఖతార్ సిద్ధం



దోహా: ఖతార్ వేదికగా ఈనెల 20నుంచి ఫిఫా ప్రపంచకప్ ఫుట్‌బాల్ సంగ్రామం ప్రారంభం కానుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రజాదరణ పొందిన ఫుట్‌బాల్ పండుగ మరో నాలుగురోజుల్లో ఆసియా ఖండంలో జరగనుంది. ఆతిథ్య హోదాలో ఖతార్‌జట్టుకు నేరుగా ప్రధాన టోర్నీలో ఆడే అవకాశం దక్కగా.. ఆ జట్టు గ్రూప్-ఏలో చోటు దక్కించుకుంది. ఆసియా ఖండానికే చెందిన ఇరాన్‌కు గ్రూప్-బిలో, దక్షిణ కొరియాకు గ్రూప్-హెచ్‌లో చోటు దక్కింది.

గ్రూప్‌లవారీగా ఆయా జట్లు..

గ్రూప్-ఏ : ఖతార్, ఈక్వెడార్, సెనెగల్, నెదర్లాండ్స్
గ్రూప్-బి : ఇంగ్లండ్, ఇరాన్, అమెరికా, వేల్స్
గ్రూప్-సి : అర్జెంటీనా, సౌదీ అరేబియా, మెక్సికో, పోలండ్
గ్రూప్-డి : ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, డెన్మార్క్, ట్యునీషియా
గ్రూప్-ఇ : స్పెయిన్, కోస్టారికా, జర్మనీ, జపాన్
గ్రూప్-ఎఫ్: బెల్జియం, కెనడా, మొరాకో, క్రొయేషియా
గ్రూప్-జి : బ్రెజిల్, సెర్బియా, స్విట్జర్లాండ్, కామరూన్
గ్రూప్-హెచ్ : పోర్చుగల్, ఘనా, ఉరుగ్వే, దక్షిణకొరియా.



యాషెస్ సిరీస్ తర్వాత టెస్టులకు వార్నర్ గుడ్‌బై?

సిడ్నీ: ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్, ఓపెనర్ డేవిడ్ వార్నర్ టెస్టులకు గుడ్ బై చెప్పనున్నాడు. వచ్చే ఏడాది జరిగే యాషెస్ సిరీస్ అనంతరం టెస్టు మ్యాచులకు వీడ్కోలు పలికే ఆలోచనలో ఉన్నట్లు ఓ కార్యక్రమంలో తెలిపాడు. తాను మాత్రం వన్డే, టీ20లు ఆడేందుకు మాత్రం తాను ఆసక్తి కనబరుస్తున్నట్లుగా తెలిపాడు. "బహుశా అన్నింటికన్నా ముందు కాలం చెల్లేది టెస్టు క్రికెట్‌కే. ఈ ఫార్మట్‌లో ఇదే నా చివరి 12 నెలలు కావచ్చు. భవిష్యత్తులో క్రికెట్‌పై నాకున్న అవగాహనను ముందు తరాల వారికి అందించాలనుకుంటున్నాను" అని వార్నర్ తెలిపాడు. వచ్చే ఏడాది జరిగే ఐపిఎల్‌కు ఆస్ట్రేలియా టి20 కెప్టెన్ ఆరోన్ ఫించ్ దూరమయ్యా అవకాశముంది. 2021 టి20 ప్రపంచకప్ నెగ్గిన ఆస్ట్రేలియా జట్టుకు కెప్టెన్‌గా ఉన్న ఫించ్.. ఈ ఏడాది స్వదేశంలో జరిగిన ప్రపంచకప్‌లో జట్టును సెమీస్‌కు చేర్చడంలో విఫలమైన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68